www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 8-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 264 | విజయవాడ సిటీ**

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 12.00 తదుపరి త్రయోదశి; నక్షత్రం: అనూరాధ రా. 10.04 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: తె. 3.27-5.00; దుర్ముహూర్తం: మ. 12.44-1.28, మ. 2.56-3.40; అమృతఘడియలు: ఉ. 11.42-1.17; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.53

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## 22,000 పైన బుల్లిష్

(జనవరి 8-12 తేదీల మధ్య వారాని


డా. భువనగిరి అమరనాథ్ శాస్త్రి

అస్ట్రో టెక్

**గత వారం నిఫ్టీ:** 21,710 (-21)

నిఫ్టీ గత వారం 21,834-21,500 పాయింట్ల మధ్యన కదలాడి 21 పాయింట్ల నష్టంతో 21,710 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 20,981, 20,334, 19,717, 19,238 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

**బ్రేకౌట్ స్థాయి:** 22,100 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 21,300

**నిరోధ స్థాయిలు:** 21,900, 22,000, 22,100 (21,800 పైన బుల్లిష్)

**మద్దతు స్థాయిలు:** 21,500, 21,400, 21,300 (21,600 దిగువన బేరిష్)

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 7వ తేదీ | | విజయవాడ | 565 |
| హైదరాబాద్ | 560 | విశాఖపట్నం | 625 |
| 8 జనవరి | | వరంగల్ | 562 |
| చిత్తూరు | 583 | | |
| గోదావరి | 565 | దజను గుడ్లు రూ.72 | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 70 | గోదావరి | 84 |
| వరంగల్ | 70 | విజయవాడ | 84 |
| కరీంనగర్ | 70 | గుంటూరు | 82 |
| మహబూబ్‌నగర్ | 70 | ఒంగోలు | 82 |
| కర్నూలు | 70 | చిత్తూరు | 80 |
| విశాఖపట్నం | 79 | | |

# ఫిక్స్‌డ్ వడ్డీ రేటా.. ఫ్లోటింగ్ వడ్డీ రేటా..!

## గృహ రుణ గ్రహీతలకు బ్యాంకులు, హెచ్‌ఎఫ్‌సీల సందేశాలు

ఏది ఎంచుకుంటారో మీ ఇష్టం

గృహ రుణ గ్రహీతలకు పెద్ద ఊరట లభించనుంది. స్థిర (ఫిక్స్‌డ్) వడ్డీ రేటులో కొనసాగాలా? లేదా చర (ఫ్లోటింగ్) వడ్డీ రేటులో కొనసాగాలా? అనే విషయాన్ని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రుణ గ్రహీతలకే వదిలేసింది. ఈ నిర్ణయం ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో బ్యాంకులు, గృహ ఫైనాన్స్ కంపెనీలు (హెచ్ఎఫ్‌సీ), నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ).. హోమ్ బ్రాంచ్‌కు వచ్చి మీ చాయిస్ చెప్పాలంటూ.. తమ నుంచి గృహ రుణాలు తీసుకున్న ఖాతాదారులకు మెసేజ్‌లు పంపిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు అయితే ఈ నెల 15వ తేదీ కల్లా దీనిపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేయగా హెచ్ఎఫ్‌సీలు మాత్రం.. ఖాతాదారులు స్వయంగా సంబంధిత శాఖకు రావాలని సూచిస్తున్నాయి.




### ఏది బెస్ట్?

ఈ సందేశాలతో చాలా మంది రుణ గ్రహీతలు ఏ ఆప్షన్ ఎంచుకోవాలి? అనే సందిగ్ధంలో పడ్డారు. ప్రస్తుతం మంచి క్రెడిట్ స్కోరు ఉన్న ఖాతాదారుల గృహ రుణాలపైనా బ్యాంకులు, హెచ్ఎఫ్‌సీ, ఎన్‌బీఎఫ్‌సీలు ఫ్లోటింగ్ రేటు కింద 10.1 శాతం నుంచి 10.5 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి. రెపో రేటు తగ్గితే.. ఈ వడ్డీ రేటూ తగ్గుతుంది. కొవిడ్‌కు ముందు స్థిర వడ్డీ రేటుపై తీసుకున్న గృహ రుణాలపైనా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు 10 నుంచి 12 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి.

### తగ్గనున్న వడ్డీ రేట్లు!

ఈ ఏడాది మార్చి లేదా జూన్ నుంచి వడ్డీ రేట్లు తగ్గిస్తామని అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. అదే జరిగితే ఆర్‌బీఐ కూడా రెపో రేటు తగ్గించే అవకాశం ఉంది. జూన్ కల్లా రెపో రేటు అర శాతం మేర తగ్గే అవకాశం ఉందని ఇప్పటికే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిక్స్‌డ్ వడ్డీ రేటుపై గృహ రుణాలు తీసుకున్న వ్యక్తులు కొద్దిపాటి స్విచ్చింగ్ చార్జీలు ఉన్నా.. ఫ్లోటింగ్ రేటుకు మారడం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

### మరింత స్వేచ్ఛ

వడ్డీ రేటు విధానంతో పాటు గృహ రుణాల కాల పరిమితిని కూడా మార్చుకునే అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పించింది. కాకపోతే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఇందుకు కొంత స్విచ్ ఓవర్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీలు కూడా పారదర్శకంగా ఉండాలని ఆర్‌బీఐ ఆదేశించింది. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులు కాలపరిమితి పొడిగించుకుని ఈఎంఐల భారం తగ్గించుకోవచ్చు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న వ్యక్తులు తమ గృహ రుణాలను పాక్షికంగా లేదా పూర్తిగా ముందుగానే చెల్లించే వెసులుబాటునీ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కల్పిస్తున్నాయి. ఒకవేళ పాక్షికంగా లేదా పెద్ద మొత్తంలో చెల్లిస్తే ఈఎంఐల భారం తగ్గించుకోవచ్చు.

### ఆటోమొబైల్‌లో 98% ఫిక్స్‌డ్ రుణాలే

రిటైల్ హోమ్ లోన్లలో ఎక్కువ భాగం ఫ్లోటింగ్ రేటుపై ఉంటాయి. దాంతో ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించినప్పుడల్లా బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గిస్తాయి. రిటైల్ ఆటో లోన్ల పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. దాదాపు 98 శాతం రిటైల్ ఆటో లోన్లు ఫిక్స్‌డ్ వడ్డీ రేట్లపై ఉంటాయి. దీంతో ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించినా ఈ రుణాలపై వడ్డీ రేటు తగ్గించే అవకాశం ఉండదు. అలాగే రెపో రేటు పెంచినప్పుడు మాత్రం ఈ రుణాలపై వడ్డీ రేటు నిర్ణీత కాలపరిమితి ముగిసే వరకు పెరగదు. ఈ సంవత్సరం ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనివల్ల గృహ రుణాలు తీసుకున్న వారు లాభపడినా.. రిటైల్ ఆటో లోన్లు తీసుకున్న వారికి మాత్రం పెద్దగా ప్రయోజనం ఉండదు.

## హైదరాబాద్‌లో ఐసీఎస్ఐ ఏడీఆర్ సెంటర్

హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ (ఐసీఎస్ఐ) హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ఏడీఆర్ (ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజొల్యూషన్) సెంటర్ ఏర్పాటు చేస్తోంది. దేశంలోని ఈ తొలి ఏడీఆర్ కేంద్రం మార్చి 31 నాటికి ఇది ప్రారంభం కావచ్చని ఐసీఎస్ఐ ప్రకటించింది. మంచి మౌలిక వసతులున్న ఇతర నగరాల్లో కూడా ఇలాంటి కేంద్రాలను ప్రారంభించే ఆస్కారం ఉన్నట్టు ఐసీఎస్ఐ ప్రెసిడెంట్ మనీష్ గుప్తా విలేకరులకు తెలిపారు. జాతీయ న్యాయ వ్యవస్థకు మద్దతుగా ఉండడం, తద్వారా నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ సెంటర్ల ఏర్పాటు లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలో 1,05,000 మంది కంపెనీ సెక్రటరీలుండగా ఒక్క భారత్‌లోనే 71,000 మంది ఉన్నారు. వారిలో 2,600 మంది తెలంగాణలోను, 4,000 మంది దక్షిణాసియాలోను ఉన్నారు. ఐసీఎస్ఐ నల్సార్ యూనివర్సిటీ సహాయంతో హైదరాబాద్‌లో కార్పొరేట్ గవర్నెన్స్‌పై తొలి జాతీయ పరిశోధన సదస్సు నిర్వహించింది.

## కరెక్షన్‌కు అవకాశం..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమ ధోరణిలో కదలాడే అవకాశాలున్నాయి. నిఫ్టీకి 21,500 పాయింట్ల వద్ద ప్రధాన మద్దతు ఉంది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉండటంతో సూచీలు దిద్దుబాటుకు గురి కావొచ్చు. ఒకవేళ ఈ స్థాయిలో బ్రేకౌట్ అయితే తర్వాత 21,100 పాయింట్ల వద్ద మద్దతు స్థాయిలుంటాయి. ఇందుకు ఒకటి రెండు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. మొత్తంగా మార్కెట్లో బేరిష్ ట్రెండ్ నెలకొని ఉంది. అయితే పియర్ ఇండెక్స్‌గా భావించే ఇండియా విక్స్ తగ్గటం సానుకూల అంశం.

### స్టాక్ రికమండేషన్స్

**ఐసీఐసీఐ సెక్యూరిటీస్:** కంపెనీ షేర్ల డీలిస్టింగ్‌కు ఎక్స్ఛేంజీల నుంచి అనుమతి లభించింది. పైగా ఈ కౌంటర్‌లో సుదీర్ఘకాలం నుంచి మంచి కన్సాలిడేషన్ జరగటంతో మూమెంటమ్ పెరిగింది. డెలివరీ వాల్యూమ్ పుంజుకుంది. గత శుక్రవారం ఈ షేరు రూ.757 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.750 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.785/810 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.736 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

**సీఈఎస్‌సీ:** కొన్నేళ్ల సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత ఈ కౌంటర్‌లో బుల్లిష్‌నెస్ వచ్చింది. నవంబరు నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ అసాధారణంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.138.40 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.133/130 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.185/190 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.129 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**హిందుస్థాన్ కాపర్:** గత రెండు నెలలుగా ఈ షేరు దూసుకుపోతోంది. డెలివరీ వాల్యూమ్ అనూహ్యంగా పెరిగింది. కంపెనీ.. బ్యాంక్ రుణాలకు ఏఏ+ రేటింగ్ రావటమే ఇందుకు కారణంగా ఉంది. గత శుక్రవారం ఈ షేరు రూ.283.30 వద్ద ముగిసింది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.270 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.295/315 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.255 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**ఫినోలెక్స్ ఇండస్ట్రీస్:** ఈ కౌంటర్ టెక్నికల్ చార్ట్ ఆసక్తికరంగా ఉంది. సెప్టెంబరులో డివిడెండ్ చెల్లించిన తర్వాత ఒక్కసారిగా పడిపోయిన ఈ షేరు.. త్రైమాసిక ఫలితాల అనంతరం పుంజుకున్నాయి. సమీప క్రాస్‌లైన్ నిరోధాన్ని బ్రేక్ చేశాయి. చివరి మూడు సెషన్లలో ఈ షేరు ఏకంగా 16 శాతం మేర లాభపడింది. గత శుక్రవారం రూ.237.35 వద్ద క్లోజైన ఈ షేరులో ట్రేడర్లు రూ.230/233 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.268/285 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.225 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**బిర్లా సాఫ్ట్:** గత ఏడాది ఆగస్టు నుంచి ఈ కౌంటర్ అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. లాభాల స్వీకరణతో చివరి రెండు వారాలుగా ఈ కౌంటర్ కరెక్షన్‌కు లోనైంది. నిఫ్టీతో పోల్చితే మెరుగ్గా రాణిస్తుండటంతో కొనుగోలుకు అవకాశం ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు రూ.716 వద్ద క్లోజైంది. ట్రేడర్లు, మూమెంటమ్ బయ్యర్స్ రూ.700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.755/790 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.658 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

## 21,850 వద్ద నిలదొక్కుకుంటేనే..

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 21,800 వద్ద రియాక్షన్‌లో పడినా మానసిక అవధి 21,500 వద్ద కోలుకుని చివరికి 20 పాయింట్ల స్వల్ప నష్టంతో 21,700 వద్ద వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు మధ్యలో ముగిసింది. మైనర్ కరెక్షన్‌లో కూడా ఎలాంటి బలహీనతకు లోను కాకుండా 21,500 కన్నా పైనే ఉంది. టెక్నికల్‌గా ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. గత రెండు వారాల్లో మైనర్ రియాక్షన్లలో సైతం పునరుజ్జీవం సాధించి ర్యాలీని కొనసాగిస్తోంది. అయితే అప్రమత్త ధోరణి కనిపిస్తోంది. మరోసారి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 21,830 వద్ద పరీక్ష ఎదుర్కొనేందుకు సమాయత్తం అవుతోంది.

**బుల్లిష్ స్థాయిలు:** మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ 21,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధులు 22,000, 22,100. ఇక్కడ స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఉండవచ్చు.

**బేరిష్ స్థాయిలు:** మైనర్ మద్దతు స్థాయి 21,650 వద్ద విఫలమైతే మైనర్ బలహీనతలో ప్రవేశిస్తుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయిలు 21,500, 21,450. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీ 48,400-47,400 మధ్యన సైడ్‌వేస్, ఆటుపోట్ల ధోరణిలో కదలాడుతోంది. గత వారం 48,160 వద్ద ముగిసింది. మరింత అప్‌ట్రెండ్‌లో కొత్త శిఖరాల దిశగా పురోగమించాలంటే నిరోధ స్థాయి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 48,650 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనత ప్రదర్శించి 48,000 స్థాయిలో నిలదొక్కుకోలేకపోతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

**పాటర్న్:** నిఫ్టీకి 21,800 వద్ద డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడింది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించాలి. 21,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే అప్రమత్తతను సూచిస్తుంది.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 21,810, 21,850 |
| మద్దతు | 21,650, 21,580 |

www.sundartrends.in

# స్పోర్ట్స్

# ఏడాది తర్వాత టీ20ల్లోకి..

## అఫ్ఘానిస్థాన్‌తో సిరీస్‌కు రోహిత్, కోహ్లీ




**న్యూఢిల్లీ:** ఏడాదికిపైగా అంతర్జాతీయ టీ20లకు దూరంగా ఉన్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చారు. ఈ నెల 11 నుంచి అఫ్ఘానిస్థాన్‌తో జరగబోయే మూడు టీ20ల సిరీస్ కోసం రోహిత్ కెప్టెన్సీలో టీమిండియాను సెలెక్టర్లు ఆదివారం ప్రకటించారు. కాగా, గాయం కారణంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్‌లు ఈ సిరీస్‌కు దూరమయ్యారు. తిలక్ వర్మ, యశస్వి జైస్వాల్, రింకూ సింగ్ సహా సౌతాఫ్రికా టూర్‌లో రాణించిన యువ జట్టులోని ఎక్కువ మంది టీమ్‌లో చోటు నిలబెట్టుకొన్నారు. శ్రేయాస్ అయ్యర్‌కు విశ్రాంతినివ్వగా.. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని కేఎల్ రాహుల్, బుమ్రా, షమిలను ఎంపిక చేయలేదని తెలుస్తోంది. బ్రేక్ కోరుకొన్న ఇషాన్ కిషన్‌ను పక్కనబెట్టిన సెలెక్టర్లు.. వికెట్ కీపర్లుగా సంజూ శాంసన్, జితేష్‌లకు అవకాశం కల్పించారు. పాండ్యా స్థానంలో ఆల్‌రౌండర్ దూబేకు చోటు దక్కింది. 2022, నవంబరులో పొట్టి ప్రపంచకప్ సెమీస్‌లో జట్టు ఓటమి తర్వాత రోహిత్, కోహ్లీ టీ20లు ఆడలేదు. అయితే, ఈ ఏడాది అమెరికాలో జరిగే టీ20 ప్రపంచకప్‌నకు ముందు టీమిండియా ఆడే చివరి ద్వైపాక్షిక సిరీస్‌లో వీరిద్దరూ జట్టులోకి రావడం విశేషం. ఈ నేపథ్యంలో ఆ మెగా టోర్నీలో రోహిత్, కోహ్లీ కచ్చితంగా ఆడే అవకాశముంది. కాగా, వన్డే ప్రపంచకప్‌లో హార్దిక్ పాండ్యా, దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో సూర్యకుమార్ గాయపడిన సంగతి తెలిసిందే. అయితే ఐపీఎల్‌కల్లా వీరిద్దరూ కోలుకొంటారని అంచనా వేస్తున్నారు.

**భారత టీ20జట్టు**

రోహిత్ (కెప్టెన్), గిల్, జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, **జితేష్ శర్మ, సంజూ శాంసన్** (వికెట్ కీపర్లు), శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్, అవేశ్ ఖాన్, ముకేష్ కుమార్.

## ఆంధ్ర లిఫ్టర్ల పతకాల పంట




**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్లు జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఏకంగా 15 పతకాలు కొల్లగొట్టారు. ఇందులో ఒక్క విజయనగరం జిల్లాకు చెందిన లిఫ్టర్లే 10 పతకాలు సాధించడం విశేషం. గతనెల 29 నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటానగర్‌లో జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలికల యూత్ విభాగంలో సుస్మిత (55 కి.) స్వర్ణ పతకంతో సత్తా చాటగా.. భవాని (45 కి.) భార్గవి (49 కి.) రజతాలతో మెరిశారు. నీరజ (40 కి.), చైత్ర కుమారి (81 ప్లస్ కి.) కాంస్యాలు అందుకున్నారు. ఇక, బాలికల సీనియర్ కేటగిరీలో రాజేశ్వరి (45 కి.), పల్లవి (64 కి.) కంచు మోత మోగించారు. జూనియర్ విభాగంలో గాయత్రి (87 ప్లస్ కి.), సబ్ జూనియర్స్‌లో దేవిశ్రీ (71 కి.) రజతాలు దక్కించుకొన్నారు. బాలుర యూత్ విభాగంలో దినేష్ (67 కి.) స్వర్ణం, రాము (89 కి.) కాంస్యాలు సొంతం చేసుకున్నారు. వీరంతా విజయనగరం జిల్లాకు చెందినవారే. జూనియర్ కేటగిరి 76 కిలోల్లో గాయత్రి (కాకినాడ) రజతం, 71 కిలోల్లో రేణుక (గుంటూరు) కాంస్యం, బాలుర జూనియర్ విభాగం 96 కిలోల్లో కార్తీక్ (ఏలూరు) పసిడి, యూత్ కేటగిరి 102 కిలోల్లో వంశీ (గుంటూరు) కాంస్యం, 96 కిలోల్లో అర్నెష్ బాబు (ఏలూరు) రజతం సాధించారు. ఇక యూత్ విభాగంలో ఓవరాల్ చాంపియషిప్ దక్కించుకున్న ఏపీ బాలికలు.. జూనియర్ కేటగిరీలో రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు.

## 12 నుంచి రైతుమిత్ర జాతీయ స్థాయి కబడ్డీ

**ఈపూరు (ఆంధ్రజ్యోతి):** రైతుమిత్ర జాతీయ స్థాయి పురుషుల కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లలో ఈనెల 12నుంచి 17 వరకు జరుగనుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన పలు జట్లు పాల్గొనే ఈ పోటీల ప్రైజ్‌మనీ రూ. 7.5 లక్షలు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించే ఈ టోర్నీలో పాల్గొనే జట్లకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. విజేతకు రూ. 2.5 లక్షలు, రన్నరప్‌నకు లక్షన్నర, మూడో స్థానానికి లక్ష రూపాయల ప్రైజ్‌మనీ అందజేస్తారు. ఎంట్రీలకు 99819 22533, 99666 71306 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలి.



ఎలిస్ పెర్రీ (34 నాటౌట్)

## ఆసీస్ ఆల్‌రౌండ్‌షో

సిరీస్ ఆశలు సజీవం

రెండో టీ20లో భారత్ ఓటమి

**ముంబై:** తొలి టీ20లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత మహిళల జట్టు ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో మాత్రం నిరాశపరిచింది. అటు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణించిన ఆస్ట్రేలియా జట్టు 6 వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్‌లో సజీవంగా నిలిచింది. దీంతో ఇక్కడే సిరీస్ పట్టేద్దామనుకున్న భారత ఆశలకు బ్రేక్ పడినట్టయింది. ఇరు జట్ల మధ్య నిర్ణాయక మ్యాచ్ మంగళవారం జరుగనుంది. కెరీర్‌లో 300వ మ్యాచ్ ఆడిన ఎలిస్ పెర్రీ (34 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 130 పరుగులు చేసింది. దీప్తి శర్మ (30), రిచా ఘోష్ (23), స్మృతి మంధాన (23) మాత్రమే ఓ మాదిరిగా ఆడారు. వేర్‌హమ్, సదర్లాండ్, గార్త్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆసీస్ 19 ఓవర్లలో 4 వికెట్లకు 133 పరుగులు చేసి నెగ్గింది. హీలీ (26), మూనీ (20) ఆకట్టుకున్నారు. దీప్తికి రెండు వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా కిమ్ గార్త్ నిలిచింది.

**పెర్రీ జోరు:** ఆసీస్ ఓపెనర్లు హీలీ, మూనీ 51 పరుగులు జోడించి గెలుపు బాటలు వేశారు. ఈ ఇద్దరినీ వరుస ఓవర్లలో దీప్తి శర్మ అవుట్ చేసినా ఆసీస్ ఇబ్బందిపడలేదు. ఎలిస్ పెర్రీ చివరికంటా నిలిచి ఎడాపెడా బౌండరీలతో జోరు ప్రదర్శించింది.

**ఆరంభం నుంచే వికెట్ల పతనం:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో ఏ ఒక్క బ్యాటర్ నుంచి కూడా అద్భుత ప్రదర్శన కనిపించలేదు. మిడిలార్డర్‌లో రిచా శర్మ, దీప్తి శర్మ మాత్రం కాస్త ఆదుకునే ప్రయత్నం చేశారు.

## రికీ అజేయ శతకం

● ఆంధ్ర 339/6 ● బెంగాల్‌తో రంజీ



**విశాఖ:** రికీ భుయ్ (107 బ్యాటింగ్) శతకంతో.. గ్రూప్-బిలో బెంగాల్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు దీటుగా బదులిస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 119/3తో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర మూడో రోజు ఆఖరుకు 6 వికెట్లకు 339 పరుగులు చేసింది. రికీతోపాటు షోయబ్ (31) క్రీజులో ఉన్నాడు. కెప్టెన్ హనుమ విహారి (51) హాఫ్ సెంచరీ సాధించాడు. ఆకాష్ దీప్, మహ్మద్ కైఫ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. బెంగాల్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 409కు ఆంధ్ర ఇంకా 70 పరుగులు వెనుకంజలో ఉంది. మరో రోజు ఆట మాత్రమే మిగిలున్న నేపథ్యంలో ఈ మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

## పుజార డబుల్



సౌరాష్ట్ర 578/4 డిక్లేర్డ్ ● జార్ఖండ్‌తో రంజీ

**రాజ్‌కోట్:** చటేశ్వర్ పుజార (243 నాటౌట్) ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 17వ డబుల్ సెంచరీతో మెరవడంతో.. గ్రూప్-ఎలో జార్ఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో సౌరాష్ట్ర పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 406/4తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌరాష్ట్ర 578/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ప్రేరక్ మన్కడ్ (104 నాటౌట్) శతకం సాధించాడు. అనంతరం జార్ఖండ్ రెండో ఇన్నింగ్స్‌లో 140/2 స్కోరు చేసింది. కుమార్ దియోబ్రత్ (74), సురాజ్ (19) క్రీజులో ఉన్నారు. సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 296 పరుగులు వెనుకబడింది. మొదటి ఇన్నింగ్స్‌లో జార్ఖండ్ 142 పరుగులకు ఆలౌటైంది.

## ఖవాజా అప్పీల్ తిరస్కరణ

**దుబాయ్:** పాక్‌తో జరిగిన తొలి టెస్టులో చేతికి నల్లబ్యాండు ధరించి ఆడినందుకు ఆసీస్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజాను ఐసీసీ గత నెలలో మందలించింది. క్రికెటర్ తాజాగా దీనిపై చేసుకున్న అప్పీల్‌ను సైతం తిరస్కరించింది. ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధంలో చిన్నారుల మృతికి నివాళిగా నల్ల బ్యాండు ధరించినట్టు ఖవాజా తెలిపాడు. కానీ అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో రాజకీయ, మతపరమైన, జాతి వివక్ష సంబంధిత కూడిన సందేశాలను ప్రదర్శించడానికి ఐసీసీ అనుమతించదు. ఖవాజా క్రికెట్ ఆస్ట్రేలియాతో పాటు తమకు కూడా సమాచారం ఇవ్వకుండానే నల్ల రిబ్బన్ ధరించాడని ఐసీసీ పేర్కొంది.

## ముంబై కెప్టెన్లుగా పొలార్డ్, పూరన్

**కేప్‌టౌన్:** ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ మరోసారి కెప్టెన్లను మార్చింది. ఐపీఎల్‌లో హార్దిక్ పాండ్యా తరహాలోనే.. సౌతాఫ్రికా 20 లీగ్‌లో తమ జట్టు ఎంఐ కేప్‌టౌన్‌కు రషీద్ స్థానంలో కీరన్ పొలార్డ్‌ను సారథిగా నియమించింది. రషీద్ వెన్నుముక శస్త్రచికిత్సనుంచి కోలుకుంటున్నాడు. ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 10 వరకు ఎస్ఏ 20 లీగ్ జరుగుతుంది. ఇక దుబాయ్‌లో ఈనెల 19 నుంచి జరిగే ఇంటర్నేషనల్ లీగ్ (ఐఎల్) టీ20లో ఎంఐ ఎమిరేట్స్‌కు నికోలస్ పూరన్ సారథిగా వ్యవహరించనున్నాడు. ఈ జట్టు రెగ్యులర్ కెప్టెన్ పొలార్డ్ కాగా, అతను ఎస్ఏ 20లో ఆడనుండడంతో ఈ మార్పు జరిగింది.


## పుణె దూకుడు

కబడ్డీ లీగ్‌లో వరుసగా ఏడో గెలుపు



**ముంబై:** ప్రొ.కబడ్డీ లీగ్ తాజా సీజన్ టేబుల్ టాపర్ పుణెరి పల్టన్ వరుసగా ఏడో విజయం సాధించింది. ఆదివారం ఉత్కంఠ భరితంగా జరిగిన మ్యాచ్‌లో పుణె 29-26తో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. పుణె జట్టులో ఆల్‌రౌండర్ మహ్మద్ రెజా (8) చెలరేగగా, గౌరవ్ ఖత్రి (6), అస్లామ్ (5) రాణించారు. తలైవాస్ కెప్టెన్ సాగర్ ఏడు ట్యాకిల్ పాయింట్లతో అదరగొట్టగా, నరేందర్ (4) పర్లేదనిపించాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41-35తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

## ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు నడాల్ దూరం



**మెల్‌బోర్న్:** ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి రఫెల్ నడాల్ వైదొలిగాడు. తుంటి గాయం తిరగబెట్టడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ఆదివారం వెల్లడించాడు. గత సంవత్సరం ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్ సందర్భంగా నడాల్ తుంటికి గాయం అయింది. ఆ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న అతడు ఆ ఏడాదంతా ఆటకు దూరంగా ఉన్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సన్నాహకంగా భావించే బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీలో పాల్గొన్న నడాల్ క్వార్టర్స్ దాకా వచ్చాడు. అయితే క్వార్టర్‌ఫైనల్ మూడో రౌండ్‌లో గాయం తిరగబెట్టింది. ఆ మ్యాచ్ ఓటమి అనంతరం ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి వైదొలుగుతున్నట్టు అతడు వెల్లడించాడు.

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 8-1-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

## మాల్దీవుల మంత్రులపై వేటు

- ప్రధాని మోదీపై అక్కసు వెళ్లగక్కిన ఫలితం
- మోదీని తోలుబొమ్మ, విదూషకుడన్న మరియం
- భారత్‌లో దుర్వాసన.. ఎంపీ జాహిద్ కామెంట్
- వైరల్‌గా 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్ టాగ్
- నష్ట నివారణకు దిగిన మాల్దీవుల ప్రభుత్వం
- ముగ్గురు మంత్రులు, ఒక ఎంపీపై చర్యలు 8



మజూమ్ | షరీఫ్ | మరియం

## జగన్‌కు ఇప్పుడంతా రివర్స్!



### ఎమ్మెల్యేల స్వరమే కాదు.. చూపూ మారుతోంది

పోలవరం నుంచి రాజధాని అమరావతి విధ్వంసం దాకా సీఎం జగన్ తీసుకున్నవన్నీ రివర్స్ నిర్ణయాలే! ఎన్నికలకు ముందు జగన్ అందరినీ అన్నా అన్నా అంటూ కౌగిలించుకున్నారు.. తీరా గద్దెనెక్కాక వారందరినీ దూరంపెట్టారు. ఎమ్మెల్యేలను పూచికపుల్లల్లా తీసిపేశారు. ఎవరో కొద్ది మంది సన్నిహితులను తప్ప.. ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను తాడేపల్లి ప్యాలెస్ లోపలికే రానివ్వలేదు. నాలుగున్నరేళ్లుగా అపాయింట్‌మెంట్ అడుగుతున్నా ఆయన దర్శనభాగ్యం దొరకని ఎమ్మెల్యేలు ఎందరో! ఇప్పుడు వారికి టైమొచ్చింది. ఇన్నాళ్లూ టీడీపీ-జనసేన తప్ప వారికి ప్రత్యామ్నాయం లేకపోయింది. అక్కడ టికెట్ వచ్చే అవకాశం లేక వైసీపీలోనే కొనసాగాలనుకున్నారు. ఇప్పుడు జగన్ చెల్లెలు షర్మిల కాంగ్రెస్ పగ్గాలు స్వీకరించే అవకాశాలు ఉండడంతో.. జగన్ నిరాదరించిన వారంతా ఆ పార్టీపై కన్నేశారు.

- సీఎంపై వీర విధేయుల విమర్శలు
- అపాయింట్‌మెంట్ అడిగినోళ్లే ఇప్పుడు ఫోన్లు ఎత్తడం లేదు
- దూతలను పంపినా బేఖాతర్
- రాజశేఖర్‌రెడ్డి కొడుకన్న అభిమానంతో వచ్చాం..
- పడిన అవమానాలు చాలు
- మాటపై నిలబడడానికి అందరూ వైఎస్‌లు కాలేరని ఎద్దేవా
- కాంగ్రెస్ గూటికి వెళ్తామని ముఖంపైనే చెబుతున్న వైనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీఎం జగన్మోహన్‌రెడ్డిపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. సర్వేల పేరుచెప్పి తమకు టికెట్లు నిరాకరించడంపై రగిలిపోతున్న వారు పక్కచూపులు చూస్తున్నారు. టీడీపీలో చాన్సు లేకపోతే కాంగ్రెస్ రూపంలో ప్రత్యామ్నాయం కనిపిస్తోంది. పైగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల పీసీసీ పగ్గాలు చేపడతారన్న వార్తలతో అసంతృప్తులు అటే చూస్తున్నారు. దీంతో జగన్ శిబిరం కలవరపడుతోంది. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని.. పార్టీని వీడి వెళ్లొద్దని ఫోన్లు చేస్తున్నారు. రాయబారాలూ నడుపుతున్నారు. అయితే

మిగతా 11వ పేజీలో...

### బాబు చెంతకు సర్పంచ్‌లు

- వైసీపీకి స్థానిక నేతలు గుడ్ బై.. టీడీపీలోకి పెరిగిన చేరికలు
- అధికార పార్టీపై ప్రజాగ్రహం.. అభివృద్ధి లేమిపై సర్పంచ్‌ల ఫైర్
- పాడేరు నుంచి పలువురు చేరిక.. రాష్ట్రమంతటా సన్నాహాలు



## 3 నెలల్లో రైతురాజ్యం

పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో జరిగిన 'రా కదిలి రా' సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

- ఎమ్మెల్యేలను జగన్ నమ్మడం లేదు. ఆయన్ను జనం నమ్మడం లేదు. ఏ ముఖ్యమంత్రి పాలనలోనూ ఇలాంటి పరిస్థితి చూడలేదు.
- అంబటి రాయుడు ప్రజలకు మంచి సేవ చేస్తానంటూ వైసీపీలో చేరారు. గుంటూరు ఎంపీ టికెట్ ఇస్తామన్నారు. ఇప్పుడదే సీటును మరొకరికి ఇస్తామని జగన్ చెప్పారు. దీంతో రాయుడు క్లీన్ బౌల్డ్ అయ్యాడు.
- దేవతలు పాలించిన అమరావతిని టీడీపీ రాజధానిగా ఎంపిక చేస్తే.. దాని జోలికి వెళ్లబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్.. మూడు ముక్కలాట మొదలుపెట్టారు. - చంద్రబాబు

### అమరావతే మన రాజధాని అని గర్వంతో చెప్పుకొంటాం: చంద్రబాబు

- అవినీతి ఎమ్మెల్యేలను, మంత్రులను తప్పించే దమ్ము జగన్‌కు ఉందా?
- ఈ నియంత పోవాలనేది జనం కోరిక
- వైసీపీ టెర్రరిజంతో పెట్టుబడులు పరార్
- 'పోలవరం' గోదావరిలో కలిసింది
- కాంట్రాక్టర్లు సర్కారును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు
- ఫీల్డ్‌లోకి దిగకుండానే రాయుడు క్లీన్‌బౌల్డ్
- ఈ సీఎం రంగులు, ఫొటోల పిచ్చోడు: బాబు
- తిరువూరు, ఆచంటల్లో 'రా కదలిరా' సభలు

విజయవాడ-ఆంధ్రజ్యోతి/భీమవరం/ఆచంట, జనవరి 7: 'రాష్ట్రంలో రాబోయే మూడు నెలల్లో రైతురాజ్యం వస్తుంది. రాష్ట్రానికి అమరావతే రాజధానిగా ఉంటుంది' అని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. పొరుగున ఉన్న హైదరాబాద్ వెలిగిపోతుంటే, అమరావతి మాత్రం వెలవెలబోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తేనే ఆదాయం సమకూరుతుందని.. ఉపాధి కల్పన ఉంటుందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 'రా.. కదలిరా..' పేరుతో చంద్రబాబు జిల్లాకో బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో, సాయంత్రం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో బహిరంగ సభల్లో ప్రసంగించారు. రాష్ట్రానికి రాజధాని ఏదని అడిగితే సమాధానం చెప్పుకోలేని పరిస్థితిని జగన్ తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. మూడు రాజధానుల పేరుతో విశాఖకు వెళ్లడానికి ప్రయత్నిస్తే ఎక్కడికీ వెళ్లొద్దని

మిగతా 11వ పేజీలో...

## ముక్కంటీ.. మూడో కన్ను

### బియ్యం గుప్పిట పట్టినట్టు ఎక్కడి భూములైనా హస్తగతం

- కొందరు రెవెన్యూ సిబ్బంది అండతో కొత్త పుంతలు
- పోలీస్ బెటాలియన్ భూములూ చదును చేసేశారు
- పేదలకు భూసేకరణలో పెద్దఎత్తున అక్రమాలు
- కాలువ, కుంట, చెరువు పోరంబోకుకూ పట్టాలు
- అనుచరుల పేరిట రాయించి.. సర్కారీ పరిహారం
- ఆరోపణలున్న తహశీల్దార్ల బదిలీలకు అడ్డుకట్ట
- ఏ నియోజకవర్గంపైనా లేనన్ని ఫిర్యాదులు ఇక్కడే..
- పరాకాష్టకు చేరిన ఆ నేత రాజకీయ అవినీతి

### భూదందాల నుంచి గ్రావెల్ తవ్వకందాకా ఎమ్మెల్యే నామస్మరణే




విమానాశ్రయం, ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు వంటివి ఉండటంతో ముఖ్యనేత నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను రెవెన్యూ అధికారులు విస్తృతంగా చేపట్టారు. దీంతో భూములకు విలువ బాగా పెరిగింది. దీన్ని సొమ్ము చేసుకునేందుకు ముఖ్యనేత పావులు కదిపారు. అంతే..బంజరు, పోరంబోకు, కాలువ, కుంట, చెరువు పోరంబోకు, అనాధీనం, గయ్యాలు కేటగిరీలకు చెందిన భూములకు రాత్రికి రాత్రే అక్రమంగా పట్టాలు పుట్టించారు.!

పేదలకు ఇళ్ల స్థలాల కోసం 63మంది రైతులకు సంబంధించిన 120 ఎకరాల డీకేటీ భూములను అధికారులు సర్వే చేసి గుర్తించారు. సేకరణకు అనుమతిస్తున్నట్టు సంతకాలు తీసుకున్నారు. కరోనా కారణంగా కొంతకాలం ప్రక్రియ ఆగింది. ఆ తర్వాత అధికారులు మళ్లీ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆ ఎమ్మెల్యే రంగంలోకి దిగారు. అంతే.. అధికారుల స్వరం మారిపోయింది. 120 ఎకరాల్లో 90 ఎకరాలకే లెక్కగట్టి.. మిగతా 30 ఎకరాల్లో కాలువ, రోడ్డు పోరంబోకు భూములు ఉన్నాయని కొత్త వాదన తీసుకువచ్చారు. దీనిపై రైతులు కోర్టుకు వెళ్లడంతో వ్యవహారం పెండింగులో పడింది. 12




ముఖ్యనేత నియోజకవర్గం మీదుగా పోతున్న జాతీయ రహదారి పక్కన పది ఎకరాల్లో వెంచర్ వేస్తున్నారు. దానికోసం భూమిని చదును చేశారు. ఆ పక్కనే ఉన్న పోలీస్ బెటాలియన్‌కు చెందిన భూమిని కూడా పనిలో పనిగా చదును చేసేశారు.

## రైతు మెడపై టైటిల్ కత్తి

### న్యాయస్థానం కళ్లకు గంతలు కట్టిన జగన్ సర్కార్

- అక్టోబరు 31నే అమల్లోకి వచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం
- నవంబరు 1న జీవో జారీ.. గెజిట్‌లో ప్రచురణ
- ఆ మేరకు డిసెంబరు 29న ల్యాండ్ అథారిటీ ఏర్పాటు
- జీవో 512 సజీవంగా ఉన్నంత కాలం చట్టం అమల్లో ఉన్నట్లే: న్యాయ నిపుణులు
- వివాద రహితంగా టైటిల్ హక్కు.. ఓ మిథ్య
- చట్టంలోనే పేర్కొన్న వివాద రిజిస్టర్
- అప్పిలేట్‌లలో విశ్రాంత అధికారులా..! 3
- ప్రభుత్వ హామీలను నమ్మని ఆందోళనకారులు





## వచ్చే ఎన్నికల్లో జగన్ ఇంటికే!

- కొనసాగిన అంగన్వాడీల నిరసనల హోరు
- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే జగన్ పని అయిపోయినట్లే.. ఎస్మా ప్రయోగం సరికాదు
- అంగన్వాడీల దీక్షా శిబిరంలో రాఘవులు ధ్వజం
- రాష్ట్రవ్యాప్తంగా ఎస్మా ప్రతుల దహనం 10
- అనంతలో వైసీపీ బస్సుయాత్రకు నిరసన సెగ
- పశ్చిమలో జీవో కాపీలతో కాగితపు పడవలు

## బీజేపీపై ఉమ్మడి అభ్యర్థి

- ప్రతీచోట ఒక్కరినే నిలిపే వ్యూహంలో ఇండియా
- సీట్లపై కసరత్తు షురూ.. నెలాఖరులోపు ముగింపు?
- ఆప్, ఆర్జేడీ, జేడీయూ, కాంగ్రెస్ మధ్య చర్చలు
- ఢిల్లీలో హస్తం పార్టీకి 4 ఇస్తామంటున్న ఆమ్ ఆద్మీ
- బిహార్‌లో 17:17:4:2 ఫార్ములాపై కసరత్తు 8
- పంజాబ్‌లో విడిగా పోటీకి ఆప్, కాంగ్రెస్ పట్టు

## వైసీపీ అరాచకీయం

### ఎమ్మెల్యే కార్యాలయంలో కత్తిపోట్లు

- నూజివీడు ఎమ్మెల్యే కుమారుడి సమక్షంలో పంచాయితీ
- పరస్పరం దాడికి దిగిన వైసీపీలోని రెండు వర్గాలు 12
- ఆరుగురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో రహస్యంగా చికిత్స

### దళిత రైతుపై వైసీపీ నేతల దాడి

- సంబంధం లేకపోయినా భూ వివాదంలో జోక్యం 12
- ఫిర్యాదు తీసుకోని పోలీసులు.. స్టేషన్ ఎదుట బాధితుడి బైఠాయింపు

### నిన్ను లేపేస్తా.. నీ ఆఫీస్ లేకుండా చేస్తా!

- తిరువూరులో జనసేన కార్యకర్తపై వైసీపీ కార్పొరేటర్ దౌర్జన్యం
- భర్త, కొడుకుతో కలిసి చితకబాదిన వైనం 10
- అందరూ చూస్తుండగానే విచక్షణ రహితంగా దాడి
- గతంలో చంద్రబాబు సభలో బెజవాడ కార్పొరేటర్ భర్త చోరీ

### నగ్నంగా తిప్పుతూ.. బూటు కాళ్లతో తంతూ..

- వైసీపీ జెండా దించాలన్నందుకు పాల్తూరు పోలీసుల దాష్టీకం
- వైసీపీ నేతల తప్పుడు ఫిర్యాదుతో కేసు.. టీడీపీ కార్యకర్తపై జులుం
- పక్కటెముక విరిగినా జైలుకు పంపిన వైనం 12
- సోషల్ మీడియాలో వైరల్.. ఆలస్యంగా వెలుగులోకి..


## ఓట్ల అక్రమాలకు.. కళ్లెం వేస్తారా?

- నేడు రాష్ట్రానికి సీఈసీ రాజీవ్‌కుమార్ రాక
- ఇద్దరు కమిషనర్లు, అధికారులు కూడా..
- రేపు ఉదయం పార్టీలతో భేటీ
- అనంతరం ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, ఏర్పాట్లపై సమీక్ష
- రేపు సీఈసీతో బాబు, పవన్ భేటీ

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): త్వరలో రాష్ట్రంలో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) దృష్టి సారించింది. ఏర్పాట్లు, సన్నద్ధతను పర్యవేక్షించేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్, కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్ సోమవారం రాత్రి విజయవాడ రానున్నారు. వారి వెంట ఈసీ ఉన్నతాధికారులు కూడా వస్తున్నారు. వీరంతా నోవాటెల్ హోటల్‌లో బస చేస్తారు. ఆ రోజుతో

మిగతా 10వ పేజీలో...

# కళింగాంధ్రలో నేటికీ వినపడే నన్నయ మాటలు



"మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్..." అంటూ రామరాజ భూషణుడు వసుచరిత్రలో నన్నయభట్టును శ్లేషాలంకారంతో నుతిస్తాడు. ఈ బిరుదు పదాన్నే నన్నయ్య తన భారతంలో 'తన కులబ్రాహ్మణు..' అనే పద్యంలో 'విపుల శబ్దశాసనుడు'గా రాసుకున్నాడు. అంతేకాదు ఉభయకావ్య రచనాభిశోభితుడనని, బ్రహ్మాండాది పురాణవిజ్ఞాన నిరతుడనని, ఈ విధంగా తనను రాజరాజనరేంద్రుడే ప్రశంసించినట్లు చెప్పుకున్నాడు. నాటి సాహిత్యం మీద సత్సభాంతర సరసీ వనాలలో చర్చలు జరిగేవి. తన భారతానువాదాన్ని కూడ నన్నయ ఆయా సభల్లో చర్చకు పెట్టే ఉంటాడు.

ఇలాంటి నేపథ్యంతో నన్నయ రచనను పరిశీలిస్తే మూడొంతులు సంస్కృత సమాసాలు, ఒకొంతు మాత్రమే తెలుగు పదాలతో భారతానువాదం సాగించడానికి కారణం తెలుస్తూనే ఉంది. ఐతే మానవుడు తన వేషభాషల్తో ఎంత ఉన్నతీకరించుకున్నా సహజలక్షణాలు అంతర్లీనంగా ద్యోతకమౌతూనే ఉంటాయి. సంస్కృతభాషా ప్రభావమెంతున్నా అక్కడక్కడా నాటి జనపదాల్లో వాడుతున్న తెలుగు జాతీయాలు, సామెతలు, క్రియాపదాలు ఆంధ్రభారత విహాయసంలో మిలమిలలాడుతూనే ఉంటాయి. వాటిలో నన్నయవాడిన కొన్ని తెలుగు పదాలు నేటికీ కళింగాంధ్రలో ఎలా సజీవంగా ఉన్నాయో వివరించే ప్రయత్నంచేస్తాను.

**ములుకోల:** " 'దీనిం జిత్తగింపుము; బలంబు గల బలీవర్దంబులతో బలహీనంబులయిన వానిం బూన్చిన నవి దుర్వహ భారవహన మహాలాంగలాకర్షణంబులయం దసమర్థంబులైన నడిచియుం బొడిచియు ములుకోలలం గుట్టియు దుర్బల బలీవర్దంబుల జనులు బాధింపం జూచి యేను దానికి దుఃఖించెద' ననిన సురభికి సురపతి యిట్లనియె" (అరణ్య-1-84)

అంటే- "ఓ ఇంద్రా! విను. బలమైన ఎద్దులతో బలంలేని ఎద్దులను పూని బరువులను లాగిస్తున్నప్పుడు, పొలాల్ని దున్నుతున్నప్పుడు బలంలేని ఎద్దులు వెనుకబడతాయి. వానిని కొట్టి, పొడిచి ములుకోలతో గుచ్చి ప్రజలు బాధించడం చూసిన నేను దుఃఖపడుతున్నాను" అని సురభి దేవేంద్రునితో పలికింది. ఈ సందర్భంలో ఈ క్రింది శ్లోకాన్ని సాక్షాత్తు వ్యాసుడే ధృతరాష్ట్రునితో అంటాడు వ్యాసభారతంలో:

"పశ్యైనం కర్షకం క్షుద్రం దుర్బలం మమ పుత్రకమ్!
ప్రతోదేనాభినిఘ్నంతం లాంగలేనచ పీడితమ్!!" (వ్యాసభారతం-వన-9-10)

"క్షుద్రుడైన కర్షకుడు నాగలితో దున్నే సమయంలో బలహీనమైన ఎద్దును బాధిస్తున్నాడు" అని ఈ శ్లోకభావం. వ్యాసుని కాలానికే ఎద్దులచేత దున్నించి వ్యవసాయంచేసే వారని, బరువులను లాగించేవారని ఈ శ్లోకాల వలన తెలుస్తోంది.

ఇక్కడ వ్యాసుడు ఐదు అనుష్టుప్ శ్లోకాలలో రాసిన సురభి పరితాపాన్ని ఒక పొడవైన వాక్యంలో సరిపెట్టాడు నన్నయ. సంస్కృత ఏకవచన బలీవర్దాన్ని నన్నయ బహువచనంలోకి మార్చి రైతుదౌష్ట్యాన్ని విస్తారం చేశాడు. నడవలేని ఎద్దులను ములుకోలతో పొడిచి నడిపిస్తారని రాశాడు. ఇక్కడ ముల్లుకోల = ములుకోల. కళింగాంధ్రలో అదే మునకాల, మునకాల కర్రగా నేటికీ వాడుతున్నారు. ఎక్కి తోలేటపుడు కొరడాను, వెనుక నడుస్తూ అదిలించడానికి ములుకోలను సాధారణంగా వాడుతుంటారు. అదే వచనంలో నన్నయ 'దుర్బల బలీవర్దంబుల జనులు బాధింపం జూచి' అని రాశాడు! ఇక్కడ జనులంటే రైతులే! ఆనాడు కొద్దిమంది తప్ప ప్రజలందరూ వ్యవసాయం చేసేవారు. ఇప్పటికీ రైతుకులాలే కాకుండా ఇతరత్రా వృత్తులు చేస్తున్నవారు కూడ వ్యవసాయం చేస్తుండడం పల్లెల్లో చూస్తుంటాం. నన్నయ నాడు రైతులే జనులు. జనులే రైతులు.

ఈ కోలను నన్నయ్యభట్టు మరోచోట కూడ వాడాడు. ఏకచక్రపురంలో బకాసురుడు వంతులవారీగా మనుషుల్ని తినేస్తుంటాడు. ఒక రోజు ఓ బ్రాహ్మణ బాలుడి వంతు వస్తుంది. ఆ సందర్భంలో ఆ బాలుడి చేష్టలను నన్నయ ఇలా వర్ణించాడు.

"బాలకుండొక కొండుక కోలచేతఁ
బట్టికొని యేన రక్కసుఁ గిట్టి చంపి
చులుక వత్తు మీరేడ్వగా వలవ దనుచుఁ" (ఆంధ్ర భారతం-ఆది-6-263)

- బాలుడు 'ఒక కర్రను పట్టుకొని ఆ రాక్షసుడ్ని చంపి సులువుగా వస్తాను. మీరు ఏడవ వద్దు.' అని అంటాడు. ఈ పద్యంలోని కోల, చులక రెండు పదాలు నేటికీ వాడుకలో ఉన్నాయి. కోల అంటే కర్ర అని చెప్పుకున్నాం కదా! చేనేత వృత్తిలో కూడ 'కోల' వాడుక ఎక్కువ. కోలను ఆయుధంగా కూడ వాడేవారు. 'చులక'ను చులాగ్గా అని, సులాగ్గా అని నిత్యం ఉపయోగిస్తూనే ఉంటారు కళింగాంధ్రలో.

**అవురుగంట వేళ్లు:** "ఏమాతని పితృపితామహులము. మా పట్టిన యవురు గంట వేళ్ళల్లం గాలుండు మూషిక వ్యాజంబునం దరతరంబ కొఱికిన నొక్కవేర తక్కియున్నయది." (ఆది-2-144)

ఇది జరత్కారుని కథలోనిది. జరత్కారుడు పెళ్ళిచేసుకోకపోవటం వల్ల కొడుకులు లేక జరత్కారుని వంశానికి చెందిన పితృపితామహులు ఊర్ధ్వలోకాలు పొందలేక అవురుదుబ్బుల వేళ్ళకు వేలాడుతూ ఉండిపోతారు. ఒక్కటి మినహా అన్ని వేళ్ళనూ ఎలుక రూపంలో యముడు కొరికేశాడు. ఈ విషయాన్ని జరత్కారునికే అతని పితృపితామహులు పై వాక్యంలో చెబుతారు.

ఐతే నన్నయ్య ముందరి వచనంలోనే "వీరణతృణ స్థంభంబు నవలంబించి.." (ఆది-2-141) అని వ్యాసభారతంలో ఉన్న 'వీరణ' పదాన్ని వాడుకున్నాడు. ఇక్కడ దానిని మళ్ళీ రాయవలసివచ్చి 'అవురుగంటలు' అనే స్థానిక వాడుకపదబంధాన్ని వాడాడు. అవురు గంటలు నేటికీ పొలాల్లో పెరుగుతుంటాయి, రైతులు వాటిని తొలగిస్తుంటారు. రాయలువారు కూడ తన ఆముక్తమాల్యదలో "గంటలు దున్నక మంటి.." (ఆము-4-124) అని రాశారు. గంటలు అంటే దుబ్బులు. 'అవురుదుబ్బులు' కళింగాంధ్రవాడుక.

**గొడిగ రాళ్లు:**

"అరుణ సరోరుహ రమ్య మృదులంబులైన యీ తన్వి
చరణతలంబులు గొడిగరాలపైఁ జనుచున్కిఁ జేసి
పరుసంబులై కడు నెఱ్ఱ నైనవి..." (అరణ్య-3-299)

పాండవులు గంధమాదన పర్వతానికి వెళుతున్నప్పుడు ద్రౌపది నడవలేక మూర్ఛిల్లింది. ఆ సమయంలో ధర్మరాజు ఆమెను చూచి "ఎర్రతామర పూలవలె సుకుమారమైన ద్రౌపది పాదాలు గొడిరాళ్ళ మీద నడవడం వలన మరింత ఎర్రబడ్డాయి" అంటూ విలపించాడు. ఐతే సంస్కృత భారతంలో వ్యాసుడు ఇలా రాయలేదు.

"సుకుమారౌ కథం పాదౌ ముఖం చ కమలప్రభ!
మత్కృతే ద్య వరార్హాయాః శ్యామతాం సముపాగతమ్!!"
(వన-144-11)

"సుకుమారమైన ఈమె పాదాలూ, పద్మకాంతి కల ఈ ముఖమూ నాకోసం నల్లబడిపోయాయి" అని భావం. నన్నయ ఇక్కడ ఆమె ముఖాన్ని వదలి, పాదాలు ఎర్రని గొడిగరాళ్ళపై నడవడం వలన మరింత ఎరుపెక్కాయని చెప్పడం సందర్భోచితంగా ఉంది. తెలుగుతనం ప్రతిబింబిస్తోంది. తరువాతి పద్యంలో 'పరుసంపు ఱాలపైఁబడి తీవ్రవేదనఁ బొందినయది' అంటూ 'ఈ రాజపుత్రిఁ దోడ్కొని దారుణ పాషాణ దుష్పథంబులఁ జనఁగా నేర; మిది నడవ నోపదు.' (అరణ్య-3-302) అని ధర్మరాజు భీమునితో అనడం కూడా ఈ గొడిగ రాళ్ళ ప్రాధాన్యత తెలియజేస్తుంది.

గొడిగరాళ్ళు = గుండ్రని చిన్న రాళ్ళు. గొడిరాళ్ళు కళింగాంధ్ర జనులవాడుక. వీటిని వడిసెలలో పెట్టి విసిరి కొడతారు. ఆంగ్లంలో గ్రావెల్. నేడు ఈ ఆంగ్ల పదమే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. పర్యాయపదం గులకరాళ్ళు అని పండితాభిప్రాయం.

**గొప్పు:** గ్రొప్పు = గ్రొచ్చు + గొచ్చు = గొప్పు....

"మిన్న మిడుఁగుఱు లట్టులై మెఱసి రెండు మెఱుఁగు లొక పుట్టలో నున్న నెఱుఁగ కేను బుట్ట గ్రొప్పించి" (అరణ్య -3-179)

"పుట్ట కన్నాల్లో రెండు మెఱుపులు కనిపిస్తే అవేంటో తెలియకుండానే పుట్టని తవ్వించాడు." నేటికీ కళింగాంంధ్రలో గొప్పుతవ్వడం రైతులు చేస్తుంటారు. మెరక పొలాల్లో వేరుసెనగ వంటి మొక్కల మధ్య బొరిగలతో గొప్పు తవ్వుతారు. నేలను నీరు కోతపెడితే గొచ్చింది అని అంటారు. శబ్దరత్నాకరంలో గ్రొచ్చు పదానికి 'గుద్దలి లోనగు వాటిచే పల్లముచేయు' అని అర్థం ఇచ్చి "వ్రాత యందిది పరుషాదిగా గానబడుచున్నది" అని అన్నారే గాని గ్రొప్పు పదాన్ని స్పృశించలేదు. నన్నయ ప్రయోగాన్ని వారు చూడలేదనిపిస్తోంది.

**మొదవు:** "మృదు రోమములును, శంకునిభ కర్ణముల్, మెత్తని వలుఁద పొదుఁగును....మొదవిది నిధి సేరినట్లు సేరె నిమ్మునికి." (ఆది-7-99)

మొదవు = పాడియావు. ఈ నాటికీ రైతులు పాడియావును మొదవు అనే పిలుస్తారు. మొదవు లాగున్నాడు అంటూ కళింగాంంధ్రలో ఎగతాళిగా తిడతారు.

**పొలుసు:** "మీన్పొల వచ్చు జాలరిదాన" (ఆది-3-40) "చేపల కంపు వస్తున్న జాలరి దానను" అని అర్థం. 'పొల'ను కంపు అనే అర్థంలో గ్రంథాలలో వాడినా నేడు చేపలపై నున్న పొట్టు అనే అర్థంలో పొలుసు అనే పదాన్నే విస్తారంగా వాడుతున్నారు. పొల నుండి వచ్చిందే పొలను, పొలుసు. అప్పటి జాలరులు నేడూ ఉన్నారు. భారతంలోని సత్యవతి కుటుంబం ఎలాగైతే పడవ నడిపి జీవించేదో నేటికీ జాలరులు అలాగే పడవ నడుపుతూ, చేపలు పట్టి, అమ్ముకుంటూ జీవిస్తున్నారు. జాలము అనగా వల. జాలములు కలిగినవారు జాలరులు. జాలారులు.

**ఎఱుకు:** "ఏయ రెఱచి యాహారముగ మను నెఱుకు లయిన" (ఆది-5-53). ఆంధ్రభాషలో తొలి గ్రంథంలోనే స్థిరపడిన 'ఎఱుకుల'వారు నేటికీ ఆంధ్రదేశంలో విస్తారంగా ఉన్నారు. వరి వంటి ధాన్యాలను దాచుకోడానికి వెదురుతో గాదెలు, పొడకలు, బుట్టీలు వంటి పెద్ద వస్తువులను తయారు చేస్తారు. పక్షులను వేటాడి అమ్ముకొని, తిని జీవిస్తుంటారు. ఎఱుకులసాని వీరి ఇంట పుట్టినదే కదా!

**కోమటి:** "పచరింతు రంగడులఁ గోమటు లప్పురి నిద్ధ రత్నముల్" (ఆది-8-73) వైదిక సంప్రదాయంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర అని చెప్తూవస్తున్న నన్నయభట్టు ఇక్కడ కోమటి అనే వ్యవహారవాచకాన్ని వాడాడు. ఇంద్రప్రస్థపురం లోని కోమటులు అక్కడి అంగడులలో జాతిరత్నాలను ప్రదర్శిస్తున్నారట. నన్నయ ప్రారంభించిన ఈ నగరవర్ణన, నగరిలోని కులాలను వర్ణించడం తరువాతి కవులకు ఆదర్శం అయింది. జైనమతంలోని పశుసంపద కలిగిన గోమటులే కోమటులయ్యారని, వర్తకం చేస్తూ సంపన్నులుగా స్థిరపడ్డారని చరిత్ర. ఈ పద్యంలోని అంగడి సరుకు నేడూ వాడుకలో ఉంది.

ఈ విధంగా నన్నయ భారతానువాదాన్ని తరచిచూస్తే పైన ఉదాహరించినవే కాకుండా చెఱువులు, నూతులు వంటి నామవాచకాలు, ముండ్లు గండ్లు, ముచ్చుగొఱక వంటి పదబంధాలు, తూనీగల గొఱ్ఱు పెట్టు వంటి నానుడులు, ఎన్నో క్రియాపదాలు ఈనాటికీ కళింగాంంధ్రలో వాడుతుండడం గమనించవచ్చు. నన్నయభట్టు కళింగానికి పడమటి సరిహద్దు రాజమహేంద్రవరంలో నివసించడం, మధ్యాంధ్రలో జరిగినంత సాంస్కృతిక పరిణామం ఈ ప్రాంతంలో జరగకపోవడం వలన కూడ ఆయా పదాలు వెయ్యేళ్ళు అయినా కళింగాంంధ్రలో ఇంకా నిల్చి ఉన్నాయని చెప్పవచ్చు.

> నన్నయభట్టు కళింగానికి పడమటి సరిహద్దు రాజమహేంద్రవరంలో నివసించడం, మధ్యాంధ్రలో జరిగినంత సాంస్కృతిక పరిణామం ఈ ప్రాంతంలో జరగక పోవడం వలన కూడ ఆయా పదాలు వెయ్యేళ్ళు అయినా కళింగాంధ్రలో ఇంకా నిల్చి ఉన్నాయని చెప్పవచ్చు.

గార రంగనాథం
98857 58123



## మందుసోదర

యెన్నిసార్లు చెప్పినా
కప్పలా అదే ప్రపంచంలో
జీవిస్తావు కానీ
చెవిమీద పేను వారదు
యెన్ని కన్నీళ్ళు కార్చినా
బొమ్మలా చూస్తూ ఉండిపోతావు కానీ
నీ మనసు అస్సలు మారదు

ఇప్పటికైనా కళ్ళు తెరవకపోతే
ఇక కనుమూయటమనే
చిన్న ఆటొక్కటే మిగిలున్నదన్న
విషయమన్నా తెలుసా

తిరనాళ్ళలో తప్పిపోయినట్టు
ఎక్కడో కాటుగలిసిపోయిన
ఏ చోటో ఉండి ఉంటాడులే అని
మనసుకు సర్ది చెప్పుకుందుము

కళ్ళ ముందే తూట్లు పడుతున్న
నీ శరీరాన్ని చూస్తూ
ఊరికే ఉండగలమా?
పస్తులుంటూ
పచ్చడిమెతుకులకే పరిమితమయి
గుడ్డిగుడిసెకు
జీవితాన్ని కట్టేసుకున్నవాళ్ళు
ఎంతమంది ఎదురుపడటంలేదు

నువ్వు నమ్ముతున్న మందుసుక్కలు
ఇంటిగోడల మధ్య
చిచ్చుపెట్టే మందుపాతరలు
నీ తలను తుంచిపడేసే వేటకత్తులు
నిండు దీపాన్ని
ఆర్పేసుకోవటానికి నువ్వెవరు
గొంతులోంచి బయటికొచ్చే
శబ్దాన్ని ఉరితీసుకోవటానికి
నీవెవరు

పావలా సంపాదించకున్న
నిన్ను కన్నబిడ్డలా సాదే
ఆమెదే నీ దేహం
తాగొచ్చి పక్కలో
ఉచ్చపోసిన్నాడే
నీ శరీరంతో నీకు సంబంధం తెగిపోయింది
పుచ్చిపోయిన నీ కాలేయం
మరణశయ్య మీదికెక్కకముందే
మనిషిగా మారు

పలుపలు ఆలోచనల దారాలు కట్టుకొని
తెలియని ఆకాశానికి ఎగిరిపోకు
ఈ కొద్దిరోజులు
నీ అవయవాలకు పట్టిన
బూజును కాస్తా దులుపుకుంటే
ఇల్లు కుదుటపడుతుంది

తండ హరీష్ గౌడ్
89784 39551



## పగుళ్ళు

నా నిక్కచ్చితనం నా ధనం
ఏ దుఃఖం నను తాకదు.
తెరపై తోలుబొమ్మలాట చూడు
యుద్ధం, నాట్యం రెండూ ఒకలాగే ఉంటాయి.
నాలోనూ అంతే!

ఎందుకంటే విషాదం
నన్నెపుడో ద్రవీకరించింది.
ఇక ఇక్కడ పగిలేందుకేం లేదు.
ప్రవహించడమే ఉంది.

విశాలమైన గదుల్లో
ఒంటరి మనసులు
ఫ్లడ్ లైట్ల వెలుతురు కింద చీకటి
నీడలై బిక్కు బిక్కుమంటున్నా,
గెలుపుకోసం ఆటగాడు వేలంపాటలో నిలుచున్నా,
పదవి పందేరంలో
చట్టం అంతరించిపోతున్నా,
గొడ్డళ్ళు, వేటకొడవళ్ళు
ప్రతి కథలో హింస కక్కుతున్నా,
ఏం చేయాలో పాలుపోక

పొత్తిళ్ళలో పసిపాప
నిద్రకు కావలి కాస్తూ
ఒక తెమ్మెరనై మిగిలిపోతాను.
మాటలు నేర్చుకునే బాల్యానికి
తేటదనం మప్పుతాను.
విభేదించే వారికి
ఓ చిరునవ్వు కానుకనిస్తాను.

కాళ్ళకూరి శైలజ
98854 01882

### రెండు కవితా సంపుటాల ఆవిష్కరణ

అమ్మంగి వేణుగోపాల్ 'ముఖచిత్రం', అమ్మంగి కవితా స్వామి 'ముందడుగు' కవితా సంపుటాల ఆవిష్కరణ సభ జనవరి 13 మధ్యాహ్నం 1.30గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో జి. చెన్నకేశవరెడ్డి, నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, టి.వి. నరసింహస్వామి, పి.లక్ష్మీనారాయణ, తిరునగరి దేవకీదేవి, తదితరులు పాల్గొంటారు.

**జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక**

### 'వేదిక' సాహిత్య చర్చ

'వేదిక' ఆధ్వర్యంలో శైలజ చందు కథ 'అమృతం'పై చర్చ, నోర ఎఫ్రాన్ ఆంగ్ల కథకు స్వప్న పేరి పరిచయం జనవరి 13 సాయంత్రం 7 గంటలకి జరుగుతాయి. వివరాలకు: 81426 42638.

**అనిల్ అట్లూరి**

### అలిశెట్టి రాష్ట్ర స్థాయి పురస్కార ప్రధాన సభ

అలిశెట్టి ప్రభాకర్ పురస్కార సభ కరీంనగర్ ఫిల్మ్ భవన్‌లో జనవరి 12న సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది. స్వీకర్త కవయిత్రి తోట నిర్మలారాణి.

**తెలంగాణ రచయితల వేదిక**

## యుద్ధం ఉవాచ

నా పొలికేక ముందు-
సకల కళలూ..
రాతిబొమ్మకు అమ్మ చనుబాలు!
సమస్త విజ్ఞానాలూ..
కార్చిచ్చులో జల్లిన విత్తనాలు!
యావత్తు తత్వాలూ..
అడుగుజాడకే నోచని బాటలు!


నా క్షిపణి వేగం ముందు -
మానవ ప్రస్థానం..
కొయ్యగుర్రంపై వేల ఏళ్ళ స్వారీ!
చరిత్ర..
బావురుమనిపించే
ఛలోక్తుల సంపుటి!

వి-రాగి
99593 65373



# "టూరిస్టు వేరు, ట్రావెలర్ వేరు"

నిమ్మగడ్డ శేషగిరి ఇంగ్లీషులో రాసిన మొరాకో యాత్రా కథనాన్ని 'ఊహలకందని మొరాకో' అంటూ తెనిగించిన దాసరి అమరేంద్రతో ముఖాముఖి:




**మీరు స్వయంగా రచయిత, యాత్రా కథనాలు కూడా వెలువరించారు. ఈ అనువాదం చేపట్టడానికి కారణం ఏమిటి?**

నేను 1990 నుంచి రాస్తున్నాను. నా మొదటి రచన 'మూడు నగరాలు' అన్న యూరప్ యాత్రా గాథ. నా అనుభవాలూ అనుభూతులూ పాఠకులతో పంచుకోదగ్గవి అనిపించినపుడల్లా రాసాను. యాత్రా కథనాలతో పాటు కథలు, వ్యాసాలు రాసాను.

రాయడం కన్నా చదవడం నాకు ఇష్టమైన ప్రక్రియ. ఇంగ్లీషులో కొన్ని కథలు, నవలలు చదివినపుడు వీటిని తెలుగు పాఠకులకు చేర్చాలి అన్న తపన కలుగుతూ ఉండేది. అలా 1990ల నుంచి అనువాదం చేసాను. చేస్తున్నాను.

కొన్ని ఇంగ్లీషు ట్రావెలాగ్స్ చదివినపుడు వాటిని అనువదించాలి అన్న కోరిక కలిగేది. కాపీ రైట్స్ లాంటి కారణాల వల్ల అది తీరని కోరికగానే ఉండిపోయింది. ఆ నేపథ్యంలో శేషగిరి గారు 2021లో ఫేస్‌బుక్‌లో పెడుతోన్న 'మొరాకో' పోస్టులు చూసాను. బాగా నచ్చాయి. వెంటనే ఆయన అనుమతి తీసుకుని అనువదించాను. ఒక వెబ్ పత్రికలో పన్నెండు భాగాలుగా సీరియలైజ్ అయిన తర్వాత ఈ 'ఊహలకందని మొరాకో' పుస్తకాన్ని వెలువరించాం.

**ఒక యాత్రికుడిగా ఈ అనువాదాన్ని చేయడంలో కలసి వచ్చిన విషయాలు, ఎదురైనా ఇబ్బందులు చెబుతారా?**

మూల రచయిత శేషగిరికీ నాకూ ప్రయాణాల విషయంలో అనూహ్యమైన భావ సారూప్యం ఉంది. ప్రదేశాలూ ప్రకృతీ మనుషులూ స్వీయాన్వేషణ, ఆ క్రమమే మా ఇద్దరి యాత్రలకూ ప్రేరణ. అలాగే మేమిద్దరం ప్రయాణాలు చేసే పద్ధతులూ బాగా కలుస్తాయి. కుటుంబంతో కలిసి వెళ్లడం, స్నేహితులతో వెళ్లడం, సోలో ప్రయాణాలు, ట్రెక్కింగు వీటన్నిటినీ మేము ఇష్టపడతాము. ఈ సారూప్యాల వల్ల మొరాకో యాత్ర విషయంలో శేషగిరిగారి అనుభవాలతో నేను అవలీలగా భావైక్యం పొందగలిగాను. అంచేత అనువాదం ఎంతో సులభమైంది.

శేషగిరి తన అనుభవాలను ఇంగ్లీష్‌లో రాసినా ఆయనదీ నాదీ ఒకే మాతృభాష అవడం నాకు బాగా ఉపకరించింది. ఇద్దరి మూలాలూ ఒకే భాషా సంస్కృతికి చెందడం వల్ల నేను అనువాదంలో తెలుగు నుడికారాలూ జాతీయాలూ సామెతలు విరివిగా వాడగలిగేను. ఇలాంటి మార్పులు చేసే విషయంలో శేషగిరి నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చేరు.

ఇహ ఇబ్బందులూ సవాళ్ల దగ్గరికి వస్తే, మొరాకో నాకు బొత్తిగా తెలియని ప్రదేశం. ఒక యాత్రా గాథను అనువదించాలంటే, ఆ మాటకొస్తే ఏ రచనైనా అనువదించాలంటే ఆ ప్రాంతపు భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ వివరాల ప్రాథమిక అవగాహనైనా అవసరం. అక్కడి భాషలు, జాతులు, ఆచార వ్యవహారాలు కొంతైనా తెలియడం అవసరం. మొరాకో పూర్తిగా అపరిచితం కాబట్టి పై విషయాలు తెలుసుకోవడానికి ఎంతో అధ్యయనం చెయ్యవలసి వచ్చింది.


> కొత్త ప్రదేశాలకు వెళ్లి, క్షణాల్లో అక్కడ ఇమిడిపోవడం, వారివారి భాషా సంస్కృతులను తాత్కాలికంగానైనా తనవిగా చేసుకోవడం, అక్కడివారిలో ప్రతిబింబాలు వెతుక్కోవడం, ఆ ప్రక్రియలో తనలోకి తాను ప్రయాణించడం, ఇవి యాత్రికుని మౌలిక లక్షణాలు. ఈ బాణీ అనుభవాలూ అనుభూతులూ మనకు 'ఉహలకందని మొరాకో' లాంటి యాత్రాగాథల్లో కనిపిస్తాయి.

**ఈ రచన చదువుతున్నపుడు ఒక సాటి యాత్రికునిగా మొరాకో విషయంలో మీరు గమనించిన ప్రత్యేక అంశాలు ఏమిటి?**

ఈ పుస్తకాన్ని చదవడం, అనువదించడం పుణ్యమా అని మొరాకో నాకు అతి సన్నిహితమయింది. నేనే ఆయా ప్రదేశాలు తిరిగిన అనుభూతి కలిగింది. ఒక యాత్రికుడిగా ఆ అనుభూతిని వ్యక్త పరచాలంటే ముందుగా నా మనసుకు తట్టే విషయం ఆ దేశంలోని చారిత్రిక సాంస్కృతిక వైవిధ్యత. క్రీస్తుశకం 44వ సంవత్సరం నాటి రోమన్ల సామ్రాజ్య విస్తరణలో భాగంగా వాళ్ళు నిర్మించిన ఓలుబులిస్ నగరం, 1920లలో కొద్ది సంవత్సరాలు ఫ్రెంచ్ వారి పాలనలో ఉండి, మొరాకో దేశంలో ఇప్పటికీ అత్యంత యూరోపీనీయత సంతరించుకొని మనుతోన్న కాసాబ్లాంకా, రెండో ప్రపంచ యుద్ధం ముగిశాక ఆనాటి వ్యవస్థలను నిరసిస్తూ 1960లలో 'బీట్ జెనరేషన్' అంటూ గళమెత్తిన కవులూ కళాకారులకు కేంద్రబిందువుగా నిలచిన టాంజీర్ నగరం, స్పానిష్ ముద్రనిండిన టెటువాన్, పోర్చుగీసు అడుగుజాడలు కనబడే స్వీరా, అరబ్బుల సంస్కృతీ కేంద్రం మెకానెస్, ఇలా ఒక చిన్న దేశం భిన్న సంస్కృతులకు నిలయమవడం నన్ను అబ్బుర పరచింది.

అలాగే ఆధునికయుగంలో బానిసలు అనగానే ఆఫ్రికా వాసులే గుర్తుకు వచ్చే నాకు 17వ శతాబ్దంలో మౌలే ఇస్మాయిల్ అన్న సుల్తాన్ మెక్నెస్ నగరాన్ని రాజధానిగా చేసుకొని దేశాన్ని పాలించినపుడు ఆయన అధీనంలో ముప్పైవేల శ్వేతజాతి బానిసలు ఉన్నారన్న సంగతి ఊహకు అందని విషయం. మరింతగా శోధిస్తే అదంతా నిజమేననీ, 16-19 శతాబ్దాలలో పదీ పన్నెండు లక్షల మంది తెల్ల బానిసలు ఉత్తర ఆఫ్రికా సుల్తానుల ఆధీనంలో ఉండేవారని తెలిసింది.

మొరాకో దేశపు సాంస్కృతిక రాజధాని ఫెజ్ నగరంలో ఉన్న ఖైరవాన్ విశ్వవిద్యాలయం ప్రపంచమంతటిలోను అవిచ్ఛిన్నంగా కార్యకలాపాలు కొనసాగిస్తోన్న అతి పురాతన విశ్వవిద్యాలయం అని విన్నపుడు మూల రచయిత శేషగిరి నమ్మలేదు. నేనూ నమ్మలేదు. కానీ యునెస్కో వాళ్ళు, గిన్నీస్ వాళ్ళు ఆ విషయం నిర్ధారించారని తెలిసాక ఔరా! అనిపించింది.



మొరాకోలో శేషగిరికి తటస్థపడిన మహిళలు, వాళ్ళు సాధించిన - సాధిస్తోన్న సాధికారత మరో విశేషమైన అంశం. అంతా మహిళలే నడిపే భోజనశాలలు, చైనా వెళ్లి పీజీ చెయ్యబోతోన్న మహిళ, చీకట్లు విడవకముందే రైలు ప్రయాణం ఆరంభించి బిజినెస్ పనిమీద వన్ డే ట్రిప్ వేస్తోన్న కార్పొరేట్ మహిళ, వీళ్లందరినీ చూస్తే ముస్లిం దేశం అనగానే అక్కడి మహిళల స్థాయి గురించి నాలో స్థిరపడి ఉన్న భావనలు బద్దలయ్యాయి.

**ఇతర సాహితీ ప్రక్రియల అనువాదానికి, యాత్రా కథనాల అనువాదానికి మధ్య భేదం ఏమైనా ఉందా? ఉంటే అది ఎటువంటిది?**

ఏ ప్రక్రియలోనైనా అనువాదకుడు తానూ కూడా రచయిత అయి ఉండటం అత్యవసరం కాదుగాని ఎంతో వాంఛనీయం. ఒక సృజనాత్మక రచయితకు మరో భాషలోని రచయిత ఆత్మను పట్టుకోవడం సులభమవుతుంది.

ఈ నేపథ్యంలో ఒక కవి కవిత్వాన్నీ, ఒక కథకుడు కథలనూ అనువదించడం కాస్తంత సులభమవుతుంది. అలాగే ఒక యాత్రికుడు మరో యాత్రాగాథను అనువదించడం సులభమవుతుంది. ఉదాహరణకు ఉన్నత శిఖరాలు అధిరోహించే ట్రెక్కర్ ఆ శిఖరాలు చేరుకోడానికి పడే శ్రమ, మానసిక వత్తిడి మరో ట్రెక్కర్ మాత్రమే పరిపూర్ణంగా పట్టుకుని అనువదించగలడు. నా వరకు నేను కథలూ నవలలూ వ్యాసాలూ అనువదించడం కన్నా ఈ యాత్రా గాథను అనువదించడానికి సమయం రీత్యా అనుభవాల అన్వయం రీత్యా, సముచితమైన భాషను వాడటం రీత్యా ఎక్కువ శ్రమించాల్సి వచ్చింది.

**'అన్నీ గూగుల్ లోనే ఉన్నాయి' అన్న ఇప్పటి కాలంలో 'ఉహలకందని మొరాకో' లాంటి పుస్తకాల ప్రాసంగికత ఎంత?**

ముందుగా ఒక విషయం మనం స్పష్టంగా చెప్పుకోవాలి. టూరిస్టు వేరు, ట్రావెలర్ వేరు. వింతలూ విశేషాల కోసం ప్రయాణాలు చేసే టూరిస్టుల విషయంలో గూగుల్ సమాచారం వారి లక్ష్యాలకు కొంత వరకైనా దోహదం చేస్తుంది. జిజ్ఞాస పిపాసలు మూల ప్రేరణగా, అనుభవాలూ అనుభూతుల కోసం ప్రపంచాన్ని కౌగిలించుకోవడానికి వెళ్లే యాత్రికుల విషయంలో గూగుల్ సమాచారాలు నిర్వహించే పాత్ర దాదాపు శూన్యం. కొత్త ప్రదేశాలకు వెళ్లి, క్షణాల్లో అక్కడ ఇమిడిపోవడం, వారివారి భాషా సంస్కృతులను తాత్కాలికంగానైనా తనవిగా చేసుకోవడం, అక్కడివారిలో ప్రతిబింబాలు వెతుక్కోవడం, ఆ ప్రక్రియలో తనలోకి తాను ప్రయాణించడం, ఇవి యాత్రికుని మౌలిక లక్షణాలు. ఈ బాణీ అనుభవాలూ అనుభూతులూ మనకు 'ఉహలకందని మొరాకో' లాంటి యాత్రాగాథల్లో కనిపిస్తాయి.

ఇంటర్వ్యూ కె.ఎన్. మురళి శంకర్
94401 34256



మెట్ల పూజలో పాల్గొన్న భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్

## లక్ష్మీనృసింహుడికి లోకేశ్ ప్రత్యేక పూజలు

- మంగళాద్రి నడక మార్గంలో కుటుంబంతో మెట్ల పూజ
- స్వామి, అమ్మవార్లకు 320 గ్రాముల బంగారు కానుకలు

మంగళగిరి సిటీ, జనవరి 7: గుంటూరు జిల్లా మంగళగిరిలో ప్రసిద్ధిగాంచిన శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఎగువ, దిగువ సన్నిధులతో పాటు శివాలయంలో ఆదివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లి భువనేశ్వరి, భార్య బ్రాహ్మణి, తనయుడు దేవాన్ష్‌తో కలసి ఉదయం క్షేత్రాన్ని చేరుకున్నారు. దిగువ సన్నిధిలోని తూర్పు రాజగోపురం వద్ద దేవస్థానం అధికారులు, అర్చకస్వాములు, స్థానిక టీడీపీ నేతలు వారికి ఘనస్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద మొక్కిన అనంతరం స్వామివార్లకు సమర్పించబోయే బంగారు ఆభరణాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ అమ్మవారికి బంగారు కిరీటం అలంకరించారు. అనంతరం రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బంగారు పంచపాత్ర, ఉద్ధరిణి సమర్పించారు. అక్కడినుంచి శివాలయాన్ని చేరుకుని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించి వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. మంగళాద్రిపై కొలువైన పానకాలస్వామి సన్నిధిని చేరుకునే నడక మార్గంలో కుటుంబ సభ్యులతో కలసి లోకేశ్ మెట్ల పూజ నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. స్వామి పానకాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని కంఠహారం బహూకరించారు. మొత్తం సుమారు రూ.20లక్షల విలువైన 320గ్రా. బంగారు ఆభరణాలను ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డికి లోకేశ్ కుటుంబ సభ్యులు అందజేశారు.

## 10 అసెంబ్లీ, 2 ఎంపీ సీట్లు కావాలి: అంబికా కృష్ణ

విజయవాడ (ధర్నాచౌక్), జనవరి 7: రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది శాతం ఓట్లు కలిగిన ఆర్యవైశ్య సామాజికవర్గానికి పది అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని రాజకీయ పార్టీలను ఆర్యవైశ్య పొలిటికల్ జేఏసీ కన్వీనర్ అంబికా కృష్ణ కోరారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సామాజికవర్గంలోని ఆశావాహుల జాబితాను అన్ని రాజకీయ పార్టీల అధినేతలకు అందజేసి సీట్లు కేటాయించాల్సిందిగా డిమాండ్ చేస్తామని కృష్ణ తెలిపారు. బీజేపీ అధిష్ఠానం నిర్ణయిస్తే తాను పోటీకి సిద్ధంగా ఉన్నట్టు ఆయన చెప్పారు. త్వరలో జేఏసీ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని జేఏసీ కో-కన్వీనర్ హరిప్రసాద్ చెప్పారు.

## ఫిబ్రవరి 8న దళిత సింహగర్జన: హర్షకుమార్

రాజమహేంద్రవరం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ ప్రభుత్వం దళితులకు చేసిన ద్రోహాన్ని ఎండగట్టడానికి ఫిబ్రవరి 8న రాజమహేంద్రవరంలో సుమారు 10 లక్షల మందితో దళిత సింహగర్జన బహిరంగ సభ నిర్వహించనున్నట్టు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్‌లోని వేమగిరి జాతీయ రహదారి సమీపంలో సింహగర్జన సభ నిర్వహించే 56 ఎకరాల స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డాక్టర్ సుధాకర్‌తో పాటు అనేకమంది దళితులపై దాడులు జరిగాయని, వేధింపులు తాళలేక అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు అమలు చేయవలసిన 27 సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు.

# డోలీపై చేర్చినా.. దక్కని ప్రాణం!

- కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఆరు నెలల చిన్నారి మృతి
- గ్రామానికి సరైన రోడ్డులేక సకాలంలో అందని వైద్యం



శృంగవరపుకోట రూరల్, జనవరి 7: ఈ ఫొటోలో అమాయకంగా.. అందంగా కనిపిస్తున్న చిన్నారికి ఇంకా పేరు కూడా పెట్టలేదు. ఈ భూమి మీదికొచ్చి ఆరు నెలలైనా కాకముందే ఆ పాపకు నిండునూరేళ్లు నిండిపోయాయి. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆ గ్రామానికి సరైన రోడ్డులేక.. సకాలంలో వైద్యం అందక ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడుకు రోడ్డు సౌకర్యం లేదు. కనీసం ద్విచక్రవాహనం రావాలన్నా కష్టమే. అత్యవసరమైతే ఇక అంతే సంగతులు. ఈ నేపథ్యంలో ఈనెల 5న ఆ గ్రామానికి చెందిన బాలింత మాదల గంగమ్మ, ఆమె ఆరు నెలల పాప తీవ్రమైన అనారోగ్యం పాలయ్యారు. దీంతో భర్త గంగులు తోటి గిరిజనుల సాయంతో ఐదు కిలోమీటర్లు డోలీపై మోసుకుంటూ వెళ్లారు. మైదాన ప్రాంతమైన బొడ్డవర చేరాక వాహనంలో ఎస్.కోట సీహెచ్‌సీకీ తరలించారు. గంగమ్మ ఆరోగ్యం కుదుటపడడంతో ఆమెను డాక్టర్లు సొంతూరుకు పంపించేశారు. అయితే చిన్నారి ఆరోగ్యం విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లామని, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిందని కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. రోడ్డు సౌకర్యంలేని కారణంగా ఓ చిన్నారి ప్రాణం బలైపోయిందని స్థానిక గిరిజన యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో నాయకులు రావడం.. రోడ్డు వేయిస్తామని చెప్పడం.. తాము నమ్మి వారికి ఓట్లేసి మోసపోవడం పరిపాటిగా మారిందని వాపోయారు.



ఈ నెల 5న తల్లీబిడ్డను డోలీలో తీసుకెళ్తున్న దృశ్యం

# రైతు మెడపై 'టైటిల్' కత్తి

## న్యాయస్థానం కళ్లకు గంతలు కట్టిన జగన్ సర్కార్

- అక్టోబరు 31నే అమల్లోకి వచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం
- నవంబరు 1న జీవో జారీ... గెజిట్‌లో ప్రచురణ
- ఆమేరకు డిసెంబరు 29న ల్యాండ్ అథారిటీ ఏర్పాటు
- జీవో 512 సజీవంగా ఉన్నంత కాలం చట్టం అమల్లో ఉన్నట్లే... న్యాయ నిపుణులు
- వివాద రహితంగా టైటిల్ హక్కు... ఓ మిథ్య
- చట్టంలోనే పేర్కొన్న వివాద రిజిస్టర్
- అప్పిలేట్‌లలో విశ్రాంత అధికారులా..!
- ప్రభుత్వ హామీలను నమ్మని ఆందోళనకారులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అబద్ధాలు, అసత్యాలతో న్యాయస్థానాల కళ్లకు గంతలు కట్టడంలో జగన్ సర్కారు ఆరితేరిందని మరోసారి నిరూపితమయింది. జనవరి 3న హైకోర్టు ధర్మాసనానికి టైటిల్ చట్టం అమలుపై 'రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కు చట్టం - 2023 (ల్యాండ్ టైటిల్ యాక్ట్) అమల్లోకి రాలేదు. స్థిరాస్తి దావాలను సివిల్ కోర్టులు తిరస్కరించాల్సిన అవసరం లేదు' అని జగన్ సర్కారు విస్పష్టంగా చెప్పింది. అయితే వాస్తవం దానికి పూర్తి విరుద్ధంగా ఉంది. రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం - 2023 అమల్లో ఉంది. గత ఏడాది అక్టోబరు 31 నుంచే చట్టం అమల్లోకి వచ్చింది. ఈ మేర కు ప్రభుత్వం గత ఏడాది నవంబరు 1న జీఓ 512 జారీ చేసింది. ఆ జీఓను గెజిట్‌లో ప్రచురించారు. అయితే ఈ జీఓను సర్కారు ప్రజలకు అందుబాటులో ఉంచకుండా రహస్యంగా ఉంచింది. అప్పట్లోనే ఆంధ్రజ్యోతి ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ జీఓ అమల్లో ఉండగా సివిల్ కోర్టులు భూ వివాద కేసులను స్వీకరించలేవు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ న్యాయవాదులు, రైతులు, హక్కుల సంఘాల ప్రతినిధులు ఆందోళనలు చేస్తున్నారు. అంటే, చట్టం అమల్లో లేదని ప్రభుత్వం తరఫున ఏజీ ధర్మాసనం ముందు ప్రస్తావించడం పూర్తి సత్యదూరం. చట్టం అమల్లోకి రాలేదు కాబట్టి సివిల్ కోర్టులు భూ వివాదాల కేసులను విచారణకు స్వీకరించ వచ్చు అన్నది ఒట్టిమాటే. చట్టంలో చాప్టర్ 1, సెక్షన్ 3లో పేర్కొన్నదాని ప్రకారం అపాయింటెడ్ డేట్‌ను ప్రభుత్వం ప్రకటించిన రోజు నుంచే చట్టం అమల్లోకి వచ్చినట్లు ఉంది. అంటే, ఇంకా రైతుల మెడపై టైటిల్ కత్తి వేలాడుతున్నట్లే. దీన్ని నిజం చేస్తూ, గత ఏడాది డిసెంబరు 29న రాష్ట్ర సర్కారు, చట్టం అమలులో భాగంగా సీసీఎల్ఏ చైర్‌పర్సన్‌గా భూమి సాధికార సంస్థ (ల్యాండ్ అథారిటీ)ని ఏర్పాటు చేసింది. అప్పటికే టైటిల్ చట్టంకు వ్యతిరేకంగా సకల వర్గాలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నాయి. సాధారణంగా ప్రజలు, తన నిర్ణయాలను వ్యతిరేకిస్తు పోరాటం చేస్తుంటే సమస్య ఎక్కడుందో ప్రభుత్వం పునఃపరిశీలన చేస్తుంది. కానీ, జగన్ సర్కారు అందకు భిన్నంగా ఆందోళనలు చెలరేగుతున్న సమయంలోనే చట్టం అమలు కోసం ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేస్తూ జీఓ 630ని జారీ చేసింది.

### జీవో సజీవంగా ఉండగా...

అయితే, హైకోర్టులో న్యాయవాదులు కేసులు దాఖలు చేసే సరికి సర్కారు 'అబ్బే చట్టం ఇంకా అమల్లోకి తీసుకు రాలేదు' అంటూ నిత్యం వల్లించే అబద్ధాలనే వల్లె వేసింది. చట్టం అమలుకు ప్రాంతాల వారీగా నోటిఫికేషన్స్ ఇవ్వలేదని, ఇంకా టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారులను నియమించలేదని ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. సివిల్ కోర్టులు స్థిరాస్తి వివాదాల కేసులను విచారించొచ్చు అని నివేదించింది. ప్రభుత్వ వాదనను న్యాయ నిపుణులు తప్పు పడుతున్నారు. 'చట్టం అమల్లోకి తీసుకొస్తూ ఇచ్చిన జీఓలు సజీవంగా ఉండగా సివిల్ కోర్టులు భూ వివాదాల కేసులను విచారణకు ఎలా స్వీకరించగలవు? అది చట్టవిరుద్ధమైన అంశం అవుతుంది. సివిల్ కోర్టులు ఆ పనిచేయాలంటే, జీఓ 512ను సర్కారు ఉపసంహరించుకోవాలి. లేదంటే అమలును నిలిపివేస్తూ కొత్తగా ఉత్తర్వులు ఇవ్వాలి. ఇదే విషయాన్ని కోర్టుకు నివేదించాలి. అప్పుడే సివిల్ కోర్టులు భూ వివాదాల కేసుల విచారణ చేపట్టగలవు' అని న్యాయవాద వర్గాలు వివరిస్తున్నాయి. కానీ సర్కారు ఆ జీఓను వెనక్కి తీసుకోలేదు. అలాగని సస్పెండ్ చేయలేదు.

### టైటిల్ రిజిస్ట్రేషన్‌కు రీ సర్వే

రికార్డులనే ప్రామాణికంగా తీసుకోబోతున్నారు. తప్పులతడకగా ఉంటున్న వాటిని పరిగణించి టైటిల్ ఇస్తే మరిన్ని భూ వివాదాలు వస్తాయని రైతుకూలీ సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూ వివాదాల పరిష్కారం కోసం ఏర్పాటు చేసే అప్పిలేట్‌లలో విశ్రాంత అధికారులను నియమించవచ్చు అన్న క్లాజు ఉంది. దీన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సర్వీసులో ఉన్నవారు తప్పులు చేస్తేనే వారిపై సరైన చర్యలు తీసుకోలేకపోతున్నారని, ఇక విశ్రాంత అధికారులపై ప్రభుత్వానికి ఏం నియంత్రణ ఉంటుంది? అన్న ప్రశ్న అటు రైతులే కాదు... ఇటు రెవెన్యూ వర్గాల నుంచి కూడా ఎదురవుతోంది. ఈ నేపథ్యంలోనే హైకోర్టుకు ప్రభుత్వం ఇచ్చిన భరోసాపై నమ్మకం లేక ఇంకా ఆయా వర్గాలు ఆందోళనలను కొనసాగిస్తున్నాయి.

### చట్టంలో కలవరపెట్టే అంశాలు

భూ యాజమాన్య హక్కు చట్టం - 2023, సివిల్ కోర్టుల ప్రమేయాన్ని నిరోధిస్తుంది. ఈ మేరకు చాప్టర్ 6లోని సెక్షన్ 38లో ప్రముఖంగా ప్రస్తావించారు. 'పూర్తి వివాద రహితంగా టైటిల్ హక్కులు' అన్నది కేవలం ఫ్యాన్సీ నినాదమేనని ప్రభుత్వమే చట్టంలోనే చెప్పకనే చెప్పింది. అన్ని రికార్డులూ స్పష్టంగానే ఉన్నప్పటికీ ఎవరైనా దానిపై వివాదాన్ని లేవనెత్తితే సదరు భూమిని వివాద రిజిస్టర్ (డిస్ప్యూట్ రిజిస్టర్)లో నమోదు చేస్తారు. దానిపై సదరు భూ యజమాని హైకోర్టులో కేసు వేసుకోవాలి. రైతుకు శాశ్వత భూ యాజమాన్య హక్కు కల్పించే చట్టంలో కూడా వివాదాల రిజిస్టర్‌లు ఉంటాయి. వివాదం తేలేవరకు అసలు హక్కుదారులకు గ్యారంటీ ఇవ్వరు. ప్రస్తుతం రాష్ట్రంలో భూముల సర్వే జరుగుతోంది. రీ సర్వే అనంతరం ఇస్తోన్న భూమి పాస్ పుస్తకాల్లో భారీగా తప్పులు ఉంటున్నాయి. వాటిని రెవెన్యూ యంత్రాంగం సరిచేయడం లేదు. పైగా ఒకే భూమిపై ఇద్దరికి పాస్ పుస్తకాలు ఇచ్చిన ఉదంతాలూ వెలుగు చూస్తున్నాయి.

## ఎక్సైజ్‌లో విలాసాల 'అధికారి'

- విమాన టికెట్లు, హోటల్ రూమ్‌లు తరచూ బుక్ చేయాలంటూ ఒత్తిడి
- జిల్లాల అధికారుల జేబులకు చిల్లు.. డిప్యూటీ సీఎంకు చెప్పలేక ఆవేదన

అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆయనొక అనధికారిక అధికారి! రెగ్యులర్ ఉద్యోగి కాకపోయినా డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేషీలో చేరారు. సాంకేతికంగా ఎలాంటి అధికారాలు లేకపోయినా సర్వం నేనేనంటూ పెత్తనం చేస్తుంటారు. అంతటితో ఆగకుండా గత కొంతకాలంగా ఉన్నతాధికారుల స్థాయిలో సౌకర్యాలు కల్పించాలంటూ డిమాండ్ చేయడం శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఆయన తరచూ బెంగళూరుకు వెళ్తుంటారు. ఆయన వెళ్లడానికి ముందే అక్కడ హోటల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, విమాన టికెట్లు బుక్ చేయాలని జిల్లాల ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. అదేమంటే ఉపముఖ్యమంత్రి పేషీ అని బెదిరిస్తుండటంతో వేరే దారిలేక అయ్యవారు కోరినట్టు చేస్తూ అధికారులు తమ జేబులకు చిల్లు పెట్టుకుంటున్నారు. అలాగే ఆయన తిరుపతి వెళ్లినా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర నగరాలకు వెళ్లినప్పుడు కూడా ఆయనకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాల్సిందే. ఈ ఏర్పాట్లు చేయలేక జిల్లాల ఎక్సైజ్ అధికారులు గగ్గోలు పెడుతున్నారు. అలాగని సదరు అధికారి ఆదేశాలను డిప్యూటీ సీఎం నారాయణస్వామికి చెప్పే ధైర్యం లేక తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గతేడాది బార్ పాలసీ సమయంలోనూ సదరు అధికారే చక్రం తిప్పారు. విజయవాడలో బినామీల పేర్లతో 5 బార్ లైసెన్సులు దక్కించుకున్నారు. బార్ల కోసం తీవ్రంగా పోటీ ఏర్పడటంతో దరఖాస్తు ఉపసంహరించుకోమని ఎవరైనా డబ్బులు ఆఫర్ చేస్తారని ఆశించి దరఖాస్తు చేసినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. చివరికి ఎవరూ ఎలాంటి ఆఫర్లు ఇవ్వకపోవడంతో ఐదు బార్లకు లైసెన్సు ఫీజును కట్టలేకపోయారు. ఇతరత్రా వ్యాపారుల విషయంలో కఠినంగా వ్యవహరించిన అధికారులు.. ఈయన బినామీల బార్లకు మాత్రం అడిగినంత సమయం ఇచ్చారు. చివరికి బార్లను వేరే వారికి అమ్మినట్టు తెలిసింది.

## ఎన్టీఆర్ విగ్రహం పాక్షిక ధ్వంసం

పూతలపట్టు, జనవరి 7: చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం ఎగువ పాలకూరులో గుర్తుతెలియని వ్యక్తులు ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు రాళ్లతో కొట్టగా పాక్షికంగా దెబ్బతింది. విగ్రహం కింద ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. విగ్రహం పక్కనే ఉన్న చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి గురుస్వామి చిల్లర దుకాణానికి చెప్పులు, చీపుర్లతో మాలవేసి, ఆవుపేడ తెచ్చి దుకాణం ముందు పడేసి వెళ్లారు. ఎగువపాలకూరు దళితవాడకు చెందిన ఐదుగురు వైసీపీ వారిపై అనుమానంగా ఉందని గురుస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సమస్యలపై సామరస్యంగా చర్చించుకోవాలి
## రాడికల్‌గా వ్యవహరించకూడదు

- మునిసిపల్ ఉద్యోగుల సభలో మంత్రి సురేశ్



విశాఖపట్నం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య వారధిలా ఉద్యోగ సంఘాలు పనిచేయాలని మునిసిపల్ శాఖమంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన ఏపీ మునిసిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభకు ఆయనతోపాటు రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. మంత్రి సురేశ్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలు అంటేనే ఆర్థిక పరమైన అంశాలతో ముడిపడి ఉంటాయని, ఉద్యోగు లు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వంతో సామరస్యంగా చర్చించుకోవాలే తప్ప రాడికల్‌గా వ్యవహరించడం సరికాదన్నారు. ఉద్యోగులకు ఐఆర్ కావాలా? పీఆర్సీ కావాలా? ముందు తేల్చుకోవాలని మంత్రి బొత్స అన్నారు. ముందుగా ఐఆర్ ఇచ్చి తర్వాత పీఆర్సీ అమలు చేయాలని బొప్పరాజు కోరారు. సర్వీసు రూల్స్‌పై రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీల ఉద్యోగులతో చర్చించుకున్న తర్వాత తమ వద్దకు రావాలని, వారంతా అంగీకరిస్తే వాటిని అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యో ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న బైక్.. ముగ్గురు విద్యార్థులు మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 7: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మను మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరానికి చెందిన బందారు సాయి(18), బండ్రెడ్డిశివ(18), బండ్రెడ్డి బన్ను(19) తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. శనివారం రాత్రి బయట స్నేహితులతో పార్టీ చేసుకుని మోటారు సైకిల్‌పై వెళ్తూ రోడ్డుపక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు.

## బైక్‌పై వచ్చి 'కోటి' కాజేశారు..!

- నెల్లూరులో బంగారం వ్యాపారులపై దాడి

నెల్లూరు (క్రైం), జనవరి 7: వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఇద్దరు బంగారు వ్యాపారులపై.. బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు దాడిచేశారు. వారి వద్ద నుంచి రూ.కోటి విలువ చేసే బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. నెల్లూరు నగరంలో శనివారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రామ్మూర్తినగర్‌కు చెందిన చంద్రశేఖర్‌రావు, హరికోటేశ్వరరావు అనే అన్నదమ్ములకు మండపాల వీధిలో నగల దుకాణం ఉంది. మండపాలవీధికి చెందిన బంగారు వ్యాపారి రామాచారి వీరికి స్నేహితుడు. శనివారం హరికోటేశ్వరరావు రామాచారి వద్ద ఉన్న సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలను తీసుకుని విక్రయించేందుకు గూడూరుకి వెళ్లారు. అక్కడ కొన్ని ఆభరణాలు విక్రయించగా మిగిలిన కిలో 758 గ్రాముల నగలు(రూ.90లక్షలు), కొందరు వ్యాపారులు ఇచ్చిన రూ.10 లక్షల నగదును బ్యాగ్‌లో పెట్టుకొని శనివారం రాత్రి గూడూరు నుంచి ఆర్టీసీ బస్సులో నెల్లూరుకు బయల్దేరారు. బస్సు నెల్లూరుకి రాగానే అన్న చంద్రశేఖర్‌రావుకు ఫోన్‌చేసి బస్టాండ్‌కు రావాలని కోరాడు. అక్కడి నుంచి అన్నదమ్ములిద్దరూ బైక్‌పై ఇంటికి బయల్దేరారు. రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా మినీ బైపాసు సమీపంలోకి వచ్చే సరికి ముఖానికి మాస్కులు ధరించిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిపై దాడి చేసి బ్యాగ్ లాక్కుని పరారయ్యారు.

# తెలుగులో సంతకం చేయాలి

- మాతృ భాషను పరిరక్షించుకోవాలి
- నాగాలాండ్ గవర్నర్ లా గణేషన్ పిలుపు
- ముగిసిన అంతర్జాతీయ తెలుగు మహాసభలు

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)/రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 7: 'తెలుగు మాట్లాడాలి.. తెలుగు రాయాలి.. తెలుగులో సంతకం చేయాలి... భాషను పరిరక్షించుకోవాలి..' అని నాగాలండ్ గవర్నర్ లా గణేషన్ పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు సాగిన 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభల్లో పాల్గొన్న లా గణేషన్ మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి కూడా తెలుగు వారు తరలి వచ్చినందున ఈ సభలను 'విశ్వ సమ్మేళన్' అని ఆయన అభివర్ణించారు. 'భాష అనేది సంస్కృతి, గుర్తింపునకు మూలం. ఈ సభకు వచ్చిన వాళ్లు ఈ రోజు నుంచే తెలుగు మాట్లాడాలి, తెలుగులో రాయాలి, సంతకం తెలుగులో చేయాలి. ఇంగ్లీషు కలిసిన తెలుగును మాట్లాడుతున్నారు. ఆ తీరును ఆపేసి మాతృభాషను రక్షించండి' అని కోరారు. ఇప్పుడు స్వదేశంలోనూ ఉపాధి అవకాశాలు పెరిగాయి కాబట్టి విదేశాలకు వెళ్లిన వారు వెనక్కు వచ్చేసి వారి శక్తి సామర్థ్యాలను మాతృదేశానికి ఉపయోగించాలని ఆయన కోరారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ.. 'మొదటి గురువు అమ్మ కాబట్టి తెలుగును అమ్మ భాషనే అంటారు. అమ్మను, అమ్మభాషను గౌరవించినవాడు తప్పుచేయడు. అమ్మభాష కోసం ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మలే నడుం బిగించాలి' అని పిలుపునిచ్చారు. మరో న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ.. కారణాలేవైనా ఆసక్తి లేదనో, పరభాష మీద మోజు వల్లనో మనం ఆదరిస్తున్నామని, ఇతర భాషలు నేర్చుకోవడం తప్పులేదు కానీ, మాతృభాషను, మూలాలను మర్చిపోవడం క్షమించరాని నేరమని అన్నారు. సినీనటుడు ఆలీ మాట్లాడుతూ.. ప్రేమాభిమానాలకు పుట్టినిల్లు.. ఆప్యాయం, అనురాగం పంచేది ఈ గోదావరి గడ్డ అని కొనియాడారు. గవర్నర్ లా గణేషన్ చేతులమీదుగా పూర్ణకుంభ పురస్కారం తీసుకోవడం తన అదృష్టమన్నారు. దివంగత సినీ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తమకు కృష్ణంరాజును గవర్నర్‌గా చూడాలని కోరికగా ఉండేదన్నారు. వెయ్యి సంవత్సరాల క్రితం కలగాపులగంగా ఉన్న తెలుగు భాషకు ఒక స్వతంత్ర ప్రతిపత్తిని కలిగించాలని రాజరాజనరేంద్రుడు భావించాడని ప్రముఖ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. తెలుగు వారి కీర్తిని, వైభవాన్ని గీతాలాపన ద్వారా సభ ముందుంచారు.

### ముగిసిన పండుగ..
### ఈసారి అమరావతిలో సభలు

గోదావరి తీరాన మూడు రోజులపాటు కన్నుల పండువగా జరిగిన తెలుగువారి వేడుకలు '2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు' ఆదివారం ముగిశాయి. పీఠాధిపతులు, కవులు, రచయితలు, పండితులు, విద్వాంసులు, న్యాయమూర్తులు, ప్రముఖులు ఇలా ఎందరో లబ్ధ ప్రతిష్టులు విచ్చేసి తమ భావాలను పంచుకున్నారు. మూడు ఉప వేదికలపై వివిధ అంశాలపై సదస్సులు జరిగాయి. ఆంధ్రసారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థలు ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాయి. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు భాష పరిరక్షణలో భాగంగా మూడో అంతర్జాతీయ తెలుగు మహా సభలను 2026 జనవరి 3నుంచి 5వ తేదీ వరకు అమరావతిలో నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ ఏడాది డిసెంబరులో ప్రపంచ బాలల తెలుగు సంబరాలు నిర్వహించనున్నామన్నారు.



సభలో నాగాలాండ్ గవర్నర్ లా గణేషన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

### చైతన్యరాజుకు బిరుదు ప్రదానం

చైతన్య విద్యాసంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్యరాజు)కు ఆంధ్ర సారస్వత పరిషత్ తరపున గజల్ శ్రీనివాస్ వేదికపై అభినవ రాజరాజ నరేంద్ర బిరుదును ప్రదానం చేశారు. అలాగే ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న ఆంధ్ర వాఙ్మయ వైజయంతి పుస్తకాన్ని గవర్నర్ లా గణేశన్ ఆవిష్కరించారు.

# అమ్మ నిద్రపోతోందని..

- ఆరు రోజులుగా మృతదేహంతోనే కొడుకు జీవనం
- మనసిక వ్యాధితో తల్లి మరణాన్నీ గుర్తించని స్థితి
- విశాఖలో వెలుగులోకి



శ్యామల మృతదేహం

మద్దిలపాలెం (విశాఖపట్నం), జనవరి 7: అతడో మానసిక వ్యాధిగ్రస్థుడు. తల్లి మరణించిందనే విషయాన్ని కూడా గుర్తించలేకపోయాడు. ఆరు రోజులుగా మృతదేహం ఇంట్లో ఉంచుకునే జీవనం సాగిస్తున్నాడు. నిద్రపోతున్న తల్లిని లేపకూడదని భావించి, ఇంట్లో ఉన్న పళ్లు, కూరగాయలు తింటున్నాడు. రెండు రోజులుగా ఆ ఇంటి నుంచి దుర్గంధం వెలువడుతుండడం, ఆదివారం మరింత పెరిగిపోవడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. విశాఖ త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పెదవాల్తేరు కురుపాం టవర్స్ ఫ్లాట్ నంబరు 203లో ఇనగంటి శ్యామల (67) తన కుమారుడు శరవణ కుమార్ (27)తో కలిసి నివసిస్తోంది. ఆమె భర్త బాలసుబ్రహ్మణ్యం ఎల్ఐసీలో పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన కొద్ది సంవత్సరాల క్రితం మృతిచెందారు. శరవణ కుమార్ బీటెక్ పూర్తి చేసి బెంగళూరులో ఉద్యోగం చేసేవాడు. తండ్రి మృతిచెందిన తర్వాత అతడు తీవ్ర మానసిక వ్యాధికి గురయ్యాడు. దీంతో శ్యామల కుమారుడ్ని విశాఖ తీసుకొచ్చేశారు. భర్త మృతి అనంతరం వచ్చిన పరిహారం సొమ్ముతో ఇద్దరూ జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా గత రెండు రోజులుగా వారు నివసిస్తున్న ఫ్లాట్ నుంచి దుర్వాసన వస్తుండడంతో పక్క ఫ్లాట్‌లలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారంనాటికి దుర్గంధం మరింత పెరిగిపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫ్లాట్‌కు చేరుకుని తలుపు తట్టగా, లోపలి నుంచి స్పందనలేదు. దీంతో తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అక్కడ సోఫాపై కుళ్లిపోయిన స్థితిలో ఉన్న శ్యామల మృతదేహాన్ని చూసి నిర్ఘాంతపోయారు. పక్కనే ఉన్న కుమారుడు శరవణకుమార్.. తన తల్లి నిద్రపోతోందని, ఇంకా లేవలేదని, ఏం కావాలని ప్రశ్నించేసరికి పోలీసులు నివ్వెరపోయారు. ఇతను మానసికవ్యాధితో బాధపడుతున్నాడని అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు ఈ నెల ఒకటో తేదీన మృతిచెందినట్టు భావించారు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు కేసున మోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.



అలోహ బీచ్ రిసార్ట్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సంస్థ సీఎండీ గల్లా రామచంద్రరావు, డైరెక్టర్‌లు

## బాపట్ల బీచ్ ఎదురుగా 'శ్రీ భ్రమర'
## 'అలోహ బీచ్' రిసార్ట్‌కు శ్రీకారం

గుంటూరు, జనవరి 7: గృహ నిర్మాణ రంగంలో దూసుకెళుతున్న శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ బాపట్ల బీచ్ ఎదురుగా 'అలోహ బీచ్ రిసార్ట్' పేరుతో ఒక విలాసవంతమైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా గుంటూరులోని వెల్కమ్ హోటల్‌లో రిసార్ట్ గ్రాండ్ ప్రీ-లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ భ్రమర హౌసింగ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ.... అభివృద్ధి పథంలో దూసుకెళుతున్న ప్రస్తుత సమాజానికి విలాసవంతమైన జీవనశైలిని అందించటానికి శ్రీ భ్రమర చేపట్టిన అద్భుతమైన ప్రాజెక్టు 'అలోహ బీచ్ రిసార్ట్ వెడ్డింగ్ అని.., డెస్టినేషన్, కార్పొరేట్ మీట్స్, ఫ్యామిలీ హాలిడేస్ ట్రిప్‌నకు అనువుగా ఉంటుందన్నారు. థీమ్ పార్క్, వాటర్ స్పోర్ట్స్, ఫుడ్ కోర్ట్, బీచ్ ఫ్రంట్ హోటల్, హార్స్ రైడింగ్, బీచ్ వాలీబాల్, కిడ్స్ ప్లే జోన్ వంటి ఎన్నో సదుపాయాలు కలిగిన ఈ బీచ్ రిసార్ట్‌లో బీచ్ ఫ్రంట్ ఫ్లాట్స్, కాటేజస్, విల్లాస్ వినియోగదారులకు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్‌లు మారం చంద్రశేఖర్, ఎంఎస్ రాజు, ఎమ్‌పీకే లక్ష్మీపతిరాజు, శైలారెడ్డి కోట, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, చెన్నంశెట్టి సతీష్‌బాబు, కల్వకోట సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుడికి అవమానం

- ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణను అడ్డుకున్న పోలీసులు.. రెడ్డిసంఘం నేతల అరెస్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7: ఏపీ రెడ్డిసంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీనితోపాటు.. న్యూటౌన్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీ రెడ్డి సంఘం ఆత్మీయ సభ నిర్వహించాలని తలపెట్టగా, అనుమతి లేకుండా విగ్రహాన్ని ఎలా ఆవిష్కరిస్తారని, సభను ఎలా నిర్వహిస్తారని శనివారం అర్ధరాత్రి అనంతపురం త్రీటౌన్ పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై పోలీసులతో ఏపీ రెడ్డి సంఘం నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డితో పాటు నాయకులను అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. ఆదివారం ఉదయం వారిని వదిలిపెట్టారు. తరువాత విగ్రహావిష్కరణకు వెళ్తున్నవారిని పోలీసులు మళ్లీ అడ్డుకోవడంతో నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... నిరంకుశంగా వ్యవహరిస్తున్న జగన్ ప్రభుత్వానికి సరైన సమయంలో సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కాగా, ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయాలనుకుంటే ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరి అని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ఎవరినీ అరెస్టు చేయలేదని.. అవాస్తవాలు ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అడ్డుకోవడం అన్యాయం: బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 7: అనంతపురంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం పట్ల రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అడ్డుకోవడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తగదని అన్నారు. ఆదివారం కర్నూలులో ఆయన మాట్లాడుతూ ఈ సంఘటనతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రెడ్ల కులస్థులందరికీ అవమానం జరిగినట్టేనన్నారు. నాటి బ్రిటిష్ కాలంలో కూడా రెడ్ల కులస్థులకు ఇలా అవమానం జరగలేదని, సీఎం జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తగిన గుణపాఠం చెబుతామని బైరెడ్డి హెచ్చరించారు. ఈ నెల 10, 11 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రెడ్ల సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తు ప్రణాళిక కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

# దిక్సూచి DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



**ఈశాన్య భారతదేశం... భౌగోళికంగా, వాతావరణపరంగా, సాంస్కృతిక, భౌతిక లక్షణాల పరంగా మిగతా భారతదేశంతో పోలిస్తే చాలా భిన్నం. కొండ ప్రాంత తెగలతో కూడిన ఆ ప్రాంతంలో స్వేచ్ఛా కాంక్ష, సాంస్కృతిక అస్థిత్వ ఆకాంక్ష పిసరంత ఎక్కువే. ఆ ప్రాంతంలో అస్సాం రాష్ట్రానిది భిన్న నేపథ్యం.**

## ఉల్ఫా శాంతి ఒప్పందం

బ్రిటిష్‌వారి కాలంలో 1820లో అస్సాం ప్రాంతంలో మూడు విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. బ్రిటిష్‌వారు అస్సాం టీ వ్యాపారాన్ని భారీ ఎత్తున చేపట్టి తేయాకు తోటలను విస్తరించారు. అదే సమయంలో ఆ ప్రాంతంలో బొగ్గు, చమురు నిల్వల నిక్షేపాలు కనుగొనడంతోపాటు వాటి వెలికితీత ప్రారంభమైంది. కార్మిక సాంద్రత గల ఈ రంగాలకు స్థానిక కూలీల కొరత ఏర్పడింది. దీనితో బ్రిటిష్‌వారు దేశంలోని విభిన్న ప్రాంతాల నుంచి పనివారిని, బెంగాల్ నుంచి విద్యావంతులైన ఉద్యోగస్తులను ఈ ప్రాంతానికి తీసుకురావడం ప్రారంభించారు. కాలక్రమంలో ఆ ప్రాంత స్థానిక ప్రజల అస్థిత్వం, సహజవనరుల అందుబాటు నిర్వీర్యమయ్యాయి. 1947లో భారతదేశ విభజన, తూర్పు పాకిస్తాన్‌లో అస్థిర పరిస్థితుల కారణంగా భారీ సంఖ్యలో ఆ ప్రాంతం నుంచి కాందీశీకులు సరిహద్దు అస్సాంలోకి ప్రవేశించారు. దీనితో ఆ ప్రాంత స్థానిక ప్రజల్లో సాంస్కృతిక, భాషా, రాజకీయపర అస్థిత్వం, సహజ వనరులపై హక్కుల పరంగా అభద్రత భావం పెరిగాయి.

● చారిత్రకంగా దోపిడీకి, నిర్లక్ష్యానికి గురైన ఆ ప్రాంతంలో స్థానికులు తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికి, హక్కుల సాధనకు ఉద్యమించారు. 1967లో ఏర్పడిన ఆల్ అస్సాం స్టూడెంట్ యూనియన్(ఏఏఎస్‌యూ) వంటి సంస్థలు ఉద్యమాలు చేపట్టాయి. 1971లో బంగ్లాదేశ్ విముక్తి పోరాట సమయంలో ఆ ప్రాంతం నుంచి భారీ ఎత్తున కాందీశీకులు సరిహద్దు అస్సాంకు పోటెత్తారు. వారందరినీ ప్రభుత్వం ఓటర్ల జాబితాలో చేర్చుతుండడంతో స్థానికులు తమ ప్రాంతంలోనే మైనార్టీలుగా మారారు. దీనితో ఏఏఎస్‌యూ 1979లో అస్సాం ఉద్యమాన్ని చేపట్టింది. అక్రమ వలసదారులను ఓటర్ల జాబితాలో చేర్చడాన్ని అలాగే బెంగాల్, బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన బెంగాలీలను వ్యతిరేకిస్తూ సత్యాగ్రహం చేసింది.

● ఏఏఎస్‌యూలోని అతివాద నాయకులైన భీమకాంత బురాగోహైన్, అరబింద్ రాజ్‌ఖోవా, అనుప్ చేతియా, ప్రదిప్ గొగోయ్, భద్రేశ్వర్ గోహైన్, పరేష్ బారువాలు 1979లో భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'సార్వభౌమ అస్సాం' డిమాండ్‌తో సాయుధ వేర్పాటువాద ఉద్యమాన్ని ప్రారంభించారు. తొలుత పీడిత ప్రజలకు సహాయం చేసే ఉద్యమంగా తమ విధానాలు ఉంటాయని తెలిపినా అనతి కాలంలోనే కిడ్నాపులు, బాంబు పేలుళ్లు, దోపిడీలు, ఆయుధాల సమీకరణ, మాదక ద్రవ్యాల రవాణా, ప్రభుత్వ దళాలతో ప్రత్యక్ష పోరాటం వంటి చర్యలను ఉధృతం చేశారు.

● మియన్మార్, బంగ్లాదేశ్ వంటి సరిహద్దు దేశాల్లో, అడవుల్లో తమ స్థావరాలు ఏర్పాటు చేసుకుని భారత సైనిక దళాలకు చిక్కకుండా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ భారత్‌లో తీవ్రవాద కార్యకలాపాలు మొదలుపెట్టారు. 90వ దశకం నాటికి అస్సాం ప్రాంతంలో 'ఉల్ఫా' విశేష ప్రాబల్యం పొందింది. సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నామనే భావాన్ని వ్యాప్తి చేసింది.

● 1985లోనే రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఉల్ఫా సంస్థకు మాతృక అయిన ఏఏఎస్‌యూతోపాటు మరికొన్ని ఉద్యమ సంస్థలను చర్చలకు ఆహ్వానించింది. ఆరేళ్ల సుదీర్ఘ అస్సాం ఉద్యమ పోరాటానికి ఏఏఎస్‌యూ స్వస్తి పలికి భారత ప్రభుత్వంతో 'అస్సాం ఒప్పందం' చేసుకుంది. ఏఏఎస్‌యూ, ఆల్ అస్సాం గణ సంగ్రామ పరిషత్, కేంద్ర ప్రభుత్వం, అస్సాం రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఈ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ప్రభుత్వం తూర్పు పాకిస్తాన్ నుంచి వలస వచ్చిన వారిలో 1951 తరవాత, 1971కి ముందు వచ్చిన వారికి మాత్రమే పౌరసత్వం ఇచ్చి మిగిలినవారిని ఓటర్ల జాబితా నుంచి తీసివేసి చట్ట ప్రకారం తిప్పి పంపేందుకు సమ్మతించింది. అస్సాం స్థానికులకు రాజ్యాంగపరంగా భద్రత కల్పించేందుకు, రాష్ట్ర సరిహద్దులను పటిష్టం చేసి నిఘా పెంచేందుకు అంగీకరించింది. దీనితో అస్సాం ఉద్యమ పోరాటానికి స్వస్తి పలికిన ఏఏఎస్‌యూ, ఏఏజీఎస్‌పీ, ఇతర ఉద్యమ సంస్థలు కలసి 'అస్సాం గణ పరిషత్(ఏజీపీ)' అనే ప్రాంతీయ రాజకీయ పార్టీగా ఏర్పడ్డాయి. 1985 డిసెంబరు ఎన్నికల్లో ఈ పార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

● అయినప్పటికీ అస్సాం ప్రాంతంలోకి అక్రమ చొరబాట్లు మాత్రం ఆగలేదు. అదేవిధంగా ఉల్ఫా తన విప్లవాత్మక ఉద్యమ పంథాను వీడక ఉద్యమాన్ని మరింత తీవ్రం చేసింది. ప్రభుత్వాన్ని, అధికారులను 'అస్సాం గణ పరిషత్' ప్రభావితం చేయడం మొదలుపెట్టింది. యూనిలివర్, టాటా టీ వంటి వాణిజ్య సంస్థలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడింది.

● ఈ నేపథ్యంలో ఉల్ఫా తీవ్రవాదుల అణచివేతకు అంతర్జాతీయ వాణిజ్య సంస్థలు, వ్యాపార వర్గాలనుంచి భారత ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. దీనితో భారత ప్రభుత్వం ఉల్ఫా తీవ్రవాదుల ఏరివేతకు 'ఆపరేషన్ భజరంగ్'ను చేపట్టింది. 1200ల మందికి పైగా ఉల్ఫా తీవ్రవాదులను అరెస్ట్ చేసింది. అస్సాంను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి రాష్ట్రపతి పాలన విధించింది. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్‌ను అమల్లోకి తెచ్చింది. దీనివల్ల ఉల్ఫా అగ్రశ్రేణి నాయకత్వం చాలావరకు అరెస్ట్ కావడం/మరణించడంతో ఒక వర్గం ఉల్ఫా తీవ్రవాదులు లొంగిపోవడానికి నిర్ణయించుకున్నారు. పరేష్ బారువా నాయకత్వంలో మరికొంతమంది ఉద్యమాన్ని వీడేందుకు సమ్మతించలేదు. ఈ కారణంగా ఉల్ఫాలో 1992లో చీలిక వచ్చింది. లొంగిపోయిన ఉల్ఫా తీవ్రవాదులను సరెండర్డ్ ఉల్ఫాగా పరిగణించారు. వీరు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఉల్ఫా తీవ్రవాదులను, వారి కుటుంబాలను రహస్యంగా హతమార్చడంతో ఈ సుదీర్ఘ పోరాటంలో అలసిపోయిన ఉల్ఫా తీవ్రవాదులు భారీ సంఖ్యలో లొంగిపోయారు. 1991 నుంచి 1998 మధ్య కాలంలో ఎనిమిది వేలమంది తీవ్రవాదులు లొంగిపోయినట్లు అంచనా. భారత సైన్యం కూడా ఉల్ఫా ఉగ్రవాదులను సరిహద్దు ప్రాంతాల నుంచి ఏరివేయడం ప్రారంభించింది. భారత అభ్యర్థన మేరకు భూటాన్ ప్రభుత్వం తమ భూభాగంలో ఉన్న ఉల్ఫా క్యాంప్‌లను 2003లో తమ రాయల్ ఆర్మీ చేత 'ఆపరేషన్ ఆల్ క్లియర్' పేరుతో నాశనం చేయించింది. ఉద్యమ విరమణకు ఉల్ఫాలో ఒత్తిడి పెరిగింది. 2003లో ఉల్ఫా మూడు కండి షన్లతో భారత ప్రభుత్వంతో చర్చలకు ప్రతిపాదించింది. భారతదేశం వెలుపల, ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణలో అస్సాం సార్వభౌమాధికారం ప్రధానాంశంగా చర్చలు ఉండాలని ఉల్ఫా విధించిన ఆంక్షలకు ప్రభుత్వం సమ్మతించలేదు. 2005లో ఉల్ఫా పదకొండుమంది సభ్యులతో ఇందిరా రైసోమ్ గోస్వామి(అస్సామీ రచయిత్రి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత) ఆధ్వర్యంలో 'పీపుల్స్ కన్సల్టేటివ్ గ్రూప్'ను ఏర్పాటు చేసి చర్చలకు ప్రతిపాదించింది. మూడు రౌండ్ల అనంతరం ఉల్ఫా చర్చలను బహిష్కరించి తిరిగి హింసాత్మక చర్యలు కొనసాగించింది.

● 2008లో అరబింద్ రాజ్ ఖోవా వంటి కమాండర్స్ మళ్ళీ ప్రభుత్వంతో చర్చల ప్రస్తావన తెచ్చారు. చర్చలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఈ వర్గాన్ని చర్చలను వ్యతిరేకిస్తున్న పరేష్ బారువా వర్గం ఉల్ఫా నుంచి బహిష్కరించింది. ఇలా 2012లో ఉల్ఫా(ఇండిపెండెంట్)గా ప్రకటించుకుని అస్సాం సార్వభౌమత్వమే తమ ఆశయంగా పునరుద్ఘాటించారు.

● అరబింద్ రాజ్ ఖోవా వర్గం 2012లో 12 డిమాండ్ల చార్టర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించి చర్చల నిమిత్తం ప్రభుత్వ క్యాంప్‌లలో పన్నెండేళ్లు నిరీక్షించింది. రాజ్ ఖోవా వర్గం ప్రతిపాదించిన డిమాండ్లలో స్థానిక తెగలకు భూ సంబంధ హక్కులు, నూతన రిజర్వేషన్లు, స్థానిక సంస్కృతి-సంప్రదాయాలు, భాషల పరిరక్షణ, స్థానిక ఖనిజ సంపద వనరుల్లో స్థానికుల వాటా, బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలను అడ్డుకోవడం, వలస వచ్చినవారిని తిప్పి పంపడం, పౌరసత్వ రిజిస్టర్ల సవరణ, లొంగిపోయిన మిలిటెంట్లకు పునరావాస ప్యాకేజీ వంటి అంశాలు ఉన్నాయి.

● 2023 ఏప్రిల్‌లో భారత ప్రభుత్వం స్పందించి ఒక రౌండ్ చర్చలు జరిపింది. తరవాత 2023 డిసెంబరు 29న కేంద్ర ప్రభుత్వం, అస్సాం ప్రభుత్వం, అరబింద్ రాజ్ ఖోవా నేతృత్వంలోని ప్రోటాక్స్ ఉల్ఫా వర్గం కలసి త్రైపాక్షిక శాంతిఒప్పందం చేసుకున్నాయి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

### త్రైపాక్షిక శాంతి ఒప్పందం ప్రయోజనాలు

● తొమ్మిది వేలమందికి పైగా మిలిటెంట్లు లొంగిపోవడంతో అస్సాంలోని 85 శాతం ప్రాంతాల నుంచి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ యాక్ట్‌ను ఉపసంహరించనున్నారు.

● అస్సాంలోని 127 అసెంబ్లీ స్థానాల్లో 97 స్థానాలను స్థానిక అస్సామీలకు రిజర్వ్ చేస్తారు. భవిష్యత్తులో నిర్వహించే డీలిమిటేషన్ ప్రక్రియలో ఈ విధానాన్ని అనుసరిస్తారు.

● తక్షణమే 1.5 లక్షల కోట్ల పెట్టుబడులతో అస్సాం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తూ ఇతరత్రా ప్యాకేజీలు, భారీ ప్రాజెక్టులు కేటాయిస్తారు.

● ఉల్ఫా డిమాండ్ల పరిష్కారానికి చొరబాట్ల నిరోధానికి అక్రమ వలసదారుల ఏరివేతకు ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుంది.

● ఈ త్రైపాక్షిక ఒప్పందంతో దాదాపు వేయి మందిని బలిగొన్న హింసాత్మక ఉద్యమానికి తెరపడిందని, అస్సాంలో శాంతి స్థాపన జరిగిందని కేంద్ర హోంమంత్రి ప్రకటించడం అర్ధసత్యమనీ, మియన్మార్ నుంచి ఉద్యమాన్ని కొనసాగిస్తున్న పరేష్ బారువా నేతృత్వంలోని ఉల్ఫా(ఇండిపెండెంట్) వర్గం క్రియాశీలంగా ఉండగా సంపూర్ణ శాంతి ఎలా సాధ్యమౌతుందని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు.

● ఉల్ఫాకు గత 44 ఏళ్ల నుంచి ఇప్పటివరకూ చుట్టుపక్కల దేశాలైన బంగ్లాదేశ్, మియన్మార్, చైనా, పాకిస్తాన్‌ల సహాయం లభిస్తోంది. పాకిస్తాన్ ఐఎస్ఐ నుంచి వీరు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. చైనా, ఇస్లామిక్ (హర్కత్ ఉల్ జిహాద్ ఇ ఇస్లామీ తదితరాలు) ఉగ్రవాద సంస్థల నుంచి వీరికి ఆయుధ సహాయం అందుతోంది. పరేష్ బారువా గతంలోనే అల్‌ఖైదా నేత ఒసామా బిన్ లాడెన్‌తో చర్చలు జరిపేంత నెట్‌వర్క్‌ను ఏర్పరచుకున్నాడు. పైగా గత పన్నెండేళ్ల నుంచి ప్రభుత్వ క్యాంప్‌లలో ఆశ్రయం పొందుతూ పునరావాస సహాయం కోసం ఎదురు చూసి విసిగిన అనేకమంది మిలిటెంట్లు తిరిగి పరేష్ బారువా నేతృత్వంలోని ఉల్ఫా వర్గంలో చేరినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రస్తుత త్రైపాక్షిక ఒప్పందంతో అస్సాంలో పూర్తిస్థాయి శాంతి నెలకొల్పడమనేది సందేహమే. ప్రభుత్వం చర్చల అంశాన్ని పన్నెండేళ్లు సాగదీసి వ్యూహాత్మకంగా రాజ్‌ఖోవా వర్గం డిమాండ్లపై పట్టుపట్టకుండా వారు విసుగు చెంది పునరావాసం కోసం మాత్రమే బేరమాడేలా చేసిందని ఇది ఎప్పటికైనా వారు తమ డిమాండ్ల కోసం తిరిగి ఉద్యమించడానికి దారితీయవచ్చని విశ్లేషకుల అంచనా!

● ప్రస్తుత శాంతి ఒప్పందం అనేది అటు ప్రభుత్వం ఎన్నికల సమయంలో లబ్ధి పొందేందుకు ఇటు రాజ్ ఖోవా వర్గ పునరావాసానికి మాత్రమే ఉపయోగపడిందనీ అసలు ఉద్యమ కారణం అయిన అక్రమ వలసల అంశంపై నిర్దిష్ట చర్యలు లేకుండానే ఒప్పందం ముగిసిందనీ అస్సాం ప్రాంతానికి ఒనగూరింది ఏమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● భారీ సంఖ్యలో మిలిటెంట్లు లొంగిపోవడం, అస్సాం ప్రాంతంలో దాదాపు 85 శాతం మిలిటరీ అజమాయిషీ నుంచి బయట పడడం వంటి సానుకూల అంశాలను విస్మరించరాదని ఆశావహుల అభిప్రాయం.

# అర్థమెటికల్ రీజనింగ్

పోటీ పరీక్షల ప్రత్యేకం

### పార్ట్-2

**1. సూర్య పుట్టినప్పుడు అతని తండ్రి వయసు అతని సోదరుని కంటే 32 సంవత్సరాలు ఎక్కువ. సూర్య తల్లి వయస్సు, అతని సోదరి కంటే 25 సంవత్సరాలు ఎక్కువ. సూర్య పుట్టినప్పుడు అతని సోదరునికి 6 సంవత్సరాలు. అతని తల్లికి అతని తండ్రి కంటే 3 సంవత్సరాలు తక్కువ. అయిన సూర్య పుట్టినప్పుడు అతని సోదరి వయసు ఎన్ని సంవత్సరాలు?**

ఎ) 10 సం॥ బి) 12 సం॥ సి) 8 సం॥ డి) ఏదీకాదు **సమాధానం: (ఎ)**

**వివరణ:** సూర్య పుట్టినప్పుడు అతని సోదరుని వయస్సు = 6 సం.

సూర్య పుట్టినప్పుడు అతని తండ్రి వయస్సు = సోదరుని కంటే 32 సం॥లు ఎక్కువ అనగా = 32 + 6 = 38 సం॥.

అతని తల్లి, తండ్రి కంటే 3 సం॥లు చిన్నది అనగా 38 - 3 = 35 సం॥.

అతని తల్లి, సోదరి కంటే 25 సం॥లు పెద్ద అనగా సూర్య పుట్టినప్పుడు అతని సోదరి వయస్సు 35 - 25 = 10 సం॥. ∴ సమాధానం 10 సం॥.

**2. ఒక బస్సు 'A' నగరం నుంచి బయలుదేరింది. బస్సు బయలుదేరే సమయానికి ప్రయాణికుల్లోని మహిళల సంఖ్య, పురుషుల సంఖ్యలో సగం. ఆ బస్సు 'B' నగరానికి చేరుకున్న తరవాత 10 మంది పురుషులు బస్సు దిగారు, ఐదుగురు మహిళలు బస్సు ఎక్కారు. ఇప్పుడు ఆ బస్సులో పురుషుల సంఖ్య, మహిళల సంఖ్య సమానం. అయితే ఆ బస్సు బయలుదేరిన సమయంలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారు?**

ఎ) 40 బి) 42 సి) 36 డి) 45 **సమాధానం: (డి)**



రీజనింగ్

**వివరణ :** 'A' నగరంలో బస్సు బయలుదేరిన సమయంలో మహిళల సంఖ్య పురుషుల సంఖ్యలో సగం కావున పురుషులు = 2x, మహిళలు = x

'B' నగరంలో 10 మంది పురుషులు బస్సు దిగారు. కావున $2x - 10$

ఐదుగురు మహిళలు బస్సు ఎక్కారు కావున $x + 5$

ఇప్పుడు పురుషులు, మహిళలు సమానం కావున $2x - 10 = x + 5$

$2x - x = 5 + 10$. $x = 15$

'A' నగరంలో బస్సు బయలుదేరినప్పుడు పురుషులు $2x = 2 \times 15 = 30$. మహిళలు $x = 15$. మొత్తం ప్రయాణికులు $30 + 15 = 45$. ∴ సమాధానం 45.

**3. ఒక క్రికెట్ మ్యాచ్‌లో P, Q, R, S అనే నలుగురు క్రీడాకారుల సరాసరి పరుగుల సంఖ్య 30. S అనే వ్యక్తి P కంటే 6 పరుగులు ఎక్కువ చేశాడు. Q అనే వ్యక్తి S కంటే 12 పరుగులు ఎక్కువ చేశాడు. Q, R వీరిద్దరూ కలిసి చేసిన పరుగుల సంఖ్య 70. అయితే 'P' చేసిన పరుగులు ఎన్ని?**

ఎ) 20 బి) 22 సి) 28 డి) 40 **సమాధానం: (బి)**

**వివరణ:** P, Q, R, S నలుగురి సరాసరి పరుగుల సంఖ్య 30 కావున మొత్తం పరుగులు $30 \times 4 = 120$.

Q, R వీరిద్దరూ చేసిన పరుగులు 70 మొత్తం 120 నుంచి 70 తీసివేస్తే మిగిలిన 50 పరుగులు P, S చేయాలి. S అనే వ్యక్తి P కంటే 6 పరుగులు ఎక్కువ చేశాడు. S పరుగులు = P + 6. ఇప్పుడు 'S' స్థానంలో P + S = 50

$P + P + 6 = 50$

$2P + 6 + 50$

$2P = 50 - 6$

$2P = 44$

$P = 44/2 = 22$.

∴ సమాధానం 22 అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

---

అంగన్వాడీల

## ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటాం

● **సమ్మెపై ఎస్మా ప్రయోగం మూర్ఖత్వం: వివిధ పార్టీల నేతలు**

**ధర్నాచౌక్, జనవరి 7:** "అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగించడం మూర్ఖత్వం. సంక్రాంతిలోపు సమస్యలు పరిష్కరించాలి. లేదంటే అంగన్వాడీల పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటాం." అని రాష్ట్ర ప్రభుత్వాన్ని వివిధ పార్టీల నేతలు హెచ్చరించారు. ధర్నాచౌక్‌లో అంగాన్వాడీల రిలే నిరాహారదీక్షలు ఆదివారమూ కొనసాగాయి. వివిధ రాజకీయ పార్టీల నేతలు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల ఉద్యమానికి తమ పార్టీల సంపూర్ణ మద్దతును ప్రకటించారు. "26 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా తెలియనట్టు సీఎం జగన్ వ్యవహరించడం దౌర్భాగ్యం. జగన్ లాంటి మూర్ఖపు సీఎం రాష్ట్ర చరిత్రలో ఎవరూ లేరు." అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై సోమవారం రాజకీయ పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వం అడ్డంకులు సృష్టించినా పోరాటాన్ని కొనసాగిస్తున్న అంగన్వాడీలను కాంగ్రెస్ నాయకురాలు సుంకర పద్మశ్రీ అభినందించారు. అమ్‌ఆద్మీ పార్టీ నేత ఫణిరాజ్, ఎంఎల్ పార్టీ నేత జాస్తి కిషోర్‌బాబు, న్యూడెమోక్రసీ నేత మల్లికార్జునరావు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ, సీఐటీయూ నేతలు బాబూరావు, ధనలక్ష్మి, సుధాకర్, ఏఐటీయూసీ నేతలు రవీంద్రనాథ్, ఓబులేసు పాల్గొన్నారు.




ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

## 13వ రోజుకు మున్సిపల్ కార్మికుల నిరసన

● **నేడు కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా**

**ధర్నాచౌక్, జనవరి 7:** "రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. సమ్మె విరమించేలా చూడాలి.ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు ధర్నాచౌక్‌లో చేపట్టిన ధర్నా 13వ రోజు ఆది వారమూ కొనసాగింది. ఇంజనీరింగ్ కార్మికులకు 11వ పీఆర్సీ బేసిక్ వేతనాలు చెల్లించాలని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. రెండు పర్యాయాలు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో నిర్వహించిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయన్నారు. కార్మిక సంఘాలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని ఫెడరేషన్ నిర్ణయించిందన్నారు. అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు.



ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

## ఐటీఎఫ్ 35, 40 ప్లస్ విజేతలుగా చాంద్, బన్సాల్

**విజయవాడ స్పోర్ట్స్, జనవరి 7:** ఆంధ్రప్రదేశ్ లాన్‌టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ టెన్నిస్ కాంప్లెక్సులో నిర్వహిస్తున్న సీనియర్ మాస్టర్స్-200 ఐటీఎఫ్(ఎస్వీ రామయ్య మెమోరియల్ టెన్నిస్) టోర్నీలో ఆదివారం 35 ప్లస్ సింగిల్స్ ఫైనల్స్‌లో ప్రీతమ్‌దాస్‌పై 6-0, 6-0తో షేక్ చాంద్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. 40 ప్లస్‌లో అంజనీ బన్సాల్‌తో తలపడాల్సిన సురేష్ పులి దిండి వాకోవర్ ఇవ్వడంతో బన్సాల్‌ను విజేతగా ప్రకటించారు. 45 ప్లస్, 35 ప్లస్ డబుల్స్‌లో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పోటీల్లో పలు విభాగాలను శాప్ వీసీ ఎండీ ఎం.ధ్యాన్‌చంద్ర, ఏపీఎల్‌టీఏ ఉపాధ్యక్షుడు పట్టాభిరామయ్య సోమవారం ఐజీఎంసీలో ప్రారంభిస్తారని టోర్నీ డైరెక్టర్ సూతగాని రామకృష్ణ తెలిపారు.

రామవరప్పాడు వంతెన నుంచి రింగ్ వరకు..

## ఫీడర్ రోడ్డు వేయాలి


**గుణదల, జనవరి 7:** "రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో కాల్వకట్లపై నివాసాలు ఉండే 40 వేల మంది రామవరప్పాడు వంతెన వద్ద నుంచి జాతీయ రహదారిపైకి ఎక్కాలంటే సరైన మార్గం లేదు. కట్లపై నివాసాలు ఉండేవారంతా నగరంలోకి వెళ్లడానికి జాతీయరహదారిపై రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు ఎదురు వస్‌వేలో వెళ్లాల్సి వస్తోంది. అనేకమార్లు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇన్నర్ రింగ్ రోడ్డుపై నుంచి వచ్చే వాహనాలు జాతీయరహదారిపైకి వచ్చేందుకు వీలుగా ఏర్పాటు చేసిన రోడ్డు కాకుండా ఇంకా చాలా స్థలం ఖాళీగా ఉంది. ఆ స్థలంలో రామవరప్పాడు వంతెన సెంటర్ నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు రైవస్ కాల్వ వెంబడి ఫీడర్ రోడ్డు ఏర్పాటు చేయాలి." అని టీడీపీ విజయవాడ రూరల్ మండల మాజీ అధ్యక్షుడు కొల్లా ఆనంద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద ఫీడర్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ పార్టీలకు అతీతంగా గ్రామస్థులు ఆదివారం నిరసన తెలిపారు. ఆక్రమణలు వద్దు రహదారులు ముద్దు అంటూ నినాదాలు చేశారు. స్థానికులే కాకుండా రామవరప్పాడులో ఉన్న రైల్వేస్టేషన్‌కు వచ్చేవారు సరైన మార్గం లేక చాలా ఇబ్బంది పడుతున్నారని, ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ సమయంలో ఖాళీ చేయించిన స్థలాల్లో నేడు ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకునే వారే లేరని టీడీపీ రామవరప్పాడు గ్రామ అధ్యక్షుడు నబిగాని కొండ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ స్థలంలో కృష్ణుడి గుడి, కల్యాణమండపం అని ఒకరు, మరొకరు కార్మిక సంఘం కార్యాలయం, ఇంకొకరు అయ్యప్పస్వామి ఆలయం అని నిర్మాణాలు చేసుకుంటూ పోతే సమస్యకు పరిష్కారం దొరకదన్నారు. అనంతరం పటమట ఎస్ఐకు వినతి పత్రం సమర్పించారు. జనసేన, టీడీపీ నేతలు గూడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ, సర్నాల బాలాజీ, అద్దేపల్లి సాంబశివనాగరాజు, కొంగన రవి, పరుచూరి నరేష్, ఇజ్జి రామారావు, సుభాషిణి, ఇరుగ్రామాల ప్రజలు పాల్గొన్నారు.




రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్థులు

## టీడీపీ-జనసేన ఫ్లెక్సీల చించివేత

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 7:** ప్రశాంతంగా ఉండే బాపులపాడు మండలంలోని గ్రామాల్లో కొందరు కావాలనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని, సహించేదిలేదని టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు హెచ్చరించారు. కొత్తపల్లిలో టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు పర్యటనకు టీడీపీ-జనసేన పేరుతో స్వాగతం పలుకుతూ ఇరుపార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున చించేశారు. గ్రామాల్లో కవ్వింపు చర్యలు సరికాదని, ప్రశాంత గ్రామాల్లో రెచ్చగొట్టే చర్యలు దుష్పరిణామాలకు దారితీస్తాయని, బ్యానర్లను ధ్వంసం చేసినవారిని తక్షణం అరెస్ట్ చేయాలని దయాల రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. హనుమాన్‌జంక్షన్ ఎస్సై ఏడీఎల్ జనార్దన్, తిరుమలరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫ్లెక్సీలన్నీ తీసేయాలని, ఇకపై పెట్టాలంటే పంచాయతీ అనుమతి తీసుకోవాలని వారు సూచించారు. ఫ్లెక్సీలను చించేసిన వారిని అరెస్ట్ చేయాలని టీడీపీ, జనసేన గ్రామ నాయకులు వల్లూరిపల్లి నాని, అక్కినేని రవి, బొబ్బా మోహన్, పొట్లూరి సుధాకర్, గోకుల్, వడ్డి అశోక్, వరప్రసాద్, లక్ష్మణరావు, శేమ, సుదర్శన్, దావీదు నిరసన తెలిపారు.



బాపులపాడు మండలం కొత్తపల్లిలో చించేసిన ఫ్లెక్సీలు



రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న సర్పంచ్‌ల సంఘం నాయకులు

## సర్పంచ్‌ల డిమాండ్లు ఆమోదించాలి

● **లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: వైవీబీ రాజేంద్రప్రసాద్**

**ఉయ్యూరు, జనవరి 7:** గ్రామీణ ప్రజలకు న్యాయం చేయాలన్న సర్పంచ్‌ల 16 డిమాండ్లు ఆమోదించకపోతే రాజకీయాలు, పార్టీలకతీతంగా సర్పంచ్‌ల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. ఇటీవల మంగళగిరిలో పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు విజయవంతం కావడంపై సంఘం ఆధ్వర్యంలో ఉయ్యూరులోని వైవీబీ నివాసంలో ఆయనను సంఘం కమిటీ నాయకులు సత్కరించారు. సర్పంచ్‌ల సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి గల్లా తిమోతి, సంఘం నాయకులు కాగిత గోపాలరావు, మండలి ఉదయభాస్కర్, ముప్పనేని రవిప్రసాద్, పంచర్ల సురేశ్, వంపుగడల ఫ్రాన్సిస్‌లు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో

## విప్లవ రచయితల సంఘం మహాసభలు

**ధర్నాచౌక్, జనవరి 7:** విప్లవ రచయితల సంఘం 29వ మహాసభలు ఈనెల 27, 28 తేదీల్లో సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు కె.లక్ష్మీనరసయ్య తెలిపారు. మహాసభల సన్నాహక సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. ఫాసిస్టు సందర్భంలో రాజ్యాంగవాదం "హిందుత్వ ఫాసిజం-మందస్థాయి యుద్ధం" అనే అంశాలపై ఈ మహాసభల్లో చర్చిస్తామన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు ఉంటాయన్నారు. కేరళకు చెందిన ప్రముఖ జర్నలిస్టు సిద్ధిక్ కప్పన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అరసవిల్లి కృష్ణ, రివేరా, చినుకు రాజగోపాల్, వేంపల్లి షరీఫ్, సీఎస్ఆర్ ప్రసాద్, భరద్వాజ్, డానీ, మోహనరామ్ ప్రసాద్, బుడ్డిగ జమీందార్ పాల్గొన్నారు.

## సెంట్రల్ సీటు మల్లాది విష్ణుకే కేటాయించాలి

● **ఆర్యవైశ్య సంఘం డిమాండ్**

**సత్యనారాయణపురం, జనవరి 7:** వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సీటు ఎమ్మెల్యే మల్లాది విష్ణుకే కేటాయించాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు మైలవరం రాము, కొల్లూరు రామకృష్ణ, బొడ్డు శ్రీనులు సీఎం జగన్మోహన్‌రెడ్డిని కోరారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. విష్ణుకు సెంట్రల్ కేటాయిస్తే పూర్తి సహకారమందించి విష్ణును గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

దశాబ్దాల నుంచి

## కాపులకు సామాజిక అన్యాయం

● **రౌండ్ టేబుల్ సమావేశంలో కాపు జేఏసీ నేతలు**

**ధర్నాచౌక్, జనవరి 7:** దశాబ్దాల కాలం నంచి కాపులకు సామాజిక అన్యాయం జరుగుతూనే ఉందని కాపు జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు. రాష్ట్రాన్ని పాలించిన అన్ని పార్టీలు కాపులను నమ్మించి మోసం చేశాయని, కాపుల్లో ఉన్న అమాయకత్వం, భావోద్వేగాలు, ఆవేశాన్ని ఎన్నికల ముందు వాడుకుని ఎన్నికలు ముగిశాక కరివేపాకు మాదిరిగా వదిలేయడం ఆయా పార్టీలకు పరిపాటిగా మారిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాపులకు సామాజిక న్యాయం జరగడం ద్వారానే దళితులు, క్రైస్తవులు, ముస్లింలు, ఓసీలు, ఎంబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. జేఏసీ చైర్మన్ రావి శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్లు పెద్దిరెడ్డి మహేష్, బోడపాటి పెదబాబు, కో-కన్వీనర్లు కాకిలేటి హరనాథ్, పంచాది రంగారావు, నల్లజర్ల వెంకట రామారావు పాల్గొన్నారు.

జనాభా దామాషా ప్రకారం

## వచ్చే ఎన్నికల్లో కాపులకు సీట్లు కేటాయించాలి

● **కాపునాడు కన్వీనర్ గిద్దా శ్రీనివాసనాయుడు**

**ధర్నాచౌక్, జనవరి 7:** జనాభా దామాషా ప్రకారం కాపులకు రానున్న ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని కాపునాడు కన్వీనర్ గిద్దా శ్రీనివాస నాయుడు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఉమ్మడి విశాఖలో ఐదు అసెంబ్లీ, ఒక పార్లమెంట్, రాయలసీమలో ఒక పార్లమెంట్, నాలుగు జిల్లాల్లో నాలుగు అసెంబ్లీ, కృష్ణా, గుంటూరు జిల్లాలో జిల్లాకు ఐదు అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను కేటాయించాలన్నారు. కూటమిలో 60 అసెంబ్లీ, ఐదు పార్లమెంట్ స్థానాలు ఇస్తేనే కాపుల ఓట్లు బదిలీ అవుతాయని లేదంటే ప్రత్యామ్నాయ పార్టీ ఏర్పడుతుందన్నారు. కాపు నాయకుడు తాడివాక రమేష్, తాడి శకుంతల, పిల్లా శ్రీదేవి, సిరిసాగ మంగతాయారు, రావి శ్రీనివాస్, కూనపురెడ్డి రమేష్ పాల్గొన్నారు.

## హాకీ రాష్ట్ర పోటీలకు ఎన్టీఆర్ జిల్లా జట్టు ఎంపిక

**విజయవాడ స్పోర్ట్స్, జనవరి 7:** నగరంలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఎన్టీఆర్ జిల్లా జూనియర్ బాలుర హాకీ ఎంపికలు ఆదివారం నిర్వహించారు. 18 మంది సభ్యులతో కూడిన టీమ్‌ను ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కె.రాజశేఖర్ తెలిపారు. టీమ్‌ను ఈనెల 9 నుంచి 12 వరకు తిరుపతిలో నిర్వహించే 14వ రాష్ట్రస్థాయి హాకీ చాంపియన్‌షిప్‌కు పంపుతున్నామన్నారు.

**జట్టు ఇదే..** టి.చిరంజీవి, నీలమ్ చరణ్‌తేజ, గుండుమళ్ల తనిష్క్, యామాని సూర్య పి.చరణ్, మానేపల్లి ఆదిత్య ఈశ్వర్, బైరి దుర్గాప్రసాద్, గిడుతూరి జోల పవన్, మహంతి హరివినయ్, కొండపల్లి మహేష్‌కుమార్, రావాడ దినేష్ సాయిరామ్, తమ్మిశెట్టి సాయికోటేశ్వరావు, షేక్ యాసిన్, తాతపూడి సునీల్‌కుమార్, షేక్ మున్నా, వరదా సందేశ్, షేక్ ఇర్ఫాన్, మొహ్మద్ అమిన్.

## అన్ని అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి

● **ఏఐవైఎఫ్ డిమాండ్**

**ధర్నాచౌక్, జనవరి 7:** రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపక ఉద్యోగాల పోస్టుల్లో రాష్ట్రవ్యాప్తంగా కేవలం జూనియర్ లెక్చరర్లు 47, డిగ్రీ 240, పాలిటెక్నిక్ 21 ఖాళీల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమని అన్ని ఖాళీలను భర్తీ చేయాల్సిందేనని అఖిల భారత యువ జన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, అధ్యాపక ఉద్యోగ సాధన సమితి కన్వీనర్ ద్రవిడ సురేష్ డిమాండ్ చేశారు. దాసరి భవన్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులు ఉన్నప్పటికీ అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉందని ఏటా తాత్కాలికంగా అతిథి అధ్యాపకులను నియమించుకుంటున్నారన్నారు. ప్రభుత్వం గతంలో చెప్పినట్టు 2500 పైచిలుకు ఖాళీలు భర్తీ చేయాలని లేదంటే ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. లంకా గోవిందరాజులు, లంకె సాయికుమార్, ఉప్పుటూరి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.


పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ముగ్గులు వేస్తున్న మగువలు

# రంగుల వల్లికలు

- రంగులమయమైన పీబీ సిద్ధార్థ కాలేజీ మైదానం
- మొదటి ముగ్గురు విజేతలకు బహుమతుల ప్రదానం
- విజేతలకు కేశినేని ఫౌండేషన్ ద్వారా బహుమతులు
- పదిమందికి కన్సొలేషన్

## ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలకు విశేష స్పందన

'ముగ్గు'రు విజేతలు


కలెక్టర్ దిల్లీరావు నుంచి బహుమతులు అందుకుంటున్న ప్రథమ బహుమతి విజేత బి.ఉమాదేవి (వడ్లమూడి), ద్వితీయ బహుమతి విజేత మచ్చా మాధవి (అయోధ్యనగర్), తృతీయ బహుమతి విజేత టి.జ్యోతి (నందిగామ)

ఆకాశంలో హరివిల్లులు క్యూ కట్టినట్టు... ఇంద్రధనస్సులోని రంగులన్నీ ఇలపై ఒలికినట్టు.. అప్పటివరకు ఖాళీగా కనిపించిన ప్రాంగణాల్లో కమనీయ దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తరుణులు తోటమాలులై నిమిషాల వ్యవధిలో గుబాళించే రంగుల పూదోటను సృష్టించారు. రంగుల వైభవాన్ని అంగరంగ వైభవంగా కళ్లకు కట్టారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు, పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన, లోకల్ పార్టనర్ కేశినేని ఫౌండేషన్" ఆధ్వర్యంలో నగరంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీలో ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు ఈ పోటీలకు హాజరు కాగా, ముచ్చటగా తీర్చిదిద్దిన మొదటి ముగ్గురు మగువలు కలెక్టర్ దిల్లీరావు చేతులమీదుగా నగదు బహుమతులు అందుకున్నారు. 10 మందికి కన్సొలేషన్ బహుమతులు లభించాయి.

- 6లో..

# వెల్లువలా కదిలారు

## రా.. కదలిరా సభతో జనహోరైన తిరువూరు

తిరువూరు తిరునాళ్లను తలపించింది. టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'రా కదలిరా..' కార్యక్రమంతో జనహోరై మార్మోగింది. పసుపు జెండాల రెపరెపలతో పసిడి కాంతులను పులుముకుంది. ఏపీ నుంచే కాకుండా సరిహద్దున ఉన్న తెలంగాణ నుంచీ గ్రామాలకు గ్రామాలు కదలిరాగా, అధినేత చంద్రబాబు ఉత్తేజపూరిత ప్రసంగం కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నాయకుల అవినీతిని ప్రశ్నిస్తూ, తిరువూరుకు వరాల జల్లు కురిపిస్తూ చంద్రబాబు చేసిన ప్రసంగంతో సభా ప్రాంగణంలోని కార్యకర్తలంతా చిందులేశారు.


తిరువూరు సభకు అశేషంగా హాజరైన జనాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

- ఏపీ నుంచే కాకుండా తెలంగాణ నుంచీ రాక
- కదిలివచ్చిన గ్రామాలకు గ్రామాలు
- ఉత్సాహాన్ని నింపిన చంద్రబాబు ప్రసంగం
- స్టేజీ కింద కార్యకర్తల డ్యాన్సులు
- పులకించిపోయి విజయ చిహ్నాన్ని చూపిన బాబు
- తిరువూరు ప్రాంతానికి వరాల జల్లు
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, 'చింతలపూడి', కట్టలేరుకు హామీ
- అధికార పార్టీ నేతల అవినీతిపై ఆగ్రహం

**విజయవాడ, ఆంధ్రజ్యోతి/తిరువూరు :** తిరువూరులో ఆదివారం టీడీపీ నిర్వహించిన 'రా కదలిరా' సభ నేతలు, కార్యకర్తల్లో జోష్‌ను నింపింది. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఖమ్మం జిల్లాలోని గ్రామాల నుంచి కార్యకర్తలూ తరలారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు చంద్రబాబు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో తిరువూరులోని సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. అప్పటికే సభా వేదిక ముందున్న కుర్చీలన్నీ నిండిపోయాయి. ప్రాంగణం నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న ప్రాంతమంతా కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. సుమారు 35 వేల నుంచి 40 వేల మంది వరకు సభకు వచ్చి ఉంటారని అంచనా. ముఖ్యంగా తిరువూరుతో పాటు నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు భారీగా వచ్చారు. కార్యకర్తల్లో కనిపించిన ఉత్సాహాన్ని చూసి చంద్రబాబు పులకించిపోయారు. చంద్రబాబు అన్న ప్రతిమాటకు కార్యకర్తలు సై.. సై.. అంటూ నినాదాలు ఇచ్చారు. సభ ముగిసిన తర్వాత సైకో పోవాలి.. సైకిల్ రావాలి.. పాటను ప్లే చేయగా, కార్యకర్తలు డ్యాన్సులు చేశారు. వారి ఆనందాన్ని చూసిన చంద్రబాబు విక్టరీ సంకేతాన్ని చూపుతూ చిరునవ్వులు చిందించారు.

### అధికార పార్టీ నేతలపై ఆగ్రహం

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ ఎమ్మెల్యే

- మిగతా 6లో

తిరువూరులో ప్రతి ప్రాంతాన్నీ సస్యశ్యామలం చేస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అధికారంలోకి రాగానే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రూ.4,900 కోట్లతో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం పూర్తయితే తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలకు సాగునీరు అందించవచ్చన్నారు. అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని పూర్తిచేయాలని సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ.. చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ముక్త్యాల ఎత్తిపోతల

### వరాల జల్లు

పథకానికి వైఎస్సార్ ఎత్తిపోతల పథకంగా పేరు మార్చారన్నారు. రూ.4,100 కోట్లతో నిర్మించే ఈ పథకానికి ఇప్పటి వరకు కనీసం రూ.100 కూడా జగన్ ఖర్చు చేయలేదన్నారు. పిట్టలవారిగూడెంలో ఉన్న ఎత్తిపోతల పథకాన్ని రూ.6,900 కోట్లతో పూర్తి చేస్తామన్నారు. తిరువూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. గంపలగూడెం మరో ఉద్దానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గంపలగూడెం, ఎ.కొండూరులో ఉన్న ఫ్లోరైడ్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కట్టలేరు వాగుపై వినగడప వద్ద రూ.29 కోట్లతో వారధిని నిర్మిస్తామన్నారు. దీనికి జగన్ హామీ ఇచ్చినా ఒక్క పని మొదలుపెట్టలేదని విమర్శించారు.

# ముగిసిన భవానీ దీక్షల విరమణ

## ఘనంగా పూర్ణాహుతి

- శనివారం రాత్రి వరకూ 3.50 లక్షల మంది భక్తుల రాక
- 15 లక్షల లడ్డూ ప్రసాదాల విక్రయం


పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో, ఛైర్మన్

**వన్‌టౌన్, జనవరి 7 :** ఇంద్రకీలాద్రిపై ఈనెల 3న ప్రారంభమైన భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. శనివారం రాత్రి వరకు 3.50 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రికార్డు స్థాయిలో 15 లక్షల లడ్డూ ప్రసాదాలను భక్తులు కొనుగోలు చేశారు. ఆదివారం ప్రముఖ ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావు దంపతులు దుర్గమ్మను దర్శించుకున్నారు.

### ఘనంగా పూర్ణాహుతి

ఐదు రోజుల పాటు దీక్షగా సాగిన శతచండీయాగానికి ఆదివారం పూర్ణాహుతితో ముగింపు పలికారు. లోకక్షేమం, శాంతిని కాంక్షిస్తూ ఈ యాగం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఈవో రామారావు, ట్రస్టుబోర్డు ఛైర్మన్ రాంబాబు దంపతులు, అర్చకులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో రామరావు మాట్లాడుతూ దేవదాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, జిల్లా యంత్రాంగం, పోలీసులు, దేవస్థానం సిబ్బంది అందరూ ఈ కార్యక్రమాల విజయానికి కృషి చేశారన్నారు. అందరికీ ధన్యవాదాలు తెలిపారు.





## అలుపెరగని అంగన్వాడీలు

తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు అలుపెరగక పోరాడుతూనే ఉన్నారు. ఎస్మాకు భయపడేది లేదంటూ ముందుకు కదులుతున్నారు. ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నారు. జగ్గయ్యపేటలో 'ఎస్మాను రద్దు చేయాలి..' అనే అక్షరాకృతిలో మానవహారం నిర్మించిన అంగన్వాడీలు (పైఫొటో), విజయవాడ ధర్నాచౌక్‌లో ప్లకార్డులతో నిరసన (కింద ఫొటో)



# పిల్లల బాధ్యత పెద్దలదే

- 6లో..

కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి

## ముగిసిన 34వ విజయవాడ పుస్తక మహోత్సవం

## పిడికిలి బిగించిన మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమ్మె రోజురోజుకూ ఉధృతమవుతోంది. తమ డిమాండ్ల సాధనకు విధులను బహిష్కరించి ధర్నాచౌక్‌లో దీక్ష చేపట్టిన కార్మికులకు పలు రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం తెలుపుతున్నారు. ఇందులో భాగంగానే సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆదివారం దీక్షాధారులకు సంఘీభావం తెలిపి కొద్దిసేపు దీక్షలో కూర్చున్నారు.



# రేపటి నుంచి కళాశాలలకు ఔటింగ్

భారీగా స్పెషల్ ఆపరేషన్‌కు ఆర్టీసీ సన్నాహాలు

- 6లో..



విజయవాడ పీబీ సిద్దార్థ ఆర్ట్స్ కాలేజీలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలో రంగవల్లులు దిద్దుతున్న మహిళలు



ప్రథమ బహుమతి పొందిన ముగ్గు



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు



తృతీయ బహుమతి పొందిన ముగ్గు



కన్సొలేషన్ బహుమతులు అందజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

### పదేళ్లుగా పోటీల్లో పాల్గొంటున్నా..

**- డి.ఉమాదేవి, ప్రథమ బహుమతి విజేత**

పదేళ్లుగా 'ఆంధ్రజ్యోతి-ముత్యాల ముగ్గులు' పోటీల్లో పాల్గొంటున్నా. సృజనాత్మకంగా వేస్తేనే విజయం వరిస్తుంది. అందుకే ఈసారి ఎంతో కష్టపడి సంక్రాంతిని ప్రతిబింబించేలా అనుకున్నట్టుగా వేయగలిగాను. మొదటి స్థానం సాధించటం ఆనందంగా ఉంది.

### కష్టమైనా.. విజయం వరించింది

**- మచ్చా మాధవి, ద్వితీయ బహుమతి విజేత**

2017లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించా. ఈసారి ధనుర్మాసంలో తెలుగు ప్రజలకు అత్యంత పెద్ద పండుగ సంక్రాంతిని ప్రతిబింబించేలా కష్టమైన చుక్కల ముగ్గు వేశా. ద్వితీయ స్థానం సాధించటం ఆనందంగా ఉంది. ప్రతీఏడాది ముగ్గుల పోటీల్లో పాల్గొంటాను.

### ఆనందంగా ఉంది

**- తోటకూర జ్యోతి, తృతీయ బహుమతి విజేత**

ముత్యాల ముగ్గుల పోటీలలో ప్రతీ ఏడాది పాల్గొంటాను. సంక్రాంతి శోభను ఇనుమడించేలా ముగ్గును వేశాను. తృతీయ స్థానం దక్కటం ఆనందంగా ఉంది.

# రంగులవల్లికలు

**ఎన్టీఆర్‌జిల్లా విజేతలు వీరే..**

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా నుంచి బి.ఉమాదేవి (వడ్లమూడి) ప్రథమ, మచ్చా మాధవి(అయోధ్యనగర్) ద్వితీయ, టి.జ్యోతి (నందిగామ) తృతీయ స్థానాలు సాధించారు. కేశినేని ఫౌండేషన్ తరపున రూ.6000, రూ.4000, రూ.3000 నగదు బహుమతులను కలెక్టర్ ఢిల్లీరావు విజేతలకు అందజేశారు. అలాగే 10 మందికి కన్సొలేషన్ బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు చిరుకానుకగా చీరలను అందజేశారు. ముగ్గుల పోటీలకు ప్రధాన స్పాన్సర్‌గా కేశినేని ఫౌండేషన్ తరపున కేశినేని శివనాథ్ (చిన్ని) సహకారాన్ని అందించారు.

- ధనుర్మాస ప్రాశస్త్యం తెలియజెప్పారు : కలెక్టర్ ఢిల్లీరావు
- ఘనంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు ఎంపిక
- పదిమందికి కన్సొలేషన్ బహుమతులు



**(ఆంధ్రజ్యోతి, విజయవాడ /భవానీపురం) :** రంగ వల్లులు విజ్ఞాన జల్లులని.. వీటి వెనుక సైన్స్ దాగి ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ధనుర్మాస ప్రత్యేకత, సంక్రాంతి పర్వదిన విశేషాలను రంగవల్లులు ఆవిష్కరిస్తాయని తెలిపారు. ఆదివారం విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నేతృత్వంలో ముత్యాల ముగ్గుల పోటీలు-2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఢిల్లీరావు మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముగ్గులు వేయటం ఒక కళ అని, ముగ్గు వెనుక సైన్స్ దాగి ఉందని చెప్పారు. సంక్రాంతి విశిష్టతను ముందు నుంచే తెలియచెప్పటంలో రంగవల్లుల పాత్ర ఎనలేనిదన్నారు. తొలితరం రోజుల్లో అడవులను నరికి ఇళ్లు నిర్మించుకునే క్రమంలో పేడతో అలికి.. ముగ్గులు వేయటం ఆనవాయితీగా ఉండేదని.. తదనంతరం ముగ్గు మన సంస్కృతిలో భాగమైందన్నారు. ముగ్గుల వెనుక శాస్త్రీయత దాగి ఉందన్నారు. పూర్వం సూక్ష్మక్రిములు ఇళ్లలోకి చేరకుండా ఉండేందుకు పేడతో అలికి, ముగ్గులు పెట్టేవారన్నారు. ముగ్గులు కళాత్మకతతో ఎన్నో అంశాలను వివరిస్తాయని కలెక్టర్ చెప్పారు. తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలలో భాగమైన ముగ్గులకు ప్రాచుర్యం కల్పించేలా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' గత 15 సంవత్సరాలుగా పోటీలు నిర్వహించటం మంచి విషయమన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఇలాంటి ముగ్గుల పోటీలను మరిన్ని నిర్వహించాలన్నారు. ఏ చదువు లేని వారు కూడా గొప్పగా థీమ్‌లను ప్రదర్శించటం గొప్ప విషయమన్నారు. న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి మాట్లాడుతూ, ఆడవాళ్లకే సాధ్యమైన ఈ కళ వారి భావాలను ముగ్గుల ద్వారా ప్రదర్శించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారి సీతామహలక్ష్మి (మహిత), ఆంధ్రజ్యోతి విజయవాడ యూనిట్ బ్రాంచి మేనేజర్ వి.మురళీ, ఎడిషన్ ఇన్‌చార్జి ఎ.ఉమామహేశ్వరరావు, బ్యూరో ఇన్‌చార్జి పి.మృత్యుంజయకుమార్, కనకదుర్గా ఫైనాన్స్ ఎండీ సందిరెడ్డి లక్ష్మీనారాయణ, ఏపీ స్టేట్ బ్యూరో చీఫ్ మాధవ్, ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## చివరిశ్వాస వరకు నియోజకవర్గానికి కాపు కాస్తా

**ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)**



నీటి ట్యాంకర్లను అందజేస్తున్న నాని

**వన్‌టౌన్, జనవరి 7 :** విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి చివరి శ్వాస వరకు కాపుకాస్తా అని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. కేశినేని భవన్‌లో ఆదివారం రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాలలోని 19 గ్రామాలకు తన ఎంపీ నిధులనుంచి ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఒక ప్రజాప్రతినిధిగా పనిచేసుకుంటూ వెళ్లడమే తన లక్ష్యమన్నారు. విజయవాడ ప్రజలు తనకు అందించిన సహకారాన్ని మరువలేనని, చివరికంటా కాపుకాస్తానని పేర్కొన్నారు.

**కార్యాలయంపై టీడీపీ జెండాల తొలగింపు**

ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) విజయవాడలోని తన కార్యాలయం కేశినేని భవన్‌పై టీడీపీ జెండాలను తొలగించారు. తిరువూరు సభ ఏర్పాట్లలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆయన తన ఎంపీ పదవికి, టీడీపీకి కూడా రాజీనామా చేయనున్నట్టు ప్రకటించారు. శనివారం సాయంత్రమే కార్యాలయంపై టీడీపీ జెండాలను తొలగించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, తిరువూరు సభకు తాను వెళ్లక పోయినా ఎంపీగా ప్రొటోకాల్ ఇచ్చామని చెప్పుకోవడం కోసం వేదికపై సీటు ఏర్పాటు చేసి ఉంటారన్నారు. అదే విధంగా బ్యానర్లూ కట్టి ఉంటారని ముక్తాయించారు. గతంలో ప్రొటోకాల్ పాటించలేదని, ఇప్పుడు ఆ పొరపాటును సరిదిద్దుకోవడానికి అలాచేసి ఉంటారన్నారు, అయినా తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని చెప్పిన తరువాత ఇంక వాళ్లు అనుసరించాల్సింది ఏముంటుందన్నారు. సాంకేతికంగా కొంత ఆలస్యం తప్ప తాను రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కార్యాలయంపై జెండాలను ఇప్పటికే తీసివేశానని, బోర్డులను తీయాల్సి ఉందని తెలిపారు.

## పసుపు సంద్రంగా తిరువూరు



చంద్రబాబు బహిరంగ సభకు భారీగా హాజరైన మహిళలు

**తిరువూరు, జనవరి 7 :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 'రా కదలిరా' సభకు వేలాదిగా ప్రజలు పసుపు జెండాలతో తరలిరావడంతో పట్టణం పసుపు సంద్రంగా మారింది. అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో 20 ఎకరాల్లోని సభ ప్రాంగణంతో పాటుగా, విజయవాడ-జగదల్‌పూర్ ప్రధాన రహదారి ఆదివారం పసుపు సైన్యంతో కిటకిటలాడింది. నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన అభిమానులు, పార్టీ శ్రేణులు ఉదయమే సభప్రాంగణానికి చేరుకున్నారు. సభలో పాల్గొనేందుకు దివ్యాంగులు, మహిళలు పసి పిల్లలతో రాగా సమీపంలోని భవనాలపైకి చేరి తమ నాయకుడ్ని చూసేందుకు ఉత్సాహం చూపారు. ఉదయం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ప్రసంగం కొనసాగుతున్నంత సేపూ జనం తండోపతండాలుగా తరలివస్తుండటం గమనార్హం. చంద్రన్నకు జై, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు జై అంటు నినాదాలతో హోరెత్తించారు.

**బెజవాడను గంజాయి కేంద్రంగా మార్చారు**

**- బొండా ఉమామహేశ్వరరావు**

రాజకీయ రాజధాని బెడవాడను వైసీపీ పాలకులు గంజాయి కేంద్రంగా మార్చారని, విజయవాడ అభివృద్ధి పూర్తిగా విస్మరించారని విజయవాడ సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే, పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ రాష్ట్రం కోసం అప్పులు తెస్తున్నామని ఆ నిధుల్ని తన సొంత ఖజానకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, సాగుకు ప్రాణాధారమైన సాగునీటి ప్రాజెక్టులను సైకో జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. అవినీతీ సొమ్మును విదేశాలకు కంటైనర్లద్వారా తరలిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతిన మహేష్, మనుబోలు శ్రీనివాసరావులు మాట్లాడుతూ, టీడీపీ జనసేన పొత్తు ప్రజాసంక్షేమం కోసమే అన్నారు. రాష్ట్రంలో అవినీతి పాలనను సాగనంపేందుకు జనసేన, టీడీపీ పొత్తుతో తాడేపల్లి ప్యాలెస్ వణికిపోతోందన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర భవితవ్యం కోసం టీడీపీ, జనసైనికులు సంఘటితంగా కృషి చేయాలని కోరారు. సభలో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, కేశినేని చిన్ని, బుద్ద వెంకన్న, ఎమ్మెల్యే గద్దె రాంమోహన్‌రావు, సాయిగౌడ్, పట్టాభి, వర్ల రామయ్య, కొలికపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొ

## వెల్లువలా కదిలారు

(5వ పేజీ తరువాయి)

మల్లాది విష్ణు, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు సోదరులు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానుపై చంద్రబాబు నిప్పులు చెరిగారు. వాళ్లందరితో జగన్ తప్పులు చేయించారని ఆరోపించారు. వెలంపల్లిని కొబ్బరిచిప్పల మంత్రిగా అభివర్ణించారు. దేవదాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు దేవుడి ఆస్తులను హారతి కర్పూరంలా కరిగించేశాడని దుయ్యబట్టారు. పశ్చిమలో వేస్ట్‌గా ఉన్న వెలంపల్లి సెంట్రల్‌లో బెస్ట్ అయ్యాడా అని ప్రశ్నించారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కనిపించిన ఆస్తిని కొనేసే స్థాయికి వచ్చాడని విమర్శించారు. సెంట్రల్‌లో వేస్ట్ అని తేల్చడంతో మల్లాది చిరునామా లేకుండా పోయాడన్నారు. నందిగామ ఎమ్మెల్యే జగన్మోహనరావు ఓ దొంగ అని విమర్శించారు. ప్రతిదానికీ అన్నదమ్ములు జగన్మోహనరావు, అరుణకుమార్ మొండిపట్టు పడతారన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను కుమారుడు డ్రగ్స్ కేసులో ఉన్నాడని ఆరోపించారు.

### సభకు ఎంఎస్ బేగ్ హాజరు

పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఎంఎస్ బేగ్ సభకు హాజరయ్యారు. బేగ్, ఎంపీ కేశినేని నాని వర్గీయుడిగా ఉన్నారు. పలు సందర్భాల్లో పశ్చిమ నుంచి టీడీపీ అభ్యర్థిగా బేగ్ పోటీ చేస్తారని, ఎంపీగా తాను పోటీ చేస్తానని నాని ప్రకటించారు. కొద్దిరోజులుగా జరిగిన పరిణామాలతో నాని సభకు దూరంగా ఉన్నా బేగ్ మాత్రం హాజరవడం గమనార్హం. సభలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు జలీల్‌ఖాన్, శ్రీరాం తాతయ్య, తంగిరాల సౌమ్య, బొండా ఉమామహేశ్వరరావు, మచిలీపట్నం జిల్లా కమిటీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, గుడివాడ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, టీడీపీ నాయకులు కేశినేని చిన్ని, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు, కొల్లు రవీంద్ర, బుద్ధా వెంకన్న, నాగుల్‌మీరా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, జనసేన కృష్ణాఅధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ నాని, మాజీ ఎమ్మెల్యే దూరం

తిరువూరు సభకు విజయవాడ ఎంపీ కేశినేని నాని, తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు హాజరుకాలేదు. సభ కోసం సిద్ధం చేసిన వేదికపై ఎంపీ కేశినేని నానికి కుర్చీని వేశారు. దానిపై ఆయన పేరుతో స్టిక్కర్ అతికించారు. చంద్రబాబు కుర్చీ పక్కనే తిరువూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి శావల దేవదత్, ఆయన పక్కన ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఆయన పక్కన ఎంపీ కేశినేని నానికి సీటు కేటాయించారు. ఆయన రాకపోవడంతో ఆ కుర్చీల్లో మరొకరు కూర్చున్నారు. నాని వర్గంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. సభా ప్రాంగణానికి ఉన్న రహదారులకు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కొన్నింటిపై నాని ఫొటోలను ప్రచురించారు.

### దేవినేని ఉమాకు వసంత నోటీసు

**మైలవరం:** పరువుకు భగం కలిగించే విధంగా తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని మాజీమంత్రి దేవినేని ఉమాకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పరువు నష్టం దావా వేస్తూ ఆదివారం లీగల్ నోటీస్ పంపారు. పరువు నష్టం కింద రూ.10 కోట్లు పరిహారం చెల్లించాలని నోటీస్ పంపారు. 2023 నవంబరులో జరిగిన ప్రెస్‌మీట్‌లో దేవినేని ఉమా తనపై చేసిన ఆరోపణలుపై వసంత ఈ నోటీస్ పంపారు. ఇబ్రహీంపట్నం థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వచ్చిన బూడిద అమ్ముకుంటున్నామని చేసిన ఆరోపణలు నిరూపించాలని నోటీస్‌లో న్యాయవాది కోరారు. ఆరోపణలు నిరూపించకపోతే క్రిమినల్‌డ్యామేజెస్ ఫైల్‌చేస్తామని వసంత పేర్కొన్నారు.

## పిల్లల బాధ్యత పెద్దలదే

**పుస్తక మహోత్సవం ముగింపు సభలో**

**కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి**

**ఇవాళ ప్రపంచంలో మొబైల్ వ్యాధిగ్రస్తులు కాకుండా పిల్లలను కాపాడుకునేందుకు పుస్తకాలను పరిచయం చేయాలి.. ఆ బాధ్యత పెద్దలే తీసుకోవాలి.. పుస్తకాలతో స్నేహం దీర్ఘకాలిక ఆనందాన్నిచ్చే శాశ్వత బంధం ఉంటుందని, చదువు పట్ల ఆసక్తి కలిగించేందుకు జీవిత చరిత్రలు చదవడం ఉపకరిస్తుందని చెప్పాలి**





**విజయవాడ కల్చరల్, జనవరి 7 :** చూడటం నుంచి చదవడం వైపునకు పిల్లలను మళ్లించాల్సిన బాధ్యత పెద్దలకు వుందని కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ఆదివారం 34వ విజయవాడ పుస్తక మహోత్సవం ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మన పూర్వీకులు మనకు అపారమైన సాహిత్యనిధి ఇచ్చి వెళ్లారన్నారు. అక్షరం అంటే నాశనం లేనిది అని గుర్తు చేశారు. పుస్తకం ఒక పేజీ తీస్తే ప్రపంచానికి ఒక కొత్త కిటికీ తీసినట్టేనన్నారు. కొత్త తరానికి పుస్తకాలను, సాహిత్య విలువలను పరిచయం చేయడంలో పుస్తక మహోత్సవం పోషిస్తోన్న పాత్ర ఆనందదాయకమన్నారు. ఇవాళ ప్రపంచంలో మొబైల్ వ్యాధిగ్రస్తులు కాకుండా పిల్లలను కాపాడుకొనేందుకు పుస్తకాలను పరిచయం చేయాలన్నారు. పుస్తకాలతో స్నేహం దీర్ఘకాలిక ఆనందాన్నిచ్చే శాశ్వత బంధం అన్నారు. చదువు పట్ల ఆసక్తి కలిగించేందుకు జీవిత చరిత్రలు చదవడం ఉపకరిస్తుందన్నారు. 'అనుభవాలు-జ్ఞాపకాలు', 'నా జీవనయానం', 'హంపీ నుంచి హరప్పాదాకా' పుస్తకాలు చదవడం ద్వారా తెలుగునేల మూడు ప్రధాన భాగాల సాంస్కృతిక వైభవాన్ని తెలుసుకోవచ్చన్నారు. సాహిత్యం వ్యక్తులకు రసస్ఫూర్తినిచ్చే రోజుల నుంచి సామాన్యుల కష్టాలను ప్రతిఫలించే రోజులకు మారిందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ మాట్లాడుతూ, పుస్తక ప్రచురణకు ప్రసిద్ధి చెందిన విజయవాడలో పుస్తక మహోత్సవం ఇంత ఘనంగా విజయవంతం కావడం సహజమే అయినా, ఈ రోజుల్లో ఇంతమంది పుస్తకాలు చదివేవాళ్లుండటం ఆనందదాయకమన్నారు. పుస్తకాలను జీవితంలో భాగం చేసుకొని శుభప్రదం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పుస్తక మహోత్సవంలో విరివిగా పాల్గొనడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. సంఘానికి అభినందనలు తెలిపారు. ఎమెస్కో విజయ కుమార్ స్వాగతం పలికి సభను నిర్వహించారు. అధికారులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు మనోహర్ నాయుడు ప్రజలకు, పుస్తక ప్రియులకు ధన్యావాదాలు తెలిపారు. ప్రతిభా వేదికపై వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. పుస్తక మహోత్సవ సంఘం గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ, గోళ్ల నారాయణరావు సభలో పాల్గొన్నారు. కార్యదర్శి కె.లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు.



చలసాని వసుమతి జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేస్తున్న వసుమతి తదితరులు

## చలసాని వసుమతి జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

**విజయవాడ కల్చరల్, జనవరి 7 :** ప్రసిద్ధ రచయిత్రి ఇంద్రగంటి జానకిబాల, ప్రసిద్ధ కథారచయిత ఎల్.ఆర్.స్వామిలు చలసాని వసుమతి జీవన సాఫల్య పురస్కారాలను అందుకున్నారు. రచయిత్రి వసుమతి స్వయంగా ప్రదానం చేశారు. ప్రముఖ సినీదర్శకులు శ్రీ ఇంద్రగంటి మోహనకృష్ణ, తన తల్లికి జీవనసాఫల్య పురస్కారం అందిస్తోన్న సభలో ఆమె పక్కనే కూర్చోవడం గొప్ప అనుభూతినిస్తోందన్నారు. విజయవాడలో తన బాల్య స్మృతులను ఆయన గుర్తు చేసుకున్నారు. రచయిత్రిగా తన ఎదుగుదల అంతా విజయవాడలోనే జరిగిందని, తానెంతో రుణపడి వున్నానని జానకిబాల అన్నారు. తెలుగు, మళయాళ సమాజాలలో భాషాపరమైన వైరుధ్యాల కారణంగా ఎదురయ్యే అనువాద సమస్యల గురించి వివరించారు. సభకు శ్రీ గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ జీవీ పూర్ణచందు సభను నిర్వహించారు. శ్రీ చలసాని రవి దంపతులు సన్మానాలు చేశారు.


## రేపటి నుంచి కళాశాలలకు ఔటింగ్

**భారీగా స్పెషల్ ఆపరేషన్‌కు ఆర్టీసీ సన్నాహాలు**

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఈ నెల 9వ తేదీ నుంచి కళాశాలలకు ఔటింగ్ ఇవ్వనుండటంతో ఆర్టీసీ అధికారులు భారీగా స్పెషల్ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టబోతున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి కళాశాల విద్యార్థుల కోసం ఈ నెల 9, 10 , 11 తేదీలలో 50 ప్రత్యేక బస్సుల చొప్పున నడపాలని నిర్ణయించారు. సంక్రాంతి ప్రయాణాలను ఎన్ 'క్యాష్' చేసుకునేందుకు రాయలసీమ జిల్లాలకు ఎక్కువుగా నడపాలని నిర్ణయించారు. రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు విజయవాడ పరిసర ప్రాంతాలలోని కళాశాలలో చదువుకుంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు రాయలసీమ జిల్లాలకు ప్రత్యేకంగా బస్సులు నడపాలని నిర్ణయించారు.

## పుస్తక పఠనంతో ఆలోచనా జ్ఞానం

**ఏపీ మైనార్టీ వెల్ఫేర్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్**



**విజయవాడ కల్చరల్, జనవరి 7 :** పుస్తకాలు జ్ఞానాన్ని పంచే స్నేహితులని, పుస్తక పఠనం వల్ల మనిషిలో ఆలోచన దృక్పథాన్ని మారుస్తాయని, వినయం, సత్‌ప్రవర్తన, విధేయత వంటి మంచి లక్షణాలను పెంపొందించుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. చదువరిలో ఆలోచన శైలి గొప్ప మార్పు చెంది ఉన్నత లక్ష్యాలను అందుకోగలిగిన స్థాయి ఏర్పడుతుందన్నారు. తాను ఐఏఎస్ కావటానికి పుస్తక పఠనమే కారణమన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవాలను పురస్కరించుకొని పుస్తకాలతో ఆయనకున్న అనుబంధాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

- హైస్కూల్ నుంచి పుస్తకాలు చదవడం మొదలుపెట్టా. కోడుమూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదివేరోజుల్లో వేసవి సెలవుల్లో పుస్తకాలు చదవడం ప్రారంభించా. యద్దనపూడి సులోచనారాణి, మాదిరెడ్డి లాంటి రచయితల నవలలు, కొమ్మూరి సాంబశివరావు అపరాధ పరిశోధన, డిటెక్టివ్ స్టోరీస్ చదవడం వల్ల అనేక కొత్త విషయాలు తెలిసేవి. తర్వాత తరగతి పుస్తకాలతో పాటు పత్రికలు చదవడం మొదలుపెట్టాను.
- రీజనల్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదివేటప్పుడు ఆంగ్ల సాహిత్యాన్ని పరిచయం చేశారు. కాలేజీ లైబ్రరీ పుస్తకాలతో పాటు అరువు తెచ్చుకొని ఆంగ్ల సాహిత్యంలో ఫిక్షన్ నాన్ ఫిక్షన్ స్టోరీస్, రాబర్ట్ లుడ్ లూమ్, సిడ్నీ సెల్డమ్, హగాథా క్రిస్టీ, జఫ్రీ ఆర్చర్, డాన్ బ్రౌన్ రచయితల కథలు బాగా చదివే వాణ్ని. దాని వల్ల ఆంగ్లంపై పట్టు పెరిగింది.
- తెలుగులో ఎందరో మహానుభావుల గొప్ప సాహిత్యం వుంది. ప్రేమ కోసం కాళిదాసు కవి 'మేఘసందేశం' ఇస్తే జాషువా 'గబ్బిలమ్'తో మానస సరోవరం దాటి కైలాసంలో వున్న శివునికి సందేశం పంపారు. సమాజంలో వున్న అసమానతలు, రుగ్మతలు తొలిగించమని నవయుగ కవి చక్రవర్తి జాషువా అడిగారు. గురజాడ తెలుగు రచనల్లో కొత్త సృజన, యండమూరి రచించిన 'ఆనందోబ్రహ్మ' చాలా ఇష్టం. మనిషిలో వైవిధ్య భరితమైన రసాత్మకత వుండాలన్నది ఆనందోబ్రహ్మ సారాంశం.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 85, 92, 102 |
| చికెన్ విత్ స్కిన్ | 164 |
| చికెన్ స్కిన్‌లెస్ | 174 |

**నెక్ కోడిగుడ్డు ధర**
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నేతలు

## తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించాలి : డీవైఎఫ్ఐ

గవర్నర్‌పేట, జనవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లుగా డీఎస్సీపై యువతను మభ్యపెడుతున్న వైసీపీ ప్రభుత్వం మంగళవారంలోపు మెగా డీఎస్సీపై ప్రకటన చేయాలని, లేనిపక్షంలో సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై. రాము, జి. రామన్న మాట్లాడారు.


తిరుమలకు కూరగాయలను పంపిస్తున్న దాతలు

### తిరుమల నిత్యాన్నదానానికి
## కూరగాయల పంపిణీ

**అజిత్‌సింగ్‌నగర్, జనవరి 7 :** తిరుమల శ్రీవారి నిత్యాన్నదానానికి తమ వంతుగా కూరగాయలు పంపించడం పూర్వ జన్మసుకృతమని దాతలు ఆర్ సోమేశ్వరరావు, బోగాది కృష్ణ, మున్నంటి సాంబశివరాజు, వట్టిపోయిన శివరామకృష్ణ, పిన్నంశెట్టి శివరామ్, ఒల్లి పాండురంగారావులు పేర్కొన్నారు. అజిత్ సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని దాతల అపార్ట్‌మెంట్ నుంచి తిరుమలకు 10 టన్నుల కూరగాయలను పంపించారు.

### కులగణనపై
## కమిటీ నివేదిక ఇంకెన్నాళ్లకు?

**వన్‌టౌన్, జనవరి 7 :** రాష్ట్రంలో కులగణనపై కమిటీ నివేదిక ఇంకెన్నాళ్లకు ఇస్తారని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీసీ కులగణన బాధ్యతను కిందటేడాది ఏప్రిల్‌లో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణకు సీఎం అప్పగించారన్నారు. ఇంతవరకు ప్రక్రియ ప్రారంభమే కాలేదన్నారు. మన రాష్ట్రం కంటే ఆలస్యంగా కులగణను ప్రారంభించిన బీహార్‌లో నివేదిక కూడా వచ్చిందన్నారు. సీఎం జోక్యం చేసుకుని కులగణనలో కనీసం రెండో స్థానంలో ఉండేవిధంగా కమిటీ నివేదిక త్వరగా వచ్చేటట్లు చేయాలన్నారు.

## 3 నుంచి మహిళా ఉత్సవ్

**మొగల్రాజపురం, జనవరి 7 :** ఫిబ్రవరి 3 నుంచి మొగల్రాజపురం మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళా ఉత్సవ్ నిర్వహిస్తున్నామని సంస్థ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహిళా ఉత్సవ్ -2024ను జనశిక్షణా సంస్థాన్ చైర్ పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా అధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు.

### జాతీయ మహిళా సదస్సుకు
## వరి శ్రీదేవికి ఆహ్వానం

**గుణదల, జనవరి 7:** ఈనెల 9వ తేదీన ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జాతీయ మహిళా సదస్సుకు ఏపీ నుంచి రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర మహిళా కమిషన్ నుంచి ఆమె ఆదివారం ఆహ్వానం అందుకున్నారు. 'మహిళలపై జరుగుతున్న దాడులు వాటిని ఎదుర్కోవడం ఎలా' అనే అంశంపై తరచూ మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడమే జాతీయ మహిళా సదస్సుకు రాష్ట్రం తరఫున ప్రతినిధిగా హాజరవుతున్నారు.

### మిల్క్‌ఫ్యాక్టరీ ఫీడ్‌కు
## ప్రసంశా పత్రం

**చిట్టినగర్, జనవరి 7 :** విజయవాడలోని కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారులు పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలోని మిల్క్‌ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేస్తున్న ఫీడ్‌కు వరుసగా మూడో ఏడాది భారతీయ ప్రమాణికాల సంస్థ ప్రసంశాపత్రం అందజేసింది. ఫ్యాక్టరీ నుంచి పంపిస్తున్న ఫీడ్ నమూనాలు ఏ ఒక్కటీ తిరస్కరణకు గురికాకుండా నాణ్యతా ప్రమాణాల్లో దీటుగా నిలిచాయి. అత్యున్నత ప్రమాణికాలను పాటిస్తూ నాణ్యమైన ఫీడ్‌ను పాడి రైతులకు అందిస్తున్నారు. కృష్ణా మిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ నాణ్యమైన పశుదాణాను తయారీ వ్యయం కంటే తక్కువ ధరకే అందిస్తున్నట్టు తెలిపారు.




ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గద్దె అనురాధ తదితరులు

# ఎస్మా ప్రయోగం.. సీఎం తీరుకు నిదర్శనం

• ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ • జీవో ప్రతుల దహనం

**భారతీనగర్ :** అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా వారిపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం జగన్మోహన్ రెడ్డి మొండి వైఖరికి నిదర్శనమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కృష్ణాజిల్లా మాజీ చైర్పర్సన్ గద్దె అనేరాధ అన్నారు. 4వ డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు కార్యాలయం వద్ద ఆదివారం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలపై ఇచ్చిన ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజక వర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గద్దె అనూరాధ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, దేవరపల్లి ఆంజనేయులు, ఈశ్వర్ పేరేపి, చలసాని రమణ, పఠాన్ హయత్‌ఖాన్, కోలామన్మధ రావు పాల్గొన్నారు.

## ఎస్మాను ఉపసంహరించుకోవాలి : బొండా ఉమా



**అజిత్‌సింగ్‌నగర్ :** ఎస్మా ప్రగియోస్తూ వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం 2న తక్షణమే ఉపసంహరించుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్మా ప్రయోగించడం అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు.


గోడ పైపు నుంచి ఫుట్‌పాత్‌పైకి చేరిన మురుగు

# ఫుట్‌పాత్ కంపు కంపు..

• రైల్వే స్టేషన్ మరుగుదొడ్ల నుంచి ఫుట్‌పాత్‌లపైకి వస్తున్న మురుగు నీరు

**వన్‌టౌన్, జనవరి 7 :** ఆ ఫుట్‌పాత్ దుర్గంధ భరితంగా మారింది. పాదచారులు మూత్రపు కంపును భరించలేకుండా ఉన్నారు. వన్‌టౌన్ గాంధీహిల్ ఎదురుగా రైల్వేస్టేషన్ వద్ద మరుగుదొడ్ల గోడలో నుంచి లీకయి బయటకు వచ్చి ఫుట్‌పాత్‌పై నిలిచిపోతున్నాయి. కార్పొరేషన్ అధికారులు ఫుట్‌పాత్‌లు అందంగా ఉండాలని, పరిశుభ్రంగా ఉండాలని, పాదచారులు నడిచేందుకు అనుకూలంగా ఉండాలని భావించి టైల్స్ వేయిస్తే అవి కూడా పాడయ్యాయి. ఫుట్‌పాత్‌పై నడవడానికి కూడా వీల్లేనంతగా నీరు చేరింది. చాలా మంది జారిపడుతున్నారు. గోడలో రంధ్రాలు ఏర్పడి లీకయి బయటకు వస్తున్నా, రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు.




పండుగ పిండి వంటలు చేస్తున్న విద్యార్థినులు


అష్టలక్ష్మీ రూపాలతో పాఠశాల విద్యార్థులు

### 'మాస్టర్‌మైండ్స్'లో
## సంక్రాంతి శోభ

• సాంప్రదాయాలను గుర్తుచేస్తూ సంబరాలు

**పాయకాపురం, జనవరి 7 :** పాయకాపురం రాజీవ్‌నగర్‌లోని మాస్టర్‌మైండ్స్ స్కూల్‌లో ఆదివారం ముందస్తుగా సంక్రాంతి పండుగను నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు హరిదాసు, రైతులు, అష్టలక్ష్మీల రూపాలు, పండగ పిండి వంటలు తదితర ప్రత్యేక వేషధారణలతో అందరినీ అబ్బురపరిచారు. భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలతో స్కూల్ ప్రాంతం పండుగ వాతావరణంలో సంప్రదాయాలను గుర్తు చేశాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పెంట్యాల అనిల్‌కుమార్ మాట్లాడారు.


పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

## ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

**గవర్నర్‌పేట, జనవరి 7 :** ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి మాట్లాడుతూ పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెంచాలనే లక్ష్యంతో పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లపై అవగాహన


సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ నేతలు, పెన్షనర్లు

**భవానీపురం, జనవరి 7 :** ఎన్టీఆర్ జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్)శాఖ సౌజన్యంతో భవానీపురం హెచ్‌బికాలనీ ఆల్ ఎంప్లాయాస్ అసోసియేషన్ పెన్షనర్లుకు యూటీఎఫ్ రాష్ట్ర మాజీ ట్రెజరర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం లైఫ్ సర్టిఫికెట్ క్యాంపును నిర్వహించారు. ఐరిస్, బయో మెట్రిక్ ద్వారా 60 మంది పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను ట్రెజరీకి సమర్పించారని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూరిశెట్టి వెంకటేశ్వర రావు తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు యూటీఎఫ్‌కు ధన్యవాదాలను తెలిపారు.

## ప్రేమ్‌విహార్ బాలురకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న హరివిల్లు ఫౌండేషన్ ప్రతినిధులు

**భవానీపురం, జనవరి 7 :** నగరం సమీపంలోని ఎస్‌కేసీవీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలోని ప్రేమ విహార్‌లోని బాలుర అనాథాశ్రమంలో హరివిల్లు ఫౌండేషన్ సభ్యులు, దాతల సహకారంతో 70 మంది పిల్లలు రెడీమేడ్ దుస్తులను, అరిసెలను, చక్రాలను ఆదివారం అందజేశారు. ఈ ఫౌండేషన్ అధ్యక్షులు ఎం.శశికాంత్, జాయింట్ సెక్రటరీ యు.కనకారావు మాట్లాడారు.


మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉమా

## దేవినేని ఉమా పరామర్శ

**జి.కొండూరు, జనవరి 7:** గడ్డమణుగు గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి సాంబశివరావు తల్లి వెంకట రమణమ్మ ఇటీవల కన్నుమూశారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గడ్డమణుగు వెళ్లి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సాంబశివరావును, ఆయన సోదరుడు శివనాగేశ్వర రావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

### అన్నివర్గాలకు
## అందుబాటులో వైద్యం

• డాక్టర్ కృష్ణచంద్, మాధురి

**పాయకాపురం, జనవరి 7 :** అన్ని వర్గాల ప్రజలకు వైద్యం అందుబాటులోకి తేవడానికి కృష్ణా హాస్పిటల్‌ను ప్రారంభించినట్టు వైద్యులు డాక్టర్ కృష్ణ చంద్, డాక్టర్ మాధురిలు పేర్కొన్నారు. నగరంలోని మురళీనగర్‌లో కృష్ణా హాస్పిటల్స్ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ మాధురి పోసిన, డాక్టర్ కాగిత కృష్ణ చంద్‌ల ఆధ్వర్యంలో కాగిత అనురాగ్, కాగిత లక్ష్మీ ఐశ్వర్యలు, కాగిత పాండు జయరావమ్మలు ముఖ్య అతిథులుగా హాజరై హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అతి చేరువలో జనరల్ మెడిసిన్, డయాబెటిస్, గుండె వైద్య సేవలు అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగిత లక్ష్మీ, చెంచు రామారావు, పోసిన రాజ్ భరత్, సౌమ్య, కాగిత రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



## బంజారా భక్తుల ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు చేయాలి

**వన్‌టౌన్ :** తిరుమలలోని హాథీరామ్‌జీ మఠానికి బంజారా భక్తులతో ట్రస్ట్‌బోర్డును ఏర్పాటు చేయాలని ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన గిరిజనుల శంఖారావం సభలో తీర్మానం చేశారు. దీంతో పాటు ఇంకా పలు తీర్మానాలను కూడా చేసి ప్రభుత్వానికి నివేదించారు. జై జన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కే.రాజు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా వడిత్యా శంకర్‌నాయక్, రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యుడు, గిరిజన ప్రజాసమాఖ్య ఫౌండర్ ఏ.సీతారామ నాయక్, మాజీ ఎంపీ, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.స్రవంతి జయవర్ధిని, నెల్లూరు మునిసిపల్ మేయర్ డాక్టర్ జీవీజీ శంకరరావు పాల్గొన్నారు.

## జిహాదీల కనుగుడ్లు పీకి ఆటాడుకుంటాం

» షోలాపూర్ ర్యాలీలో రాజాసింగ్.. కేసు నమోదు



ముంబై, జనవరి 7: లవ్ జిహాదీలు, గో హంతకులపై మహారాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే.. తామే చర్యలు తీసుకుంటామని, వారి కనుగుడ్లు పీకి ఆటాడుకుంటామని షోలాపూర్‌లో జరిగిన ఓ ర్యాలీలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకు గోషా మహల్ బీజేపీ ఎమ్మెల్యే టి. రాజాసింగ్, మరో బీజేపీ ఎమ్మెల్యే నితేశ్ రాణెపై మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. షోలాపూర్‌లోని రాజేంద్ర చౌక్.. కన్నా చౌక్‌ల మధ్య శనివారం జన్ ఆక్రోశ్ ర్యాలీ నిర్వహించారు. దీనికి సకల హిందూ సమాజం నాయకులు కూడా హాజరయ్యారు. దీంతో ఆ సమాజం ఆఫీసు బేరర్ల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసినట్లు షోలాపూర్ జైలురోడ్డు పోలీసుస్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. జిహాదీలు, మసీదుల కూల్చివేతపై రాణె ప్రస్తావించగా.. రాజాసింగ్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం లవ్ జిహాద్ పేరుతో మన అక్కచెల్లెళ్లు, కూతుళ్లపై అత్యాచారాలు జరగడం లేదా? వాళ్లను పిల్లల్ని కనే యంత్రాలుగా మార్చడం లేదా..? లవ్ జిహాదీలు, గోహంతకులపై మహారాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్య తీసుకోకపోతే, వారికి మేమే గుణపాఠం చెబుతాం. జిహాదీల కనుగుడ్లు పీకి, వాటితో ఆటాడుకుంటాం" అన్నారు.

## భారతీయ ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలి!

» జైప్రకాశ్ వర్సిటీ ప్రొఫెసర్ లేఖ.. ఏబీవీపీ ఆందోళన

న్యూఢిల్లీ, జనవరి 7: "భారతీయ ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలి. అది కూడా పాకిస్థాన్-బంగ్లాదేశ్‌ల వెంబడే ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేస్తూ బిహార్‌లోని ఛాప్రాలో ఉన్న జైప్రకాశ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖర్షీద్ అలామ్ అలియాస్ లాల్ బాబు పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రభుత్వాలకు రాసిన లేఖ తీవ్ర వివాదానికి దారితీసింది. భారతీయ ముస్లింలు ప్రత్యేక దేశం కోరుకుంటున్నారంటూ లాల్ బాబు ఈ నెల 2న లేఖ రాశారు. అనంతరం దీనిని ఫేస్‌బుక్‌లోనూ ఆయన పోస్టు చేశారు దీనిపై ఏబీవీపీ నిరసనలకు పిలుపునిచ్చింది. వివరణ ఇవ్వాలని లాల్ బాబుకు వర్సిటీ వర్గాలు షోకాజ్ నోటీసులు జారీ చేశాయి.

## లోక్‌సభ ప్రచారానికి 13న మోదీ శ్రీకారం

న్యూఢిల్లీ, జనవరి 7: రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఈ నెల 13న ప్రధాని మోదీ బిహార్‌లో శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. పశ్చిమ చంపారన్ జిల్లా ముఖ్యపట్టణమైన బెతియాలోని రమణ్ మైదాన్‌లో నిర్వహించే బహిరంగ సభ ద్వారా ప్రచారాన్ని ప్రారంభిస్తారని ఆదివారం బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పలు రోడ్లు, వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నాయి. బిహార్‌లోని మొత్తం 40 లోక్‌సభ స్థానాలను దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ..అగ్రనాయకులతో ప్రచార సభలు నిర్వహించనుంది. ప్రధాని మోదీ బెతియాతో పాటు బెగుసరాయి, ఔరంగాబాద్‌ల్లోనూ జరిగే బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు.

## జోడో న్యాయ యాత్రకు తరలిరండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 7: మణిపూర్‌లో ఈనెల 14 నుంచి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో చేపట్టే 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో ప్రజలు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ప్రతి భారతీయుడికి ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందించడమే లక్ష్యంగా రాహుల్ ఈ యాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు చేపడుతున్న ఈ యాత్ర 66 రోజులు సాగనుంది. మార్చి 20 లేదా 21న ముంబైలో ముగియనుంది.

## డాటాను వాడండి..దండాన్ని కాదు: ప్రధాని మోదీ

జైపూర్, జనవరి 7: పోలీసులు సమాచారాన్ని(డాటా) ఉపయోగించి పనిచేయాలే తప్ప దండాన్ని ఉపయోగించి కాదని ప్రధాని మోదీ హితవు చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకునే నూతనంగా మూడు 'సంహిత'లను తీసుకొచ్చినట్టు తెలిపారు. 'పౌరులు ప్రథమం..గౌరవం ప్రథమం..న్యాయం ప్రథమం' అన్న సందేశంతో వీటిని రూపొందించినట్టు చెప్పారు. ఆదివారం ఇక్కడ జరిగిన 58వ డీజీపీలు, ఐజీల సమావేశంలో ఆయన ప్రసంగించారు. నూతన క్రిమినల్ చట్టాల ప్రాధాన్యతను వివరించారు. డాటా ఆధారంగా దర్యాప్తులు ఉండాలని చెప్పారు. దేశ క్రిమినల్ న్యాయ వ్యవస్థలో అవి నిర్ణయాత్మక మార్పులు తీసుకొస్తాయని చెప్పారు. మహిళల భద్రతపై దృష్టి కేంద్రీకరించాలని, వారు ఎప్పుడైనా, ఎక్కడైనా నిర్భయంగా పనిచేసేలా పరిస్థితులు కల్పించాలని కోరారు.

## 7 కోట్ల డిజిటల్ ఫైళ్లను వడపోసి..

## హమాస్ కమాండర్ ఫొటో వెలికితీత



జెరూసలేం, జనవరి 7: గాజాలో స్వాధీనం చేసుకున్న ఏడు కోట్ల డిజిటల్ ఫైళ్లను వడపోసి హమా‌స్‌కు చెందిన కీలక కమాండర్ మహమ్మద్ డయఫ్ ఫొటోను ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) వెలికితీసింది. ఈ వివరాలను ఐడీఎఫ్ ప్రతినిధి శనివారం సాయంత్రం వెల్లడించారు. గత కొన్నేళ్లుగా బయటి ప్రపంచానికి కనిపించని డయఫ్ ఫొటోను మొట్టమొదటిసారిగా సంపాదించామని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం గతంలో జరిపిన దాడుల్లో డయఫ్ ఒక చెయ్యి, ఒక కాలు (లేదా రెండు కాళ్లు) కోల్పోయాడని ఇప్పటి వరకూ భావిస్తూ వచ్చారు. కానీ, తాజా ఫొటోలో రెండు చేతులతో డయఫ్ కనిపించటం విశేషం. అయితే, అతడికి ఒక కన్ను లేదని ఫొటో వెల్లడించింది. కాగా, వారం కిందట డయఫ్ పేరిట మరో ఫొటో కూడా ఇజ్రాయెల్ మీడియాలో కనిపించింది. ఇజ్రాయెల్ మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదుల్లో డయఫ్ ఒకడు. 1990ల నుంచి ఇజ్రాయెల్‌పై ఆయన అనేక దాడులు జరిపాడు. ఇటీవల హమాస్ మెరుపుదాడిలో కీలక పాత్ర పోషించాడు. ఇజ్రాయెల్ 2014లో జరిపిన డ్రోన్ దాడిలో డయఫ్ భార్య, కుమారుడు, కుమార్తె మరణించారు. డయఫ్ మీద ఇజ్రాయెల్ అనేకసార్లు గురిపెట్టినా ఆయన తప్పించుకున్నాడు.

## దుబాయిలో గోదారి మహిళల తిండి తిప్పలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయి నగరంలో కొంత కాలంగా ఉంటున్న కొందరు తెలుగు మహిళలు ఉపాధి అవకాశాలు కోల్పోయి స్వదేశానికి తిరిగి రాలేక.. అక్కడ బతకలేక నరకం చూస్తున్నారు. వీరిలో ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన సుమారు 15 మంది మహిళలు.. కొన్ని నెలలుగా ఉద్యోగాలు లేక ఆదాయం లేక ఇంటి అద్దెలు చెల్లించలేక అష్టకష్టాలు పడుతున్నారు. కనీసం తినడానికి తిండి కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరిలో కొందరు అనారోగ్యానికి గురయి కదలలేని పరిస్థితుల్లో ఉండగా మరికొందరు వీసా, పాస్ పోర్టు గడువు సమస్యలతో సతమతమవుతున్నారు. కరోనా అనంతరం కేవలం కొన్ని గంటల వ్యవధి కలిగిన పార్ట్ టైం ఉద్యోగాలు అతి కష్టంగా లభిస్తుండడంతో, ఆ వచ్చే డబ్బు చాలక నగరంలో బతుకు భారంగా మారుతోంది. వీరి అవస్థలపై దుబాయిలోని ప్రవాసాంధ్ర ప్రముఖులు సోమిరెడ్డి ప్రసన్నరెడ్డి స్పందించారు. ఆయన ఆధ్వర్యంలో రెడ్డయ్య రెడ్డి, తరపట్ల మోహన్, విజయ, యోహాను తదితరులు వీరికి నిత్యావసర సరుకులను అందిస్తూ అండగా నిలుస్తున్నారు. దుబాయిలోని భారతీయ కాన్సులేటు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాయంతో ఈ మహిళల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారిస్తామని సోమిరెడ్డి తెలిపారు.

## కార్గిల్ కొండల్లో రాత్రివేళ ల్యాండింగ్

» తొలిసారి భారీ విమానాన్ని దింపిన వాయుసేన



న్యూఢిల్లీ, జనవరి 7: కార్గిల్ పర్వతాల్లోని ఎయిర్‌స్ట్రిప్‌పై తొలిసారిగా భారీ రవాణా విమానం సీ-130జేను భారత వాయుసేన రాత్రివేళ సురక్షితంగా దించింది. ఈ విషయాన్ని ఐఏఎఫ్ ఆదివారం వెల్లడించింది. గరుడ్ కమాండోల శిక్షణలో భాగంగా ఈ విన్యాసం చేసినట్టు పేర్కొంది. ఒక రవాణా విమానం ఇలా కార్గిల్ కొండల్లో రాత్రివేళ ల్యాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ కార్గిల్ ఎయిర్‌స్ట్రిప్ సముద్ర మట్టానికి దాదాపు 10,500 అడుగుల ఎత్తులో ఉంది.

# మనోళ్లే చంపేస్తున్నారా?

## భారతదేశ శత్రువులను విదేశాల్లో హత్య చేస్తున్న 'గుర్తు తెలియని వ్యక్తులు'

» 'టార్గెట్ కిల్లింగ్స్' ఆరోపణలను కొట్టిపారేసిన భారత ప్రభుత్వం



పట్టపగలు నడిరోడ్డుపై.. మసీదులో ప్రార్థనలు చేసేటప్పుడు.. షాపింగ్ చేసి దుకాణంలోంచి బయటకు వస్తున్నప్పుడు.. ఇక్కడా అక్కడా అనే తేడా లేదు! ఎక్కడైనా సరే.. ఎప్పుడైనా సరే.. ఎటు నుంచి వస్తారో తెలియదు.. వస్తారు! వీలైతే పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చిచంపేస్తారు. వీలు కుదరకపోతే.. దూరం నుంచే కాల్పులు జరిపేసి పారిపోతారు!! భారతదేశంపై ఉగ్రదాడులు జరిపిన సూత్రధారులు, మాస్టర్‌మైండ్స్, ఆ దాడుల్లో పాత్రధారులను పాక్ గడ్డపైనే గుర్తుతెలియని వ్యక్తులు ఇలా దారుణంగా చంపేస్తున్నారు. పాక్‌లో ఇటీవల జరిగిన మసూద్ ఉర్ రెహమాన్ ఉస్మానీ హత్య ఇందుకు తాజా ఉదాహరణ. ఒక్క పాక్‌లోనే కాదు.. కెనడా, యూకే, నేపాల్‌లోనూ ఇలాంటి హత్యలు జరగడం గమనార్హం. గుర్తుందా.. కెనడాలో తలదాచుకుంటున్న ఖలిస్తానీ ఉగ్రవాది, నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ వ్యవస్థాపకుడు.. ఇండియా మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న హర్‌దీప్ సింగ్ నిజ్జర్ ఇలాగే గత ఏడాది జూన్‌లో అగంతుకుల చేతుల్లో చనిపోయాడు. నిజ్జర్ హత్య వెనుక భారత ప్రభుత్వ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించడం అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నిజ్జర్ మరణానికి సరిగ్గా మూడు రోజుల ముందు.. నిషేధిత ఖలిస్తాన్ విమోచన దళం చీఫ్ అవతార్ సింగ్ (35) యూకేలోని బర్మింగ్‌హామ్‌లోని ఆస్పత్రిలో అనుమానాస్పద పరిస్థితుల్లో చనిపోయాడు. అవతార్‌సింగ్, నిజ్జర్ మరణాల తర్వాత.. జూన్ 21-23 నడుమ ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించడానికి ముందు అక్కడ ఉన్న ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు భారత్ కుట్ర పన్నిందంటూ 'ద వైర్' ఒక వార్తాకథనాన్ని వెలువరించింది. కానీ, అమెరికాలో పన్నూ హత్యకు ఒప్పుకొన్న హంతకుడి ముసుగులో ఉన్నది అమెరికా గూఢచారి కావడంతో భారత్ ప్లాన్ దెబ్బతిందని అమెరికా ప్రభుత్వ డాక్యుమెంట్‌లో ఉన్నట్టు తన కథనంలో వివరించింది. కెనడా, యూకేల్లోనే కాదు.. అంతకు ముందు మే (2023) నెలలో పాకిస్థాన్‌లోనూ ఓ ఖలిస్తానీ ఉగ్రవాది పరంజిత్ సింగ్ పంజ్వార్‌ను దుండగులు కాల్చిచంపేశారు.

### పాక్‌లో వరుసహత్యలు..

1999లో నేపాల్ రాజధాని కాఠ్మండూ నుంచి బయల్దేరిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ814ను హైజాక్ చేసి కాందహార్‌కు మళ్లించి.. మౌలానా మసూద్ అజర్ సహా ముగ్గురు ఉగ్రవాదులను విడిపించుకుపోయిన హైజాకర్లలో ఒకడైన జహూర్ మిస్త్రీ 2022 మార్చిలో కరాచీ నడిబొడ్డున గుర్తుతెలియని వ్యక్తి కాల్చిన తూటా దెబ్బకు ప్రాణాలు విడిచాడు. 1985లో ఎయిరిండియా విమానాన్ని పేల్చేసిన కుట్రదారుల్లో ఒకడైన రిపుదామన్ సింగ్ మాలిక్‌ను 2022 జూలైలో ఇలాగే గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపేశారు. అలాగే.. హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బషీర్ అహ్మద్ పీర్ రావల్పిండిలో.. అల్ బద్ర్ ఉగ్రవాద సంస్థ కమాండర్ అయిన సయ్యద్ ఖాలిద్ రజా కరాచీలో.. గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో చనిపోయారు. జమ్మూకశ్మీర్‌లో 2016లో ఎనిమిది మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టనబెట్టుకున్న లష్కరే తాయిబా టాప్ కమాండర్ అద్నాన్ అహ్మద్ అలియాస్ అబు హంజాలానైతే.. పాకిస్తాన్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏర్పాటు చేసిన రెండంచెల భద్రత వలయాన్ని ఛేదించి మరీ ఒళ్లంతా తూటాలు దింపి మరీ చంపారు. 2008లో ముంబైలో జరిగిన ఉగ్రదాడి గుర్తుందా? ఆ దారుణ మారణకాండ వెనుక మాస్టర్‌మైండ్, జైషే మహ్మద్ చీఫ్ హఫీజ్ సయీద్ ఇంటి వద్ద 2021 జూన్ 23న ఆత్మాహుతి బాంబుదాడి జరిగింది. అయితే, ఆ దాడిలో అతడికి ఏమీ కాలేదు. ఈ దాడి వెనుక భారతదేశమే ఉందని అప్పట్లో పాకిస్థాన్ ఆరోపించింది. హఫీజ్ సయీద్ అనుచరులైన షాహిద్ లతీఫ్‌ను, అతడి సోదరుణ్ని గత అక్టోబరులో సియాల్‌కోట్‌లోని ఓ మసీదులో గుర్తుతెలియని దుండగులు కాల్చిచంపేశారు. ఈ షాహిద్ లతీఫ్ 2016లో పఠాన్‌కోట్‌లోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌పై దాడి వెనుక మాస్టర్ మైండ్. లష్కరే హైర్యాంకింగ్ కమాండర్లలో ఒకడైన రియాజ్ అహ్మద్‌ను గత సెప్టెంబరులో మసీదులో ప్రార్థన చేసే సమయంలో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో సాయుధ దుండగులు కాల్చిచంపేశారు. పాక్‌లోనే కాదు.. నేపాల్‌లోనూ ఇలాంటి హత్య ఒకటి జరిగింది. కానీ, అక్కడా చనిపోయింది మాత్రం.. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఏజెంట్ లాల్ మొహమ్మద్ అలియాస్ మొహమ్మద్ దర్జీ. ఐఎస్ఐ తయారు చేసే నకిలీ నోట్లను పెద్ద ఎత్తున భారతదేశంలోకి ప్రవేశపెట్టే లాల్ మొహమ్మద్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపేశారు. ఇక.. మసూద్ అజర్ బాంబు పేలుడులో చనిపోయాడంటూ కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది గానీ.. అది నిజం కాదు. అలాగే.. ఇండియాస్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం ఇటీవలే విషాహారం కారణంగా ఆస్పత్రిపాలయ్యాడని.. అతడి పరిస్థితి విషమంగా ఉందని కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది కానీ, అందులో నిజమెంతో తెలియదు.

- సెంట్రల్ డెస్క్

### భారత్ పంపదు.. కానీ..

విదేశాల్లో భారత వ్యతిరేకులు, మన శత్రువుల హత్యలు ఇంత విస్తృతంగా జరుగుతున్నా.. భారత ప్రభుత్వ ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వచ్చిన కేసులు మాత్రం మూడే. ఒకటి నిజ్జర్ కేసు. రెండోది పన్నూ కేసు. మూడోది.. మసూద్ అజర్ ఇంటివద్ద జరిగిన ఆత్మాహుతి బాంబుదాడి కేసు. అయితే భారత ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను కొట్టిపారేసింది. నిజానికి.. విదేశీగడ్డపై ఈ తరహా 'టార్గెట్ కిల్లింగ్ ఆపరేషన్'లు నిర్వహించి తమ దేశవ్యతిరేకులను, శత్రువులను, ఉగ్రవాదులను మట్టుబెట్టడం అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ వంటి దేశాలకు అలవాటే. మరీ ముఖ్యంగా.. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొస్సాద్ చేపట్టిన ఇలాంటి ఆపరేషన్ల ఆధారంగా కనీసం 10 హాలీవుడ్ సినిమాలు వచ్చాయంటే వారు తమ దేశానికి, పౌరులకు హాని కలిగించే ఉగ్రవాదులు, తీవ్రవాదుల పట్ల ఎంత కఠినంగా వ్యవహరిస్తారో అర్థం చేసుకోవచ్చు. ఇటీవలికాలంలో భారత్ వ్యతిరేకులు కూడా ఇలాగే వరుసగా హతమారిపోతున్న నేపథ్యంలో మన 'రా'పై కూడా చాలా మందికి అలాంటి అనుమానాలు వస్తున్నాయి. 'రా'లో చాలాకాలం పనిచేసిన ఒక అధికారిని దీనిపై ప్రశ్నించగా.. "భారత వ్యతిరేక ఉగ్రవాదులను చంపడం కోసం భారతదేశం ఎలాంటి కమాండోలనూ విదేశాలకు పంపదు" అని ఆయన వెల్లడించారు. అయితే, ఆయా దేశాల్లో ఉండి మన పనుపున పనిచేయడానికి చాలా మంది సిద్ధంగా ఉంటారని పేర్కొనడం ద్వారా.. అలాంటివారితో భారతదేశ శత్రువులను 'రా' చంపిస్తుందన్న విషయాన్ని చెప్పకనే చెప్పారాయన. 'రా' మాజీ అధికారి ఆర్కే యాదవ్ కూడా అవతార్ సింగ్ మరణంపై ఇలాగే నర్మగర్భంగా స్పందించారు. అలాంటివి సహజ మరణాలు కాదంటూనే.. అంతకంటే ఎక్కువ తాను మీడియాలో మాట్లాడలేనని వ్యాఖ్యానించారు.

## లోకం తీరు




### పాక్‌లో మతగురువు

## అల్లామా మసూద్ దారుణ హత్య

» ఇస్లామాబాద్ శివారులో పట్టపగలు

» తుపాకీతో కాల్చి చంపిన దుండగులు



న్యూఢిల్లీ, జనవరి 7: కరడుగట్టిన భారత వ్యతిరేకిగా ముద్రపడిన పాక్ మతగురువు అల్లామా మసూద్ ఉర్ రెహమాన్ ఉస్మానీ దారుణ హత్యకు గురయ్యారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ శివారులోని ఘౌరీ టౌన్ పరిసరాల్లో శుక్రవారం పట్టపగలు కొందరు దుండగులు ఆయనను అతి సమీపం నుంచి తుపాకీతో కాల్చి చంపారు. ఇస్లామాబాద్ పోలీసుల కథనం మేరకు.. ఉస్మానీ లక్ష్యంగా ఇద్దరు దుండగులు తుపాకీతో అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఇదేసమయంలో ఆయన కారు డ్రైవర్‌ను కూడా తీవ్రంగా గాయపరిచి ఘటనా ప్రాంతం నుంచి పరారయ్యారు. ఈ సంచలన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. పాకిస్థానీ మీడియా 'ది నేషన్' కథనం మేరకు.. పోలీసు అధికార ప్రతినిధి తాఖీ జావేద్ ఉస్మానీ హత్య ఘటనను నిర్ధారించారు. ఉస్మానీ మృత దేహాన్ని, తీవ్రంగా గాయపడిన ఆయన డ్రైవర్‌ను పాకిస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలించారు. ఇక, ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు ఏ సంస్థా బాధ్యత ప్రకటించలేదు. కాగా, భారత దేశానికి వ్యతిరేకంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసే ఉస్మానీ హత్య మత రాజకీయ కోణంలో పాకిస్థాన్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. దేశంలో కొన్ని వేల మంది హత్యకు కారణమైన ఉగ్రవాద సంస్థ సిపా-ఎ-సహాబాపై పాకిస్థాన్ ప్రభుత్వం నిషేధం విధించిన దరిమిలా.. సున్నీ ఉలేమా కౌన్సిల్ పేరుతో ఒక సంస్థ ఏర్పాటైంది. దీనికి ఉస్మానీ డిప్యూటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

## అమలాపురం అల్లర్ల కేసులు ఉపసంహరణ

» 295 మందిపై కేసులు వెనక్కి

» డిసెంబరులోనే ఉత్తర్వులు.. తాజాగా వెలుగులోకి

అమలాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పేరు మార్పు విషయంలో అమలాపురం కేంద్రంగా జరిగిన అల్లర్లు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఆనాటి ఘటనల్లో ఏకంగా మంత్రి పినిపే విశ్వరూప్ ఇంటికి దుండగులు నిప్పుపెట్టడం రాజకీయంగా దుమారానికి దారితీసింది. అయితే.. ఆయా కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా ఆయా కేసుల్లో ఉన్న వివిధ సామాజికవర్గాలకు చెందిన వారికి ఊరట కలిగిందని వైసీపీ ప్రభుత్వం పేర్కొంది. అయితే, ఈ ఉత్తర్వులు న్యాయపరంగా చెల్లుబాటు కావని మేధావులు అంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను విభజిస్తూ.. అమలాపురం కేంద్రంగా ఏర్పడిన కొత్త జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా ప్రభుత్వం పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ వివిధ సామాజికవర్గాలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో అమలాపురం కేంద్రంగా ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. 2022 మే నెలలో జరిగిన అల్లర్ల ఘటనలో మంత్రి పినిపే విశ్వరూప్, హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీశ్ కుమార్ ఇళ్లకు నిప్పు పెట్టడంతో పాటు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులను దహనం చేశారు. దీంతో అమలాపురం పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన ఆరు ఎఫ్ఐఆర్‌లలో అనేక సెక్షన్లతో బెయిల్, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి సుమారు 295 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. కొన్ని నెలల పాటు జైల్లో కూడా ఉన్నారు. అమలాపురం అల్లర్ల కేసులను ఉపసంహరించుకోకపోతే తాము మళ్లీ ఉద్యమానికి దిగుతామని శెట్టిబలిజ సామాజికవర్గం నేత వాసంశెట్టి సుభాశ్ ఇటీవల అల్టిమేటం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా పేరిట గత ఏడాది డిసెంబరు 20న విడుదల చేసిన జీవో ఆదివారం బహిర్గతమైంది. దీనిని ఎన్నికల ఎత్తుగడగానే రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. కేసులను ఉపసంహరించినప్పటికీ న్యాయపరంగా సమస్యలు ఎదురవుతాయని ప్రత్యర్థి వర్గీయులు, మేధావులు సైతం చెబుతున్నారు.

## బెంగళూరు-మైసూరు హైవేపై తొలిసారి జీపీఎస్ టోల్

బెంగళూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జీపీఎస్ ఆధారిత టోల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా కేంద్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దేశంలోనే తొలిసారిగా ఈ వ్యవస్థను బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్ హైవేపై అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ హైవేను ఏడాది క్రితం ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ మార్గం ద్వారానే జీపీఎస్ ఆధారిత టోల్ వసూలుకు శ్రీకారం చుడుతున్నట్లు జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ద్వారా తెలుస్తోంది. టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు జీపీఎస్ ఆధారిత టోల్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నామని, ఈ ఏడాది మార్చి కల్లా దీన్ని అందుబాటులోకి తెస్తామని కేంద్రం గతంలో ప్రకటించింది.

# మాల్దీవుల మంత్రులపై వేటు



» ప్రధాని మోదీపై అక్కసు వెళ్లగక్కిన ఫలితం

» లక్షద్వీప్ పర్యాటకం పోస్టుపై వ్యంగ్యాస్త్రాలు

మాలె/న్యూఢిల్లీ, జనవరి 7: ప్రధాని నరేంద్ర మోదీపై అక్కసు వెళ్లగక్కిన ముగ్గురు మాల్దీవుల మంత్రులు భారీ మూల్యాన్ని చెల్లించుకున్నారు. తమ పదవులను కోల్పోవడంతోపాటు.. భారతీయ పర్యాటకులు తమ మాల్దీవుల ప్రయాణాన్ని రద్దుచేసుకునేలా 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్‌ట్యాగ్ వైరల్ అయ్యేందుకు కారకులయ్యారు. ఈనెల 2, 3 తేదీల్లో ప్రధాని లక్షద్వీపాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. అక్కడ సముద్ర తీరాన కాసేపు సేదతీరారు. ఆ తర్వాత స్నార్కెలింగ్ చేశారు. "సాహసాలు చేయాలనుకునేవారు తమ జాబితాలో లక్షద్వీప్‌ను కూడా చేర్చాలి" అని పేర్కొంటూ ఎక్స్‌లో అక్కడి ఫొటోలు, వీడియోలను షేర్ చేశారు. దానికి పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. ప్రధాని టూర్ భారత పర్యాటక రంగానికి ప్రోత్సాహన్ని అందిస్తుందని అభిప్రాయపడ్డారు. అయితే.. మాల్దీవుల యువజన సాధికార శాఖ సహాయ మంత్రి మరియం షియూనా ప్రధాని మోదీ పోస్టుపై అక్కసు వెళ్లగక్కారు. "ఆయనో విదూషకుడు, తోలుబొమ్మ" అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత మరో ఇద్దరు మంత్రులు మాల్షా షరీఫ్, మజూమ్ మాజిద్ కూడా ఇలాంటి పోస్టులనే పెట్టారు. మాల్దీవుల ఎంపీ జాహిద్ రమీజ్ తీవ్రమైన వ్యాఖ్యలతో ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రధాని మోదీ వీడియోకు ట్యాగ్ చేస్తూ.. "పర్యాటకంలో మాతో పోటీ పడాలన్న ఆలోచన భ్రమే. మాలాంటి సేవలను ఎలా అందిస్తారు? పరిశుభ్రతను ఎలా పాటిస్తారు? అక్కడి(భారత్‌లోని) గదుల్లో వచ్చే వాసన అతి పెద్ద సమస్య" అని వ్యాఖ్యానించారు. ఈ పోస్టులపై భారత నెటిజన్లు తీవ్రస్థాయిలో స్పందించారు. 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్ ట్యాగ్‌తో ఎక్స్‌లో భారీ ప్రచారాన్ని ప్రారంభించారు. మాల్దీవుల మాజీ అధ్యక్షులు మహమ్మద్ నషీద్, ఇబ్రహీం సోలీ కూడా తమ మంత్రుల వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ప్రస్తుతం మాల్దీవుల ప్రధాని మహమ్మద్ ముయిజు చైనా పర్యటనలో ఉన్నప్పటికీ.. నష్టనివారణ చర్యలు చేపట్టారు. దాంతో.. "మంత్రుల వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమే తప్ప.. మాల్దీవుల ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు" అంటూ మాల్దీవుల సర్కారు ఓ ప్రకటనను విడుదల చేసింది. అయితే.. 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్‌ట్యాగ్ వైరల్ అవుతుండడంతో.. మంత్రులు మరియం, మాల్షా, మజూమ్‌లను మంత్రివర్గం నుంచి తొలగించింది. ఇక, మాల్దీవుల మంత్రులు, ఎంపీ జాహిద్ చేసిన వ్యాఖ్యలను బాలీవుడ్ సెలబ్రిటీలు, క్రికెట్ దిగ్గజాలు, ప్రముఖులు తీవ్రంగా ఖండించారు. మాల్దీవులకు భారత్ నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వెళ్తారని, ఆ దేశ మంత్రులు భారత్‌పై అలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని నటుడు అక్షయ్‌కుమార్ అన్నారు.

### మాల్దీవుల పర్యటనలు రద్దు

ఆర్థికంగా వెనకబడిన దేశంగా పేరున్న మాల్దీవులకు ప్రధాన ఆదాయవనరుల్లో పర్యాటకం ఒకటి. ఆ దేశానికి వెళ్లే పర్యాటకుల్లో 15% భారతీయులే. తాజా పరిణామాల నేపథ్యంలో.. మాల్దీవులకు వెళ్లాలనుకుంటున్న భారతీయులు తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్‌ట్యాగ్‌కు విశేష స్పందన వస్తోంది.

# సీట్లపై 'ఇండియా' కసరత్తు షురూ

## ఆప్, ఆర్జేడీ, జేడీయూ, కాంగ్రెస్ చర్చలు



» ఢిల్లీలో కాంగ్రెస్‌కు 4 ఇస్తామంటున్న ఆప్

» బిహార్‌లో 17:17:4:2 ఫార్ములాపై కసరత్తు

న్యూఢిల్లీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీని ఈసారి కేంద్రంలో ఎలాగైనా గద్దె దించాలన్న లక్ష్యం దిశగా ప్రతిపక్ష ఇండియా కూటమి ఒక్కో అడుగు వేస్తోంది. కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపకాలపై చర్చలు మొదలయ్యాయి. ఢిల్లీ, పంజాబ్‌లలో అధికారంలో ఉన్న ఆప్‌తో కాంగ్రెస్ నేతలు సోమవారం చర్చలు జరిపారు. ఢిల్లీలో మొత్తం ఏడు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో అన్నింటినీ బీజేపీ కైవసం చేసుకోగా, ఐదు సీట్లలో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. కాబట్టి, ఈసారి ఢిల్లీలో తమకు ఐదు స్థానాలను కేటాయించాల్సిందిగా కాంగ్రెస్ నేతలు ఆప్‌ను కోరారు. అయితే ఆప్ నాలుగు స్థానాలు వదిలిపెట్టేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఆదివారం రెండు పార్టీల మధ్య ప్రాథమికంగా చర్చలు జరిగాయని, సోమవారం కూడా కొనసాగుతాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇక పంజాబ్‌లో ఇరుపార్టీల రాష్ట్ర విభాగాలు పొత్తు వద్దని, ఒంటరిగా బరిలోకి దిగుదామని తమ తమ అధిష్ఠానాలను కోరుతున్నాయి. మరోవైపు 40 లోక్‌సభ సీట్లున్న కీలక రాష్ట్రం బిహార్‌లో కూడా కాంగ్రెస్ తన మిత్రపక్షాలతో చర్చలు ప్రారంభించింది. ఆర్జేడీ, జేడీయూ తాము చెరో 17 స్థానాలకు పోటీ చేస్తామని, కాంగ్రెస్‌కు నాలుగు, మిగిలి రెండు సీట్లను వామపక్షాలకు ఇస్తామని చెప్పాయి. కానీ, కాంగ్రెస్ 8 సీట్లు కోరుతోంది. దీనికి ఆర్జేడీ, జేడీయూ అంగీకరించటం లేదు. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో పట్టువిడుపులతో ఉండాలని కాంగ్రెస్‌కు ఆర్జేడీ, జేడీయూ చెప్పినట్లు సమాచారం.

### కామ్రేడ్లు, దీదీ.. చెరోదారి

కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో సీట్ల పంపకం కాంగ్రె‌స్‌కు ఇబ్బందికరంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. తృణమూల్, సీపీఎం రెండూ ఇండియా కూటమి పక్షాలే అయినప్పటికీ, బెంగాల్‌లో చేతులు కలపటానికి నిరాకరిస్తున్నాయి. ఇక కేరళలో ఉన్న 20 సీట్లలో 19 కాంగ్రెస్ సిటింగ్ స్థానాలే. రాష్ట్రంలో సీపీఎంతో పొత్తు కోసం కొన్ని సిటింగ్ స్థానాలను కాంగ్రెస్ వదులుకుంటుందా అన్నది సందేహమే. ఇటీవల మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎస్పీ అధినేత అఖిలేశ్, కాంగ్రెస్ మధ్య దూరం పెరిగింది. దీంతో ఎస్పీ కీలక ప్రతిపక్షంగా ఉన్న యూపీలో కాంగ్రె‌స్‌కు ఎన్ని సీట్లు లభిస్తాయన్నది ఆసక్తి కలిగిస్తోంది. కాగా, ఈ నెలాఖరులోగా మిత్రపక్షాలతో సీట్ల పంపకాల ప్రక్రియను ముగించాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

### బంగ్లాదేశ్‌లో హసీనా పార్టీ

## ఘన విజయం

ఐదోసారి పీఠం దక్కించుకున్న అవామీలీగ్



ఢాకా, జనవరి 7: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా సారథ్యంలోని పాలక అవామీ లీగ్ పార్టీ ఘన విజయం సాధించి వరుసగా ఐదోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఆదివారం ఎన్నికలు ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు మొదలైంది. 299 సీట్లలో అవామీలీగ్ 50% కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుందని ఆ దేశ ఎన్నికల కమిషన్ ప్రతినిధి మీడియాకు తెలిపారు. ఇంకా ఓట్ల లెక్కింపు కొనసాగుతోందన్నారు. అవామీలీగ్ మూడింట రెండొంతుల మెజారిటీ సాధించిందని సమాచారం. ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సహా డజనుకు పైగా విపక్షాలు ఈ ఎన్నికలను బహిష్కరించాయి. విపక్షాల బహిష్కరణ ప్రభావం పోలింగ్‌పై కూడా పడింది. కేవలం 40% పోలింగ్ మాత్రమే నమోదైంది. 2018 నాటి ఎన్నికలతో పోలిస్తే ఇది సగం మాత్రమే. కాగా, 'భారత్ లాంటి నమ్మకమైన మిత్రుడు పొరుగున ఉండడం మా అదృష్టం. విముక్తి ఉద్యమంలో, ఆ తర్వాత కూడా ఎంతో సహకరించింది. మా తల్లిదండ్రులు, సోదరులను కోల్పోయిన వేళ నాకు, మా చెల్లికి ఆశ్రయం ఇచ్చింది" అని హసీనా అన్నారు. ఎన్నికల్లో ఢాకా సిటీ కాలేజీలో ఓటేసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఒంటరిగా ఎదిగి... రైతులకు అండగా నిలిచి...

**సొంతవారి వెలివేత, ఆర్థిక సమస్యలు, వ్యాపారంలో ఇబ్బందులు... వీటన్నిటినీ అధిగమించి విజయం సాధించారు రేషమ్‌దేవి మాలిక్. వందలాదిమందికి చేయూతనిచ్చే స్థాయికి చేరిన రేషమ్‌దేవి ప్రస్థానం ఆమె మాటల్లోనే...**

"ఆ కాలం నా జీవితంలో అతి పెద్ద పీడకల. అది గుర్తుకువచ్చినప్పుడల్లా ఉలిక్కిపడతాను. అంతులేని ఆందోళన. కాసేపటికి మళ్ళీ మామూలు మనిషిని అవుతాను. అదంతా గడిచిపోయిందనీ, ఇప్పుడు అంతా బాగానే ఉందనీ తెలిసినా... ఆ చెడ్డ రోజులు గుర్తుకొస్తూనే ఉంటాయి. అప్పుడు హాస్టల్‌లో ఉంటూ ట్వెల్త్ క్లాస్ చదువుతున్నాను. నా హాస్టల్‌మేట్ సోదరుడు రాజేష్ అక్కడికి తరచూ వచ్చేవాడు. మా ఇద్దరి మధ్యా పరిచయం ప్రేమగా మారింది. పెళ్ళి చేసుకుందామనుకున్నాం. కానీ మా మతాలు వేరు కావడంతో పెద్దలు ఒప్పుకోలేదు. చేసుకుంటే అతణ్ణే వివాహం చేసుకుంటానని పట్టుపట్టాను. ఇంట్లో నన్ను నానా దుర్భాషలూ ఆడారు. శాపనార్థాలు పెట్టారు. కొట్టారు. చివరకు బయటకు గెంటేశారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న నన్ను రాజేష్ తన ఊరికి తీసుకువెళ్ళాడు. అతని తల్లితండ్రులు కూడా మమ్మల్ని ఇంట్లోకి ఆహ్వానించలేదు. నేను, రాజేష్ అక్కడే ఒక గది తీసుకొని, కొత్త జీవితం మొదలుపెట్టాం. నా చదువు కొనసాగించాలనుకున్నా కుదరలేదు. రాజేష్ లోన్ మీద ఒక కారు తీసుకొని, అద్దెకు తిప్పసాగాడు. అలా రెండేళ్ళు గడిచాయి. మాకొక అబ్బాయి పుట్టాడు. రాజేష్ కుటుంబ తిరస్కారం, గ్రామస్తుల్లో మా మతాంతర వివాహం పట్ల వ్యతిరేకత నానాటికీ పెరుగుతూ ఉండడంతో చేసేది లేక మళ్ళీ నేను పుట్టిన ఊరైన ఒడిశాలోని దరింగ్బడికి చేరుకున్నాం. అప్పటికి నా తల్లితండ్రులు మెత్తబడ్డారు. మనవడిని చూసి సంతోషపడ్డారు. వాళ్ళ ఇంట్లో మేం ఉండడానికి చోటిచ్చారు. అదృష్టవశాత్తూ అక్కడే 'పీపుల్స్ రూరల్ ఎడ్యుకేషన్ మూవ్‌మెంట్ (ప్రేమ్) అనే ఎన్జీవోలో సూపర్‌వైజర్‌గా రూ.3,500 జీతానికి చేరాను. మాది పర్యాటక ప్రాంతం కావడంతో... టూరిస్టుల ద్వారా రాజేష్‌కు మంచి ఆదాయం వచ్చేది. పరిస్థితులు కుదుటపడతున్నాయనుకుంటున్న దశలో... విధి మరోసారి దెబ్బతీసింది.



### జీవనాధారమైన కారును అమ్మేసి...

కేరళలోని మన్నుతిలో ఉన్న 'ప్రేమ్' పరిశోధన కేంద్రంలో నెల రోజుల శిక్షణకు వెళ్ళాను. అక్కడ రైతులతో, వ్యవసాయ నిపుణులతో మాట్లాడినప్పుడు... సొంతంగా ఏదైనా చెయ్యాలనే కోరిక కలిగింది. శిక్షణ నుంచి వచ్చాక ఆ దిశగా ఆలోచనలు చేస్తున్న దశలో... నాకు ప్రమాదం జరిగింది. అప్పుడు నేను గర్భవతిని. అదృష్టవశాత్తూ బిడ్డకు ఎలాంటి హానీ జరగలేదు. కానీ నేను కోలుకోవడానికి కొంత కాలం పట్టింది. 'ప్రేమ్' సంస్థ కొంత సాయం చేసింది. మేం దాచుకున్న కాస్త డబ్బూ నా చికిత్సకే ఖర్చయిపోయింది. పైగా అప్పులు చేయాల్సి వచ్చింది. నా పుట్టింటి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం. వారికి భారంగా ఉండడం ఇష్టంలేకపోయింది. ఆర్థికంగా స్థిరపడాలి. అదే సమయంలో రైతులకు మాకు చేతనైనంత మేలు చేయాలి. దానికోసం రైతుల నుంచే నేరుగా వ్యవసాయ ఉత్పత్తిని మంచి ధరలకు సేకరించి, వాటిని విక్రయించాలని నిర్ణయించుకున్నాం. 2021 లో... రాజేష్ కారు అమ్మేసి... 'గ్రీన్ ఫ్లాగ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (జీఎఫ్‌పిసిఎల్)ను ఏర్పాటు చేశాం. పదిమంది రైతులు భాగస్వాములుగా, పదిహేను వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలతో మా ప్రయాణం మొదలైంది. ఈలోగా కరోనా



రెండో దశ విజృంభించింది. "జీవనాధారంగా ఉన్న కారును అనవసరంగా అమ్మేశారు. మీ వ్యాపారం నిలదొక్కుకొనే అవకాశం లేదు" అంటూ ఎంతోమంది వ్యాఖ్యానించారు. నేను వాటిని పట్టించుకోలేదు. రాజేష్ వేరే చోట డ్రైవర్‌గా కుదురుకున్నాడు. దాంతో రైతుల నుంచి ఉత్పత్తులు సేకరించడం, వాటిని ప్యాక్ చెయ్యడం, దుకాణదారుల్లో అమ్మకాలకు ఉంచడం, ఎక్కడైనా ప్రదర్శనలు జరిగితే అక్కడ విక్రయాలు జరపడం... ఇలా అన్ని పనులూ స్వయంగా చేశాను. ఆ క్రమంలో ఎన్నో ఇబ్బందులు, అవహేళనలు ఎదుర్కొన్నాను. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లభించకపోవడంతో... ప్రైవేటు సంస్థల దగ్గర అప్పులు తీసుకోవాల్సి వచ్చింది. అయినా ఏ దశలోనూ నా ధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోలేదు.

### వారి సంతోషం శక్తినిస్తోంది...

కరోనా ఆంక్షల్ని పూర్తిగా ఎత్తేసిన తరువాత... మా వ్యాపారం నిలదొక్కుకుంది. ఉత్పత్తుల సంఖ్యను కూడా పెంచాను. వాటిలో రకరకాల బియ్యం, పసుపు, అల్లం, వెల్లుల్లి, కూరగాయలు... ఇలా 70కి పైగా ఉత్పత్తులను విక్రయిస్తున్నాం. ఇప్పుడు వందమందికి పైగా రైతులు మా గ్రూప్‌లో భాగస్వాములు. వారికి సంతృప్తికరమైన ధరలతో పాటు లాభాల్లో వాటా కూడా ఇస్తున్నాం. తొలి ఏడాదే మా టర్నోవర్ రూ.50 లక్షలకు చేరింది. మరుసటి ఏడాది రెట్టింపు అయింది. ఒడిశాలోని పలు ప్రాంతాల రైతులు ఇప్పుడు మాతో చేరుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త వ్యవసాయ ఉత్పత్తులు మా జాబితాలో చోటు చేసుకుంటున్నాయి. రైతులు పడిన శ్రమకు తగిన ఫలితం దక్కినప్పుడు... వారి ముఖాల్లో కనిపించే సంతోషం నాకు ఎంతో శక్తిని అందిస్తోంది. రాబోయే నాలుగేళ్ళలో... పది జిల్లాల నుంచి కనీసం 50 వేల మంది రైతులను మా గ్రూప్‌లో భాగస్వాములను చెయ్యడం, 250కి పైగా ఉత్పత్తులను వారి నుంచి సేకరించి విక్రయించడం లక్ష్యంగా పెట్టుకున్నాను."




# యూట్యూబ్ 'ఇంగ్లీష్' స్టార్

**ఓ పల్లెటూరి పడుచు... రోజు కూలీ ఇల్లాలు... యూట్యూబ్‌లో ఇంగ్లీష్ పాఠాలు చెబుతోంది. అంతంతమాత్రమే చదివినా... నెట్టింట తనకు తానుగా నేర్చుకుని... 'దేహతి మేడమ్'గా నేడు ఎందరికో భాషపై భయం పోగొడుతోంది. మంచాన పడ్డ భర్త... వయసు మీరిన అత్తమామ... కుటుంబ భారం భుజానికెత్తుకుని... ఆంగ్ల పాఠాలనే ఆదాయ వనరుగా మలచుకున్న యశోదా లోధి కథ ఇది.**

"పెద్దగా చదువుకోని ఓ పల్లెటూరి అమ్మాయి... ఇవాళ మీ ముందు ఇలా నిలబడిందంటే అందుకు ప్రధాన కారణం మా కుటుంబ పరిస్థితులు. ఉత్తరప్రదేశ్ కౌశంబీజిల్లా సిరాతూ మాది. ఆర్థిక స్థోమత లేక పన్నెండో తరగతితోనే నా చదువు ఆగిపోయింది. తరువాత... 2016లో ఇంట్లోవాళ్ళు నాకు పెళ్ళి చేశారు. నా భర్త రాధే... రోజు కూలీ. తను పనికి వెళితే రోజుకు మూడు వందల రూపాయలు వచ్చేది. ఆరుగురు సంతానంలో ఆయనే పెద్ద. ఆయనకు వచ్చేదాంట్లోనే మేమంతా బతకాలి. ఆ డబ్బు ఏ మూలకూ సరిపోయేది కాదు. కష్టమైనా తినీ తినక నెట్టుకొచ్చాం. కానీ ఆ విధి మాకు మరింత విషమ పరీక్షలు పెట్టింది. 2020 డిసెంబర్... కొవిడ్ సమయం... పని మీద బయటకు వెళ్ళిన నా భర్త రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యానికి అధికమొత్తంలో వెచ్చించాల్సి వచ్చింది. ఇంట్లో చూస్తే తిండికి కూడా పైసా లేదు. ఏంచేయాలో దిక్కుతోచలేదు. వైద్య ఖర్చుల కోసం మా మామ మాణిక్‌చంద్ ఐదు లక్షల రూపాయల అప్పు తీసుకున్నారు. అప్పటికి గండం నుంచి గట్టెక్కాము.

### అండగా నిలవాలని...

మా మామయ్య అప్పు అయితే తీసుకున్నారు కానీ, దాన్ని తిరిగి చెల్లించే పరిస్థితి లేదు. ఆ సమయంలో నేనే ఏదో ఒకటి చేసి, కుటుంబానికి అండగా నిలవాలనుకున్నాను. ఏంచేయాలని ఆలోచిస్తుంటే... యూట్యూబ్ ద్వారా డబ్బు సంపాదించవచ్చని ఎవరో చెప్పుకొంటుంటే విన్నాను. కానీ ఎలా? నేను అప్పటి వరకు స్మార్ట్ ఫోన్ ముఖం చూసి ఎరుగను. ఇక వీడియోలు తీసి, వాటిని అప్‌లోడ్ చేయడం నావల్ల అయ్యే పనేనా? ఆలోచించేంత సమయం కూడా నా దగ్గర లేదు.

### మూడు నెలలు...

వెంటనే పని ప్రారంభించాలని మావారిని స్మార్ట్ ఫోన్ కొనివ్వమని అడిగాను. ఆయనకు అంత స్థోమత లేదని తెలుసు. అదే చెప్పారు. ఎలాగో నచ్చజెప్పి ఒప్పించాను. ఎక్కడో అప్పు చేసి నాకు ఒక స్మార్ట్ ఫోన్ కొని ఇచ్చారు. మూడు నెలలు ఇంటర్నెట్‌లోనే గడిపాను. షూటింగ్, వీడియో ఎడిటింగ్ లాంటివన్నీ నేర్చుకున్నాను. కొంత నమ్మకం కుదిరింది. తొలుత నాకు వచ్చిన వంటలు వండి 'దేసీ కుకింగ్' అని యూట్యూబ్‌లో పెట్టాను. ఎంబ్రాయిడరీ గురించి చెప్పాను. పండుగలు, ఇతర శుభకార్యాలకు ఇంటిని ఎలా అలంకరించుకోవాలో నేర్పే వీడియోలు అప్‌లోడ్ చేశాను. అలా నాలుగు రకాల చానల్స్‌తో ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. వాటిని చూసేవారే కరువయ్యారు.

### ఇంగ్లీష్ నేర్చుకుని...

తీవ్ర నిరాశ, నిస్పృహ. మళ్ళీ ఆలోచనలో పడ్డాను. కానీ దీని నుంచి బయటకు రావాలనుకున్నాను. ప్రేరణ కోసం మోటివేషనల్ స్పీకర్స్ ప్రసంగాలు వినడం మొదలుపెట్టాను. వారందరూ ధారాళంగా ఇంగ్లీష్‌లో మాట్లాడడం నన్ను బాగా ఆకట్టుకుంది. అది సరికొత్త ఆలోచన రేకెత్తించింది. నాలాగా పల్లెటూరి నేపథ్యం నుంచి వచ్చిన చాలామందికి ఇంగ్లీష్ అంటే భయం. కొందరు ఆంగ్లంలో రాయగలిగినా మాట్లాడాలంటే జంకుతారు. ఆ భయం పోగొట్టాలంటే భాష మీద పట్టు రావాలి. దాన్ని ఒక పల్లెటూరు అమ్మాయిగా... సరళంగా నేర్పించగలిగితే నా చానల్‌కు తిరుగు ఉండదని అనుకున్నాను. కానీ నాకూ ఇంగ్లీష్ పెద్దగా రాదు. అందుకే యూట్యూబ్‌లో పాఠాలు పెట్టుకుని నేర్చుకున్నాను. గ్రామర్, సంభాషణలు... ఇలా అన్నిటినీ ఆకళింపు చేసుకున్నా.



### ప్రేరణ కల్పించి...

అలా గత ఏడాది 'ఇంగ్లీష్ విత్ దేహతి మేడమ్' పేరుతో యూట్యూబ్ చానల్ ఒకటి ప్రారంభించాను. చానల్ పేరు కింద నా గురించి రెండు లైన్ల పరిచయం ఉంటుంది. అది చాలామందిని ఆకర్షించింది. ఇంగ్లీష్ నేర్పే చానల్స్ యూట్యూబ్‌లో లెక్కలేనన్ని ఉన్నాయి. వాటిల్లో నా చానల్‌నే ఎందుకు చూడాలి? అందుకే కేవలం పాఠాలకే పరిమితం కాకుండా... ఇంగ్లీష్ ఎందుకు నేర్చుకోవాలో నెటిజనులకు చెబుతున్నాను. 'దేహతి'... అంటే 'ఏమీ తెలియని, పెద్దగా చదువుకోని ఒక పల్లెటూరి అమ్మాయి ఇవాళ మీ ముందు నిల్చొని ఇంగ్లీష్ బోధించగలుగుతుంది. నన్ను ప్రేరణగా తీసుకోండి. భయం వదిలేస్తే మీరూ నాలానే మాట్లాడగలరు. ఏ ఉద్యోగం చేయాలన్నా, ఉన్నత చదువులు చదవాలన్నా ఇంగ్లీష్ అవసరం ఎంతో ఉంది' అని నా చానల్‌కు వచ్చినవారిలో స్ఫూర్తి నింపుతూ వచ్చాను. ఇది విని చాలామంది భాష నేర్చుకోవడానికి ముందుకు వచ్చారు.

### మూడు లక్షలమంది...

తొలుత మా ప్రాంతంలోని మహిళలు ఆసక్తి చూపలేదు. ఇది తమవల్ల అయ్యే పని కాదనేది వాళ్ల భావన. ఆ సమయంలో మా ఆడపడచులు నాకు అండగా నిలిచారు. వాళ్లు నేర్చుకోవడం చూసి విఎగిలినవారు కూడా కదిలారు. క్రమంగా మా ఊళ్లో నేను గొప్ప ఇంగ్లీష్ పంతులమ్మగా పేరు తెచ్చుకున్నాను. ఇప్పుడు నేను ఇంగ్లీష్ గ్రామర్ చెప్పగలను. పెద్ద పెద్ద వాక్యనిర్మాణాలు సులువుగా నేర్పగలను. నా చానల్‌కు వచ్చినవారిలో స్ఫూర్తి నింపి, నిర్భయంగా మాట్లాడించగలను. ప్రస్తుతం నా చానల్‌కు మూడు లక్షలమందికి పైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. ఏడాది తిరక్కుండానే దాదాపు మూడు కోట్ల మంది నా కంటెంట్ వీక్షించారు. ఇప్పటివరకు మొత్తం 370 వీడియోలో పోస్ట్ చేశాను. వాటిల్లో చాలా వీడియోలను లక్షమందికి పైగా చూశారు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే... ఇది నేనేనా అనిపిస్తుంది.

### అప్పు తీర్చేశా...

యూట్యూబ్ ద్వారా నాకు మంచి ఆదాయం లభిస్తోంది. ఆ డబ్బుతో ఏ లోటూ లేకుండా మా కుటుంబం నడుస్తోంది. మావారి వైద్య ఖర్చుల కోసం మామయ్య తీసుకున్న ఐదు లక్షల అప్పు కూడా తీర్చగలిగాను. నాకు వచ్చిన విద్యను నలుగురితో పంచుకొంటూ... ఇంట్లో కూర్చొని సంపాదించగలుగుతున్నాను. సామాజిక మాధ్యమాలు వచ్చాక... ముఖ్యంగా యూట్యూబ్ నాలాంటి ఎంతోమంది గృహిణులకు దారి చూపుతోంది. సృజనాత్మకంగా... వినూత్న కంటెంట్‌తో వస్తే ఇక్కడ ఎవరినైనా విజయం వరిస్తుంది. పేదరికంలో మగ్గే ఒక రోజు కూలీ భార్యనైన నేను ఇవాళ నా కాళ్లపై నేను నిలబడగలిగాను. నా కథ ఏ ఒక్కరిలో స్ఫూర్తి నింపినా... అంతకు మించిన సంతృప్తి, సంతోషం నాకు మరెందులోనూ లభించవు."



# వంటింటి చిట్కాలు

- పుదీనా పచ్చడి చేసేప్పుడు కొద్దిగా పెరుగు కలిపితే రుచిగా ఉంటుంది.
- రాగిపాత్రలకు జిడ్డు వదలకుంటే ఉప్పులో నిమ్మకాయ రసం వేసి శుభ్రపరిస్తే చాలు.
- అరటిపండ్లు పాడవకుండా ఉంటాలంటే పాలిథీన్ కవర్‌లో చుట్టి ఉంచాలి. దీనివల్ల కనీసం రెండు, మూడు రోజులు అరటి పండ్లు నిల్వ ఉంటాయి.
- బెండకాయ కూర చేసే ముందు వాటిపై నిమ్మరసం పిండితే జిగురు ఉండదు.
- పచ్చి బఠానీలను ఉడికించేప్పుడు కొద్దిగా చక్కెర వేస్తే బఠానీల రంగు మారదు.
- కోడిగుడ్ల పెంకు బాగా రావాలంటే బియ్యం కడిగిన నీటిలో ఉడికిస్తే సరి.
- పంచదారలో చీమలు పట్టకుండా ఉండాలంటే ఆ డబ్బాలో రెండు లవంగాలు ఉంచితే సరి. చీమలు రావు.
- కాకరకాయలను ఫ్రిజ్‌లో ఉంచితే త్వరగా పాడవుతాయి అనుకుంటే వాటిని చక్రాలుగా కట్ చేసి ఫ్రిజ్‌లో నిల్వచేస్తే సరి ఎక్కువ రోజులు ఉంటాయి.
- బొంబాయి హల్వా రుచిగా ఉండాలంటే స్పూన్ శనగపిండి వేస్తే బావుంటుంది.

## నవ్య | చిత్రజ్యోతి

### ప్రతి టిక్కెట్ ధరనుంచి ఐదు రూపాయలు
# అయోధ్య రామ మందిరానికి

చిరంజీవి



'చరిత్రలో మైలురాయిగా నిలిచిపోయే ఘట్టం అయోధ్య రామమందిర నిర్మాణం. అటువంటి గొప్ప ఆలయ ప్రారంభోత్సవానికి నన్ను ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉంది. ఈ నెల 22న కుటుంబ సమేతంగా రామ మందిర ప్రారంభోత్సవానికి అయోధ్య వెళ్తున్నాను. ఈ 'హను-మాన్' సినిమాకు అమ్ముడుపోయిన ప్రతి టికెట్ నుంచి అయిదు రూపాయలు అయోధ్య రామమందిరానికి కానుకగా ఇవ్వనున్నట్టు నిర్మాత ప్రకటించారు. ఇది నిజంగా హర్షణీయం' అని చిరంజీవి అన్నారు. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చిరంజీవి అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 'అమ్మానాన్నల తర్వాత నేను అమితంగా ఆరాధించే దైవం హనుమాన్. ఇది ఆయన నేపథ్యంతో కూడిన సినిమా కావడం నేను రావడానికి తొలి కారణమైతే, నా ముందు డైపర్‌లు వేసుకునే స్థాయినుంచి డయాస్ ఎక్కి మాట్లాడే స్థాయికి వచ్చిన తేజా ఇందులో హీరో కావడం మరొక కారణం. దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఇంకో కారణం. హనుమ అంటే ఒక ఇన్‌స్పైరింగ్ పర్సనాలిటీ. థియేటర్లు తక్కువగా దొరికినా పర్లేదు. ఇది పరీక్షా సమయం. కంటెంట్ బావుంటే విజయాన్ని ఎవరూ ఆపలేరు' అని చిరంజీవి అన్నారు. 'చిరంజీవిగారు నా జీవితంలో లేకపోతే నేను ఇక్కడ ఉండేవాణ్ని కాదు. నన్ను హీరోగా నిలబెట్టిన ప్రశాంత్‌వర్మ ఈ సినిమాతో నన్ను సూపర్‌హీరోని చేశాడు. రామ్‌చరణ్‌కి రాజమౌళి, రవితేజకు పూరీజగన్నాథ్, ఈ తేజాకు ప్రశాంత్‌వర్మ అని సగర్వంగా చెబుతున్నా. నేను ఉత్సవవిగ్రహాన్ని మాత్రమే. మూలవిరాట్ ప్రశాంత్‌వర్మ..' అని హీరో తేజా అన్నారు. 'సినిమా తీయడం పెద్ద యుద్ధం. ఈ యుద్ధంలో నేను వాడిన ఆయుధం తేజా. అందరూ కష్టపడి పనిచేశారు. ఇది హనుమంతులవారి కథ కాదు. ఒక సామాన్యుడికి ఆంజనేయ శక్తులొస్తే ధర్మంకోసం ఎలా పోరాడాడు అనేది ఈ కథ' అని దర్శకుడు ప్రశాంత్ వర్మ చెప్పారు. ఇంకా నిర్మాత నిరంజన్‌రెడ్డి, వరలక్ష్మి శరత్‌కుమార్, అమృత అయ్యర్, తదితరులు మాట్లాడారు.

## నేను ఉద్వేగపూరితంగా చేసిన సినిమాలన్నీ హిట్




నా తొలి సినిమా నుంచే వైజాగ్‌తో విడదీయరాని అనుబంధం ఏర్పడిపోయింది. నా 75వ సినిమా ఎమోషనల్ మూవీ కావడం ఆనందంగా ఉంది. నేను ఉద్వేగపూరితంగా నటించిన శత్రువు, ధర్మచక్రం, గణేశ్.. ఇలా ప్రతి సినిమా హిట్. ఇది కూడా పక్కా హిట్' అని వెంకటేశ్ నమ్మకం వ్యక్తం చేశారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకుడు. వెంకట్ బోయనపల్లి నిర్మాత. ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ వైజాగ్‌లో జరిగింది. డైరెక్టర్ మాట్లాడుతూ 'ఇప్పటివరకూ చూడని కొత్త వెంకటేశ్‌ని ఇందులో చూస్తారు. ఈ సినిమా తర్వాత వెంకీ అభిమానిని అయిపోయాను. వెంకటేశ్‌గారి 75వ సినిమాను దర్శకత్వం చేసే అవకాశం రావడం నా అదృష్టం. అందరం ప్రాణంపెట్టి పనిచేశాం' అని అన్నారు. ఇంకా చిత్ర బృందం పాల్గొన్నారు.

## హార్ట్‌బీట్ పెంచే గుంటూరుకారం



భారీ అంచనాల మధ్య సంక్రాంతికి విడుదల అవుతున్న సినిమా మహేశ్‌బాబు 'గుంటూరు కారం'. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు చెందిన థియేట్రికల్ ట్రైలర్‌ని అట్టహాసంగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ సినిమా బ్లాక్‌బాస్టర్ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందనే నమ్మకాన్ని పెంచిందని, అభిమానుల హార్ట్‌బీట్ పెంచేలా, మనసునిండా ఆనందం నిండేలా ఈ ట్రైలర్‌ని కట్ చేశారని, ట్రైలర్‌లో భావోద్వేగాలతో కూడిన సన్నివేశాలు సినిమా కథను ప్రతిబింబిస్తున్నాయని చిత్రబృందం తెలిపింది. మహేశ్‌బాబు నటన, త్రివిక్రమ్ దర్శకత్వ శైలి, ఆయన సంభాషణలు ఈ సినిమా విజయానికి ప్రధాన పాత్ర పోషించనున్నాయని ఈ సందర్భంగా వారు చెప్పారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్యకృష్ణ, ప్రకాశ్‌రాజ్, జయరామ్ ఇతర ముఖ్య తారలు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎస్.థమన్.

## ట్రెండ్ సెట్ చేసే గ్యాంగ్‌స్టర్ డ్రామా



ఇండియన్ స్ర్కీన్‌పై ఇప్పటివరకూ వచ్చిన మాఫియా నేపథ్య కథలకు పూర్తి భిన్నంగా పవన్‌కల్యాణ్ 'ఓజీ' కథ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. గ్యాగ్‌స్టర్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ కేరక్టరైజేషన్ ఊహలకు అందని విధంగా ఉంటుందని, అత్యంత శక్తివంతంగా ఆయన పాత్రను దర్శకుడు సుజిత్ డిజైన్ చేశారని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న నటుడు వెంకట్ మాట్లాడుతూ 'పవర్‌స్టార్ అభిమానులకు 'ఓజీ' విందుభోజనం లాంటి సినిమా. ఇందులో మంచి పాత్ర చేస్తున్నాను. 'అన్నయ్య' సినిమాలో చిరంజీవిగారి తమ్ముడిగా నటించిన నేను ఈ సినిమాలో పవన్‌కల్యాణ్‌తో కలిసి నటిస్తుంటే 23ఏళ్ల క్రితం 'అన్నయ్య' రోజులు గుర్తొస్తున్నాయి. ఇందులో కొన్ని సీన్స్ అభిమానులకు గూజ్‌బమ్స్ తెప్పిస్తాయి. టాలీవుడ్‌లో ఈ సినిమా కొత్త ట్రెండ్ సృష్టిస్తుంది' అని తెలిపారు. జపాన్, ముంబై నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందని సమాచారం. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రీయారెడ్డి, ప్రకాశ్‌రాజ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాత: డీవీవీ దానయ్య, నిర్మాణం: డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్.

## కామెడీని ఎంజాయ్ చేస్తారు



చంద్రశేఖర్, సోనాలి జంటగా కే సంతోష్‌బాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం "ప్లాంట్ మాన్". పన్నారాయల్ దర్శకత్వ పర్యవేక్షణ చేస్తూ నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'చిన్న సినిమాకు పెద్ద విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈ చిత్రంలో కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రోజురోజుకూ వసూళ్లు పెరుగుతున్నాయి' అన్నారు. పన్నారాయల్ మాట్లాడుతూ 'నేను నిర్మాతగా చేసిన తొలి చిత్రమే హిట్ టాక్ తెచ్చుకున్నందుకు ఆనందంగా ఉంది. ఇంత సక్సెస్‌ను నేను ఊహించలేదు. ఈ ఉత్సాహంతో ఏటా రెండు సినిమాలు చేస్తాను' అని చెప్పారు. మంచి సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని సోనాలి తెలిపారు.

## ప్రేమలో కొత్త కోణం



'అథర్వ' ఫేమ్ కార్తిక్ రాజు, మోక్ష, షెరీ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'ఐ హేట్ యూ'. అంజిరామ్ దర్శకత్వంలో నాగరాజు నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 'మా 'ఐ హేట్ యూ' చిత్రం వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కింది. ప్రేమలో కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సాకార్. సినిమాటోగ్రఫీ: ఎస్. మురళీ మోహన్ రెడ్డి.



విజయవాడ పీబీ సిద్ధార్థ కాలేజీ మైదానంలో అందమైన రంగవల్లులు



ప్రకాశం జిల్లా గిద్దలూరులో నిర్వహించిన పోటీలకు హాజరై ముగ్గులు వేస్తున్న మహిళలు

# అవనిపై అందాల హరివిల్లు

- ఉత్సాహంగా "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు, యువతులు, విద్యార్థినులు
- ఏపీ, తమిళనాడు, కర్ణాటక విజేతలకు 11న విజయవాడలో ఫైనల్స్
- తెలంగాణలో ఉమ్మడి జిల్లాల విజేతలకు 10న హైదరాబాద్‌లో...

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన) రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటకల్లోని 83 కేంద్రాల్లో జనవరి 5, 6, 7 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో పాల్గొని తమ రంగవల్లులతో సంక్రాంతి శోభను ఇనుమడింపజేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ బహుమతి రూ.6,000, ద్వితీయ బహుమతి రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తో పాటు అనేక కన్సొలేషన్ బహుమతుల్ని మహిళలు గెల్చుకున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి ఎంపికైన పది మంది మహిళలకు ఈ నెల 10న హైదరాబాద్‌లో ఫైనల్ పోటీలు జరుగుతాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని 13 పాత జిల్లాలు, తమిళనాడు, కర్ణాటకల నుంచి ఒక్కొక్కరు చొప్పునమొత్తం 15మందికి ఈ నెల 11న విజయవాడలో ఫైనల్స్ జరుగుతాయి. ఫైనలిస్టులకు రూ.1,70,000కు పైగా బహుమతులు, ఇంకా గిఫ్ట్ హ్యాంపర్లు లభిస్తాయి.

## ముందే వచ్చిన సంక్రాంతి

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం, అనంతపురం కేంద్రాల్లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో అత్యధికంగా 466 మంది మహిళలు, యువతులు పాల్గొన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి, ఆయన సోదరి గారపాటి లోకేశ్వరి హాజరై ముగ్గులను తిలకించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. పెద్దసంఖ్యలో మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు అత్యద్భుతంగా తీర్చిదిద్దిన రంగవల్లులతో సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్టయింది. అనంతపురం తర్వాత అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 239 మంది, విశాఖపట్నం జిల్లాలో 226 మంది, ప్రకాశం జిల్లాలో 230 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 160 మంది, శ్రీకాకుళంలో వందమందికి పైగా ఈ పోటీలకు హాజరయ్యారు. విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విజేతలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు నగదు బహుమతులు అందించారు. మిగిలిన జిల్లాలోనూ ముగ్గుల పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి.



# చర్చల పేరుతో ఎన్నాళ్లీ కాలయాపన?

- ప్రభుత్వంపై మున్సిపల్ కార్మికుల మండిపాటు
- 13వ రోజూ కొనసాగిన సమ్మె
- అనంతపురం, సాలూరులలో సర్వమత ప్రార్థనలు
- ఆత్మకూరులో భిక్షాటన.. కావలిలో పొర్లుదండాలు
- పార్వతీపురం, పాలకొండలలో రాస్తారోకో, మానవహారం



అనంతపురంలో సర్వమత ప్రార్థనలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

చర్చల పేరుతో ప్రభుత్వం ఎన్నాళ్లు కాలయాపన చేస్తుందని మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 13వ రోజూ(ఆదివారం) కొనసాగింది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, మున్సిపల్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు చేసి నిరసన తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గడ్డి తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు పాతబస్టాండ్ కూడలి వద్ద రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పాలకొండలోని చెక్‌పోస్టు సెంటర్‌లో పారిశుధ్య కార్మికులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

## ఏసయ్యా.. నువ్వైనా చెప్పయ్యా..!

'ఏసయ్యా... జగన్ మనసు మార్చు' అంటూ నెల్లూరులోని కపాడిపాళెం వద్ద ఉన్న క్యాథలిక్ మిషన్ చర్చిలో మున్సిపల్ కార్మికులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 'ఏసయ్యా..మా సమస్యలు పరిష్కరించమని నువ్వైన్నా చెప్పయ్యా..!' అంటూ ఏసుక్రీస్తును వేడుకున్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కావలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పొర్లుదండాలతో నిరసన తెలిపారు.

# వచ్చే ఎన్నికల్లో జగన్ ఇంటికే!





విజయవాడ ధర్నాచౌక్‌లోని అంగన్వాడీల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం నేత బీవీ రాఘవులు, వినదిస్తున్న అంగన్వాడీలు

- ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే జరిగేదిదే
- అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం సరికాదు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ధ్వజం
- బెజవాడలో అంగన్వాడీ, మున్సిపల్ దీక్షా శిబిరాల సందర్శన
- 27వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- రాష్ట్రవ్యాప్తంగా ఎస్మా ప్రతుల దహనం
- అనంతలో వైసీపీ బస్సుయాత్రకు అంగన్వాడీల నిరసన సెగ
- పశ్చిమగోదావరిలో జీవో కాపీలతో కాగితపు పడవలు తయార్
- ఉరవకొండలో తోపులాట.. స్పృహతప్పిన అంగన్వాడీ కార్యకర్త

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

"వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా వివిధ రంగాల కార్మికులకు వేతనాలు పెంచకుండా, వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపడం ఖాయం' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ధ్వజమెత్తారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ ధర్నాచౌక్‌లో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికుల దీక్షా శిబిరాలను ఆదివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. అమ్మలు, అక్కలు, చెల్లెళ్లు అని మాట్లాడే సీఎం జగన్ అంగన్వాడీలను నడిరోడ్డుపై పడేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడంతో ఇది రాష్ట్రవ్యాప్త సమస్యగా మారిందన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారి గొంతు నొక్కడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కార్యాలయాల అభివృద్ధి పేరుతో భారీగా డబ్బులు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు ఎందుకు వెనకాడుతోందని ప్రశ్నించారు. కార్మికుల ఉద్యమాల్లో సీపీఎం కూడా భాగస్వామ్యం అవుతుందన్నారు. కాగా, అంగన్వాడీల సమ్మె 27వ రోజు(ఆదివారం) కూడా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగింది. అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు నిరసన సెగ తగిలింది. ఆదివారం ఉరవకొండ టవర్‌క్లాక్ కూడలిలో ఏర్పాటు చేసిన సామాజిక సాధికార సభ వద్దకు బస్సుయాత్ర చేరుకుంటుండగా పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీలు అడ్డుకునేందుకు యత్నించారు. అంగన్వాడీలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. తోపులాటలో అంగన్‌వాడీ కార్యకర్త ధనలక్ష్మి స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే ఆమెను ఉరవకొండ ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అలాగే జీవో నంబర్-2 ప్రతులను అంగన్వాడీలు దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు వ్యతిరేకంగా అంగన్వాడీలు నినాదాలు చేశారు. ఏలూరు జిల్లాలోనూ చాట్రాయి, బుట్టాయిగూడెం, ఉంగుటూరు, కుక్కునూరు, తదితర ప్రాంతాల్లో ఎస్మా జీవో ప్రతులను అంగన్వాడీలు దహనం చేసి నిరసన తెలిపారు. ఏలూరు, చింతలపూడి, మండవల్లి, లింగపాలెం, కలిదిండి, ముదినేపల్లి తదితర ప్రాంతాల్లోనూ అంగన్వాడీలు నిరసన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహించారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని అంగన్వాడీలు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాలోనూ ఎస్మా ప్రతులను అంగన్వాడీలు దహనం చేశారు. ముందుగా నెల్లూరు నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద అంగన్వాడీలు, సీఐటీయూ నాయకులు ఎస్మా పత్రాలను దహనం చేశారు. అలాగే కావలి, కందుకూరులలో కూడా ఎస్మా ప్రతులను కాల్చివేశారు. తిరుపతి జిల్లాలోనూ తిరుపతి, గూడూరు ప్రాంతాల్లో ఎస్మా జీవో ప్రతులను తగులబెట్టారు. తిరుపతిలో నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేయగా, గూడూరులో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు పట్టణాల్లోనూ కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కోట, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, చంద్రగిరి, పిచ్చాటూరుల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులో జీవో కాపీలతో కాగితపు పడవలు తయారు చేసి గ్రామంలోని చెరువులో వదిలారు. పార్వతీపురం మన్యం జిల్లావ్యాప్తంగానూ ఎస్మా అమలు జీవో కాపీలను దహనం చేశారు. అంగన్వాడీలకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

# ఓట్ల అక్రమాలకు కళ్లెం వేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)



కలిపి ఈసీ బృందం మొత్తం మూడ్రోజులు పర్యటిస్తుంది. 9వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు రాజకీయ పార్టీలతో సమావేశమవుతుంది. అనంతరం ఓటర్ల జాబితాల్లోని తప్పిదాలు, పార్టీల ఫిర్యాదులు, ఎన్నికలకు ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముకేశ్‌కుమార్ మీనా, జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహిస్తారు. 10వ తేదీన ఎన్నికల సన్నద్ధత, ఓటర్ల జాబితా, ఏర్పాట్లపై సీఈవో ప్రజంటేషన్ ఇస్తారు. అనంతరం రాష్ట్రంలోని కేంద్ర విభాగాలకు సంబంధించిన అధికారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డీజీపీ సహా ఎన్నికలతో సంబంధం ఉన్న వివిధ శాఖల కార్యదర్శులతో ఈసీ బృందం భేటీ అవుతుంది. సాయంత్రం 4.30 గంటలకు విలేకరుల సమావేశం నిర్వహిస్తుంది. అనంతరం ప్రధాన కమిషనర్, కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు ఢిల్లీ బయల్దేరతారు. గతంలో ఎన్నడూ లేని విధంగా, ఏ రాష్ట్రం నుంచి వెళ్లనన్ని ఫిర్యాదులు.. ఆంధ్రప్రదేశ్ ఓటర్ల జాబితాల్లో జరిగిన అవకతవకలపై ఈసీకి వెళ్లిన సంగతి తెలిసిందే. కింది స్థాయిలో కొందరు ఎన్నికల అధికారులు పదే పదే ఈసీ ఆదేశాలను, నిబంధనలను తుంగలో తొక్కి.. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించి ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు కమిషన్ దృష్టికి వెళ్లాయి. మాజీ సీఎం, ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబు స్వయంగా రెండు సార్లు ఢిల్లీ వెళ్లి ఈసీకి కంప్లయింట్ చేశారు. ఇతర ప్రతిపక్షాలు కూడా పెద్దఎత్తున ఫిర్యాదు చేశాయి. వీటన్నిటి భరతం భరతం పట్టేందుకే ప్రధాన కమిషనర్, కమిషనర్లు వస్తున్నారని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

## తప్పుల కుప్పలు..

రాష్ట్రంలో ఓటర్ల జాబితాల్లో గతంలో ఎన్నడూ జరగనన్ని అవకతవకలు జరిగాయి. 2024 ముసాయిదా ఓటర్ల జాబితాను తప్పులతడకగా రూపొందించారు. చాలాచోట్ల అధికారులు పాలక పక్షంతో కుమ్మక్కై ప్రతిపక్ష సానుభూతిపరుల ఓట్లు తొలగించారు. మృతుల ఓట్లు కొనసాగించారు. ఒకే డోరు నంబరుతో వందలు, వేల దొంగ ఓట్లు చేర్పించారు. వీటిని తొలగించకుండానే ముసాయిదా విడుదల చేయడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచాలని ఈసీ ఆదేశించినా ఎక్కడా అమలు కావడం లేదు. బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) క్షేత్ర స్థాయి పరిశీలనలు చేయడం లేదు. ఒకవేళ వెళ్లినా వలంటీర్లను వెంటబెట్టుకుని వెళ్తున్నారు. వైసీపీ నేతల ఇళ్లలో మకాం వేసి ఇష్టానుసారం ఓటర్ల తొలగింపు, చేర్పులు చేస్తున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సీఈవోకి 8 జిల్లాల కలెక్టర్లపై ఫిర్యాదు చేశారు. ఒకే డోర్ నంబర్లపై వందల సంఖ్యలో ఓట్లు ఉండడం, ప్రతిపక్షాల ఓట్లు తీసేయడానికి వైసీపీ నాయకులు ఆన్‌లైన్లో వందల కొద్దీ ఫాం-7 దరఖాస్తులు సమర్పించడం. పలు చోట్ల ఎన్నికల అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాసి ప్రతిపక్షాల ఓట్లు తీసేయడంతో.. వలంటీర్లను, గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందిని ఎన్నికల ప్రక్రియకు దూరం ఉంచాలంటూ సిటిజెన్స్ ఫోరం ఫర్ డెమోక్రసీ (సీఎఫ్‌డీ) తరఫున రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఎన్ని ఫిర్యాదులు చేసినా పలువురు కింది స్థాయి ఎన్నికల అధికారుల తీరు మారలేదు. ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించి ఈ నెల 22 తేదీన విడుదల చేసే తుది ఓటర్ల జాబితా-2024 తప్పులతడకగా లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషన్‌దేనని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషనర్లు.. రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఏ విధమైన ఆదేశాలిస్తారో చూడాలి.



కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ నివాసానికి వచ్చారు. తన కుమారుడి వివాహానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

# మొరాయిస్తున్న ఏపీపీఎస్సీ వెబ్‌సైట్

- ఫీజు చెల్లించే సమయంలో ఎర్రర్
- తిరిగి వారానికి అభ్యర్థుల ఖాతాల్లోకి నగదు




అమరావతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఏపీపీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు చుక్కలు చూపిస్తాయి! కానీ పరీక్ష కంటే ముందు దరఖాస్తు చేసుకోవడానికే ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తోంది. గత నెలలో ఏపీపీఎస్సీ గ్రూప్1, 2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీచేసింది. గ్రూప్ 2 నోటిఫికేషన్‌కు డిసెంబరు 21 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈనెల 10 చివరి తేదీ. ఇందుకోసం వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు సమర్పించిన తర్వాత చివర్లో ఫీజు చెల్లించాలి. సరిగ్గా ఫీజు చెల్లించాల్సిన సమయంలో వెబ్‌సైట్‌లో ఎర్రర్ మెసేజ్ ప్రత్యక్షమవుతోంది. దీంతో దరఖాస్తు ప్రక్రియను అక్కడి నుంచి మళ్లీ మొదలుపెట్టాల్సి వస్తోంది. కొంతమంది అభ్యర్థులు పదే పదే ప్రయత్నించినా దరఖాస్తు సబ్మిట్ కావట్లేదు. మరోవైపు దరఖాస్తు తీసుకోకపోయినా అభ్యర్థుల ఖాతాల నుంచి నగదు కట్ అవుతోంది. వారం రోజుల తర్వాత గానీ ఆ నగదు తిరిగి ఖాతాలకు చేరడం లేదు. గ్రూప్1 దరఖాస్తులకు కూడా ఇదే సమస్య తలెత్తుతోంది. అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నా ఏపీపీఎస్సీ మాత్రం ఎప్పటిలాగే మౌనం వహిస్తోంది. కాగా, గ్రూప్1 నోటిఫికేషన్‌కు ఈనెల 21 వరకు గడువు ఉంది. సామర్థ్యమున్న సర్వర్లను వినియోగించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతున్నట్లు తెలిసింది.

# నిన్ను లేపేస్తా.. నీ ఆఫీస్ లేకుండా చేస్తా!

- జనసేన కార్యకర్తపై వైసీపీ కార్పొరేటర్ దౌర్జన్యం
- భర్త, కొడుకుతో కలిసి చితకబాదిన వైనం
- అందరూ చూస్తుండగానే విచక్షణరహితంగా దాడి
- గతంలో చంద్రబాబు సభలో కార్పొరేటర్ భర్త చోరీ
- తాజాగా తిరువూరు సభలో ప్రత్యక్షం
- దీనిపై మీ వస్తువులు జాగ్రత్తంటూ.. జనసేన కార్యకర్త పోస్టు.. పిలిపించి మరీ దాడి..
- గాయాలతో స్టేషన్‌కు వెళ్లిన బాధితుడు





బాధితుడు గౌరీశంకర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు, తల, పొట్ట, కంటిపై గాయాన్ని చూపుతున్న బాధితుడు

విజయవాడ(చిట్టినగర్), జనవరి 7: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 47వ డివిజన్‌కు చెందిన జనసేన కార్యకర్తపై.. వైసీపీ కార్పొరేటర్ గోదావరి గంగ దౌర్జన్యం చేసి ఆమె భర్త బాబు, కొడుకుతో కలిసి దాడికి దిగింది. ప్రజలందరూ చూస్తుండగానే బహిరంగంగా 'డివిజన్‌లో నీ ఆఫీస్‌ను, నిన్నూ లేకుండా చేస్తా'నంటూ బెదిరించింది. ఇటీవల చంద్రబాబు నాయుడు జైలు నుంచి బయటకు వస్తున్న సందర్భంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కార్పొరేటర్ భర్త గోదావరి బాబు.. ముఖానికి క్లాత్ కట్టుకొని ఓ వ్యక్తి జేబులో నుంచి రూ.20 వేల నగదు దొంగిలిస్తుండగా బాధితుడు పట్టుకున్నాడు. బాబును చితకబాది పోలీసులకు అప్పగించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తిరువూరులో జరుగుతున్న టీడీపీ 'రా కదిలిరా' సభ ప్రాంగణంలో గోదావరి బాబు కనిపించడంతో.. '47వ డివిజన్ కార్పొరేటర్ భర్త గోదావరి బాబు సభలో ఉన్నాడు. జనసేన, టీడీపీ కార్యకర్తలు నాయకులు మీ విలువైన వస్తువులు, బంగారం, జేబులో డబ్బులు జాగ్రత్తగా దాచుకోండి' అంటూ జనసేన కార్యకర్త గౌరీశంకర్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. అది వైరల్ కావడంతో ఆగ్రహించిన కార్పొరేటర్ గోదావరి గంగ, ఆమె భర్త బాబు.. గౌరీశంకర్‌కు ఫోన్ చేశారు. 'నీతో మాట్లాడాలి.. కలరా హాస్పటల్ వద్దకు రా' అని చెప్పారు. అక్కడికి వెళిన గౌరీశంకర్‌పై కార్పొరేటర్ గంగ, ఆమె భర్త బాబు, కొడుకు బూతు పురాణం అందుకున్నారు. 'మా గురించి ఎందుకు పోస్ట్ పెట్టావు, మా వృత్తి మమ్మల్ని చేసుకోనివ్వవా' అంటూ గౌరీశంకర్‌ను కిందపడేసి గోదావరి గంగ కాళ్లతో తన్నగా.. బాబు ఆయన, కొడుకు అక్కడే అరటిపండ్ల బండి వద్ద ఉన్న బ్యాటరీ లైట్‌తో, త్రాసుతో విచక్షణ రహితంగా తలపై, పొట్టపై రక్తపు గాయాలయ్యేలా తీవ్రంగా గాయపర్చారు. అక్కడి నుంచి తప్పించుకొని రక్తపు గాయాలతో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న గౌరీశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనను చంపేందుకు ప్రయత్నించారని, రాడ్డు, కత్తితో దాడి చేసి గాయపర్చారని నిందితులపై ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని, లేకుంటే తీవ్రస్థాయిలో ఆందోళన చేస్తామని తెలిపారు. బాధితుడ్ని పోలీస్ స్టేషన్ వద్ద జనసేన నగర అధ్యక్షుడు పోతిన మహేష్ కలిశారు. వివరాలు తెలుసుకొని కమిషనర్‌తోనూ, సీఐతోనూ మాట్లాడారు. అధికార వైసీపీ ఈ విధంగా జనసేన కార్యకర్తలపై దాడులకు తెగబడుతోందని, ఎన్నో దొంగతనాల కేసులున్నా పోలీసులు సైతం అధికార పార్టీ కార్పొరేటర్ కావడంతో పట్టించుకోవడంలేదని ఆరోపించారు. బాధితుడికి న్యాయం జరగకపోతే తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# రేపు సీఈసీతో బాబు, పవన్ భేటీ

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ ఈ నెల 9వ తేదీన విజయవాడలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ)తో సమావేశం కానున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నొవాటెల్ హోటల్లో ఈసీ నిర్వహించే భేటీకి వీరిద్దరూ హాజరవుతారు. ఎన్నికల ఏర్పాట్లలో లోపాలు, రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో లోపాలు, ఓట్లను గంపగుత్తగా తొలగించేందుకు ఫాం-7 దరఖాస్తులు, జాబితా తయారీలో వలంటీర్ల జోక్యం వంటి అక్రమాలపై ఫిర్యాదు చేస్తారు. ముఖ్యంగా వలంటీర్లను, సచివాలయాల సిబ్బందిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచి.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను ఎన్నికల విధుల్లో ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నారు.

## వెంకటగిరి సభ వాయిదా..

వాస్తవానికి మంగళవారం చంద్రబాబు వెంకటగిరి, ఆళ్లగడ్డల్లో నిర్వహించనున్న 'రా కదలి రా' సభలకు హాజరు కావలసి ఉంది. ఎన్నికల కమిషనర్లతో భేటీ ఉన్నందున వెంకటగిరి సభను వాయిదా వేశారు. అయితే సాయంత్రం ఆళ్లగడ్డ సభకు ఆయన హాజరవుతారు.

## జనం వెళ్లిపోయారుగా.. సభను ముగించాం..!

- మంత్రులు మాట్లాడకుండానే ముగిసిన వైసీపీ సాధికారిత సభ
- తూర్పుగోదావరి జిల్లా రాజానగరం కోరుకొండలో చేదు అనుభవం


ఖాళీ కుర్చీలతో ఉన్న వైసీపీ సాధికార సభ

రాజమహేంద్రవరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సామాజిక సాధికారిత బస్సు యాత్ర పేరిట ఆ పార్టీ నిర్వహిస్తున్న సభలు జనాలు లేక వెలవెలబోతున్నాయి. జనాలు వచ్చినా.. మంత్రులు మాట్లాడక ముందే వెనుదిరగడంతో వైసీపీ నేతలకు నిరాశే మిగులుతోంది. దీంతో జనంలేరు కాబట్టి సభను ముగిస్తున్నామని ప్రకటిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం కోరుకొండ మండలం పరిధిలోని బూరుగుపూడి గేట్ వద్ద ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన వైసీపీ సామాజిక సాధికారిత బస్సు యాత్ర సభ ఇలాగే ముగిసింది. ఈ సభ కోసం మధ్యాహ్నం 3 గంటల నుంచే జనాన్ని బస్సుల్లో తీసుకొచ్చారు. కానీ సభను 5 గంటల తర్వాత ప్రారంభించారు. దీంతో విసుగుచెందిన జనం సభ మధ్యలోనే ఇంటిదారి పట్టారు. ఒక మంత్రి, కొద్ది మంది నేతలు మాట్లాడేసరికి సభ ఖాళీ అవ్వడం మొదలైంది. సినీనటుడు ఆలీ మాట్లాడేసరికి మూడొంతులకు పైగా వెళ్లిపోయారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్‌చంద్రబోస్ ప్రసంగం మొదలవగానే వేదిక ముందు మొత్తం ఖాళీగా కనిపించింది. మంత్రులు చెల్లుబోయిన వేణు, తానేటి వనిత, తదితర నేతలంతా ఇంకా మాట్లాడాల్సి ఉంది. కానీ ఇంతలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మైక్ అందుకుని.. ఇప్పటికే నాలుగు గంటలు అయినందు వల్ల, ఇంకా మంత్రులు మాట్లాడవలసి ఉన్నప్పటికీ సభను ముగిస్తున్నామని చెప్పారు.

## 'లావు'కే మళ్లీ పేట ఎంపీ సీటివ్వాలి

- ఎమ్మెల్యే పించను సభలో ప్లకార్డుల ప్రదర్శన


ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులుకు మళ్లీ నరసరావుపేట సీటు కేటాయించాలంటూ ప్లకార్డుల ప్రదర్శన

రెంటచింతల, జనవరి 7: సౌమ్యుడు, వివాదరహితుడు, లోకసభ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు మళ్లీ నరసరావుపేట లోకసభ సీటే కేటాయించాలంటూ వైసీపీ లోకసభ కన్వీనర్ ఏరువ విజయభాస్కరరెడ్డి నేతృత్వంలో పలువురు మద్దతుదారులు ప్లకార్డులు చేతపట్టుకుని ఎమ్మెల్యే పీఆర్కే సభలో దర్శనమిచ్చారు. ఆదివారం పల్నాడు జిల్లా రెంటచింతల సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారంతా పాల్గొని లావుకు సీటు కేటాయించాలని, అధిష్ఠానం పునరాలోచన చేయాలని కోరారు. నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారమార్గాలను కనుగొనిన మేధావి లావు అని కొనియాడారు. దాచేపల్లి- మాచర్ల, నాగార్జున సాగర్-దావుపల్లి జాతీయ రహదారుల నిర్మాణంలో లావు పాత్ర ఎనలేనిదన్నారు. అయిదుగురు ఎమ్మెల్యేలు మద్దతిస్తుండగా లావు సీటు మార్చడం ఏంటని ప్రశ్నించారు.


తిరువూరులో 'రా కదిలిరా' సభకు హాజరైన జనం, చంద్రబాబు అభివాదం



## అసమర్థ మంత్రులు

రాష్ట్ర మంత్రులు అసమర్థులు.. బూతు రాజు అయితే ఎమ్మెల్యే, బూతు సామ్రాట్ అయితే మంత్రి పదవి.. నన్ను, పవన్ కల్యాణ్‌ను తిడితే ఎమ్మెల్యే టికెట్లు..! పెట్టుబడి అంటే కోడిగుడ్లు అన్న వ్యక్తి పరిశ్రమల మంత్రి. కోట్లు దోచుకున్న వ్యక్తి వ్యవసాయ మంత్రి.. గనులు వి ంగేసిన వ్యక్తి గనుల శాఖ మంత్రి. పబ్బుల్లో డాన్సులు వేసేవారు మహిళా సంక్షేమం గురించి మాట్లాడుతున్నారు. ఒకప్పుడు జగనన్న వదిలిన బాణం అన్నారు. ఇపుడు అదే బాణం జగన్ చుట్టూ తిరుగుతోంది. అది కూడా నేనే చేశానంట! ఇది ఎంత వరకు సమంజసం? టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచితంగా టిడ్కో ఇళ్లు ఇస్తాం. జగన్ గద్దెనెక్కగానే ఇళ్ల నిర్మాణం ఆగిపోయింది. టీడీపీ వచ్చాక పూర్తి చేసి ఉచితంగా అందజేస్తాం. జగన్ రాక్షస పాలనలో ఆక్వా రంగం అధోగతి పాలైంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రంగానికి రాయితీలిస్తాం.

# 3 నెలల్లో రైతురాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు. త్వరలోనే మన రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకొనే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. అధికారంలో నుంచి సైకో పోవాలన్నది తన కోరిక కాదని, అది ప్రజల కోరికని చెప్పారు. జగన్ రివర్స్ పాలనతో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కోలుకోలేని దెబ్బతీశాడని ధ్వజమెత్తారు. 'రా.. కదలిరా..' కార్యక్రమం తన కోసమో, పవన్ కోసమో, లోకేశ్ కోసమో కాదని.. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజల కోసమని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి కారణంగా 5 కోట్ల మంది జనాభా ఒక తరాన్ని నష్టపోవడం దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. ఇంకా ఏమన్నారంటే..

### నేనూ బాధితుడినే..

జగన్ పాలనలో ప్రజలే కాదు నేనూ బాధితుడినే.. కొంతమంది ఎక్కువ రోజులు జైల్లో ఉంటే, కొంతమంది తక్కువ రోజులు జైల్లో ఉన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ శాఖను మూసివేశారు. ధాన్యం రైతులు పూర్తిగా దగా పడ్డారు. ఉద్యానవన రైతులు రోడ్డెక్కారు. టమాటాకు, పొటాటోకు వ్యత్యాసం తెలియని వ్యక్తికి వ్యవసాయం గురించి ఏం తెలుస్తుంది? చివరికి ఇరిగేషన్ శాఖనూ మూసేశాడు. జగన్ పరిస్థితి తిక్కలోడు తిరునాళ్లకు వెళ్తే ఎక్కుడు దిగుడు అన్నట్లుగా ఉంది. ఈ అరాచక పాలనకు చరమగీతం పాడాలి.

జాతీయ హోదా పోలవరం ప్రాజెక్టును జగన్ గోదావరిలో కలిపేశాడు. సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసుకోవడానికి పట్టిసీమ ప్రాజెక్టును నిర్మించి, గోదావరి, కృష్ణా నదుల అనుసంధానిస్తే.. జగన్ పడుకోబెట్టేశాడు. వరద నీటిని వదిలేసి పోలవరం డయాఫ్రంవాల్‌ను దెబ్బతీశారు. కాఫర్‌డ్యాంల మధ్యకు నీటిని వదిలేశారు. ఫలితంగా గైడ్‌బండ్ కుంగిపోయింది. వాటి గురించి అడుగుతుంటే ఆంబోతు మంత్రి నోరేసుకుని అరుస్తున్నాడు. పోలవరం పూర్తి కావాలంటే జగన్ పోవాలి. రాష్ట్రంలో రైతులతోపాటు కాంట్రాక్టర్లూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జగన్ పాలనలో యువకులే ప్రధాన బాధితులు. యువతకు ఉపాధి కల్పించడానికి పెట్టుబడులు తీసుకురాలేదు. ఏటా జనవరి ఒకటో తేదీన ప్రకటిస్తానన్న జాబ్ కేలెండర్‌కు అతీగతీ లేదు. తాజాగా వచ్చిన ఓ సర్వే ప్రకారం పదేళ్లపాటు ఉద్యోగం లేకుండా ఉంటున్న యువత రాష్ట్రంలో 24 శాతం మంది ఉన్నారని తేలింది. జే బ్రాండ్లతో కల్తీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటూ వారి రక్తం తాగుతున్నాడు. ఒక్క మద్యంపైనే జగన్ రూ.20 వేల కోట్ల అప్పు చేశాడు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపైనా రూ.5-6 లక్షల భారాన్ని మోపాడు.


ఆచంటలో టీడీపీ కార్యకర్తల నినాదాలు

### బంగారు భవిష్యత్ బాధ్యత నాదే..

రాబోయే ఎన్నికల్లో జనసేన, టీడీపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్తా సైకిల్ ఎక్కాలి. టీడీపీ, జనసేన జెండాలు పట్టుకుని ఊరూరు తిరిగి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. యువత భవిష్యత్‌ను బంగారం చేసే బాధ్యత నేను తీసుకుంటా. రౌడీయిజం చేసి, డబ్బులు వెదజల్లి రాబోయే ఎన్నికల్లో గెలవాలని జగన్ భావిస్తున్నాడు. ఈ ఆటలు సాగనివ్వం. టీడీపీ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేసిన జగన్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. మేం అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం. జగన్ రంగులు, ఫొటోల పిచ్చోడు. ఎవరికో పుట్టిన బిడ్డకు తన పేరు పెట్టుకుంటాడు. టిడ్కో ఇళ్లను టీడీపీ నిర్మిస్తే వాటికి వైసీపీ రంగులు వేయించుకున్నాడు. రైతుల పొలాల్లో వేసిన సర్వే రాళ్లపైనా వైసీపీ రంగులు, జగన్ ఫొటోలు వేశారు. పట్టాదారు పుస్తకాలపై కూడా ఆయన ఫొటోలు.. ఇలా చేయడానికి జగన్.. ప్రజలకు నాన్న తరపు బంధువా, అమ్మ తరపున బంధువా, లేక దూరపు బంధువా? ప్రజలు ఎందుకు ప్రశ్నించడం లేదు. కేసు పెట్టి, జైలుకు పంపుతాడని భయపడుతున్నారు. జగన్‌ను ఓడించడమే కాకుండా ఇంతకంటే పెద్ద శిక్ష వేయాలి. మన ఇంట్లో చెత్తను మరొక ఇంట్లో వేస్తే బంగారం అవుతుందా అని ప్రశ్నించారు. ఇప్పుడు జగన్ అదే చేస్తున్నాడు. ఒక ఎమ్మెల్యేను మరో నియోజకవర్గానికి బదిలీ చేస్తున్నాడు. రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నాడు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత వైసీపీ నేతలు ఇంటి నుంచి బయటికి రారు. ఆ సమయంలో ఊళ్లకు ఊళ్లు ఏకమవుతాయి.

### రాయుడికి తత్వం బోధపడింది

క్రికెటర్ అంబటి రాయుడు ఫీల్డ్‌లోకి దిగకుండానే క్లీన్ బౌల్డ్ అయ్యారు. ఆయనకు రాజకీయాల మీద ఆసక్తి ఉండడంలో తప్పు లేదు. పోటీ చేయాలనుకోవడంలోనూ తప్పులేదు. వైసీపీలో చేరాడు.. పార్టీ కండువా వేసుకోగానే ఆయనకు జగన్ టికెట్ ఇస్తానన్నాడు. తర్వాత మరో వ్యక్తి కలిస్తే అతడికీ టికెట్ ఇస్తానన్నాడు. రాయుడికి తత్వం బోధపడింది.

### టీడీపీ నిచ్చెనలా..

తెలుగు ప్రజలు గ్లోబల్ సిటిజన్స్‌గా ఉండాలి. దీనికి టీడీపీ ఒక నిచ్చెనలా ఉంటుంది. యువతకు ఐటీ అనే ఆయుధాన్నిచ్చా. దాని ద్వారా తెలుగు వారు వివిధ దేశాల్లో వివిధ స్థాయి స్థిరపడ్డారు. ప్రజలకు ష్యూరిటీ-గ్యారెంటీ కోసమే సూపర్ సిక్స్‌ను ప్రకటించాం. రాష్ట్రంలో విధ్వంస పాలన సాగుతోంది. ప్రత్యేక హోదా కోసం కేంద్రం మెడలు వంచుతామని జగన్ చెప్పాడు. కానీ కేంద్రం ముందు తానే మెడలు వాల్చాడు. గడచిన నాలుగున్నరేళ్లలో పది రూపాయలు ఇచ్చి వంద రూపాయలు దోచుకున్నాడు. రైతుల అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. కౌలు రైతులు, రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానం. ఇలా విధ్వంసం సృష్టించిన జగన్మోహన్‌రెడ్డిని సాగనంపి టీడీపీ, జనసేన కూటమికి అండగా ఉండండి. స్వర్ణయుగం సృష్టిస్తాం.

### కాపు రిజర్వేషన్లు ఎత్తేశాడు..

టీడీపీ హయాంలో కాపులకు ఇచ్చిన రిజర్వేషన్లు జగన్ ఎత్తి వేశాడు. పది వేల కోట్లు వారికి కేటాయిస్తానన్నాడు. ఇవ్వకుండా మోసం చేశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను పూర్తిగా దగా చేసిన జగన్‌కు బుద్ధి చెప్పాలి. ఈయన విశ్వసనీయత లేని నాయకుడు. మద్యపాన నిషేధమన్నాడు. భూంభూం తెచ్చాడు. నాసి రకం మద్యం ధరలను పెంచేశాడు. విద్యుత్ చార్జీలు పెంచనన్నాడు. తొమ్మిదిసార్లు పెంచి ప్రజలను బాదేశాడు. మేమొచ్చాక యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం.

### నన్ను తిడితే టికెట్..

ఎదుటి వారిని తిట్టించడం, బూతులు మాట్లాడించడం రాజకీయం కాదు. ప్రజల్లో అభిమానం ఉన్న వారికి కాకుండా నన్ను, లోకేశ్‌ను తిట్టిన వారికి టికెట్లు ఇస్తున్నాడు. ఆయనే చేయించుకున్న సర్వేల్లో తన సినిమా అయిపోయిందని, ఇంటికి వెళ్లడం ఖాయమని తేలిపోయింది. అందుకే సర్వేల పేరుతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులను మార్చుతున్నాడు. గెలుపు మనదేనన్న ధీమాతో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇళ్లలో పడుకోవద్దు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల మద్దతు కూడగట్టుకుని, వారిలో చైతన్యం తీసుకురావాలి. జనం ఒక అడుగు ముందుకు వేస్తే నేను 100 అడుగులు వేస్తా.

## బాబు బాటలో సర్పంచ్‌లు

- వైసీపీకి స్థానిక నేతలు గుడ్ బై.. టీడీపీలో ఊపందుకుంటున్న చేరికలు
- అధికార పార్టీపై ప్రజాగ్రహం.. స్థానిక ప్రజాప్రతినిధుల్లోనూ వ్యతిరేకత
- అభివృద్ధి విస్మరించిందని ఆగ్రహం .. పాడేరు నుంచి పలువురు టీడీపీలోకి
- బాబు భరోసాతో 'స్థానికానికి' పూర్వవైభవం వస్తుందని ఆశ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అధికార వైసీపీపై ప్రజల్లో రోజురోజుకూ తీవ్ర వ్యతిరేకత పెరుగుతోంది. పార్టీలోనూ అసమ్మతి, ధిక్కార స్వరాలు పెరుగుతున్నాయి. జగన్‌కు అత్యంత సన్నిహితులుగా ఉన్న ఎమ్మెల్యేలే ఒక్కొక్కరుగా పార్టీ వీడుతున్నారు. నేతల వలసలతో ఉక్కిరిబిక్కిరవుతున్న వైసీపీకి స్థానికంగానూ ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. స్థానిక సంస్థల పూర్వ వైభవానికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఇచ్చిన భరోసాతో ఆ పార్టీలో చేరుతున్నారు. గ్రామాల్లో జనాల నాడిని పసిగట్టిన సర్పంచ్‌లు క్రమంగా అధికార పార్టీని వదిలిపెడుతున్నారు. నిధులు లాక్కొని, విధులివ్వకుండా, కనీసం గౌరవం దక్కనీయకుండా చేస్తున్న జగన్ సర్కార్‌ను సాగనంపేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులుగా పదవులు స్వీకరించి మూడేళ్లవుతున్నా నామమాత్రంగా మిగిలిపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జగన్ సర్కార్ దిగిపోయి చంద్రబాబు వస్తేనే గ్రామాలు బాగుపడతాయన్న భావనకు వచ్చారు. దీంతో టీడీపీ సభలకు హాజరై చంద్రబాబుకు జేజేలు కొడుతున్నారు.

**టీడీపీలో చేరికలు:** స్థానిక ప్రజాప్రతినిధులు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ తలుపులు తడుతున్నారు. గ్రామాల్లో వర్గ విబేధాలు ఉన్నప్పటికీ కొన్నిచోట్ల మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి టీడీపీ నేతలను కలిసి టీడీపీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు మీటింగ్‌లకు వస్తామని చెప్తున్నారు. టీడీపీలోకి చేరే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సంఖ్య రోజుకు రోజుకూ పెరుగుతోంది. పాడేరు నియోజకవర్గం నుంచి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు భారీ సంఖ్యలో విజయవాడ వచ్చి బాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కాగా సుదూర ప్రాంతాల నుంచి విజయవాడ వచ్చి చంద్రబాబు సమక్షంలో చేరడం కష్టమవుతుందని, ఆయా జిల్లాల్లో చంద్రబాబు నిర్వహించే "రా కదలి రా" సభలకు హాజరై పార్టీలో చేరాలని టీడీపీ నేతలు సూచించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతాల వారీగా జరుగుతున్న చంద్రబాబు సభలకు వచ్చి ఎక్కడికక్కడ పార్టీలో చేరుతున్నారు. 29వ తేదీ లోపు 21 పార్లమెంట్ నియోజకవర్గాల్లో జరిగే చంద్రబాబు సభల్లో భారీగా టీడీపీలో చేరనున్నారు. దీంతో పాటు ఎక్కడికక్కడ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, యువనేత లోకేశ్ సమక్షంలో పార్టీలోకి చేరుతున్నారు.

**చంద్రబాబు భరోసా:** ఈ నెల 4న విజయవాడలో చంద్రబాబు సర్పంచ్‌ల సమర శంఖారావం సభను పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. దీంతో చంద్రబాబు వచ్చే ఎన్నికల తర్వాత టీడీపీ అధికారంలోకి వస్తుందని, స్థానిక సంస్థలకు పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారికి భరోసా దక్కింది. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థలకు ఇచ్చిన ప్రాధాన్యం గుర్తు చేసుకుంటున్నారు. లోకేశ్ మంత్రిగా ఉన్నప్పుడు స్థానిక సంస్థలు ఒక వెలుగు వెలిగాయని, టీడీపీ మళ్లీ వస్తే అదే రకంగా అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నారు.

### బాబు ఇచ్చిన హామీలివే..

- స్థానిక సంస్థలకు నిధులు, విధులు, గౌరవం అందిస్తాం.
- ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో 5 శాతం వాటా కేటాయిస్తాం.
- ప్రభుత్వం ఆపేసిన అన్ని రకాల సెస్‌లను స్థానిక సంస్థలకు పునరుద్ధరిస్తాం.
- ఉపాధి హామీ పథకం పనులన్నీ గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చేపడతాం.
- సర్పంచ్‌ల నేతృత్వంలోనే గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తాం.
- గ్రామాల్లో ప్రతి సంక్షేమ పథకం సర్పంచ్‌ల చేతుల మీదుగానే జరిగేలా చర్యలు తీసుకుంటాం.
- ప్రభుత్వం నిలిపేసిన పెండింగ్ బిల్లులన్నీ వడ్డీతో సహా చెల్లిస్తాం.
- స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వమిచ్చిన ఆర్థిక సంఘం నిధులు పూర్తిగా అందేలా చేస్తాం.
- రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు చేసి నిధులు, విధులు ఇచ్చి స్థానికసంస్థలను పరిపుష్టి చేస్తాం.
- ప్రతి ఏటా ప్రతిభ చూపించిన స్థానిక సంస్థలకు అవార్డులిచ్చి ప్రోత్సహిస్తాం.
- గ్రామ పంచాయతీలకు విరివిగా అభివృద్ధి పనులు కల్పించి గ్రామాలు సంపూర్ణ స్వయం సమృద్ధి సాధించేలా అన్ని ఏర్పాట్లు చేస్తాం.
- సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రూ.10 వేలు, జడ్పీటీసీ, ఎంపీపీలకు రూ.15 వేలు, జడ్పీటీసీలకు రూ.50 వేలు ఇస్తాం.


విశాఖలోని ఎండాడలో ఉన్న వైసీపీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్.కోట, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలు

## సమన్వయకర్తలకు సెగ

- ఎస్.కోట, అరకు నియోజకవర్గాల్లో మార్చాల్సిందేనంటూ నేతల పట్టు
- విశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన
- గుంటూరు జిల్లా ప్రత్తిపాడులోనూ అసమ్మతి


గుంటూరులో జరిగిన సమావేశానికి హాజరైన మాల సంఘం నాయకులు

ఎండాడ(విశాఖసిటీ)/ప్రత్తిపాడు(గుంటూరు), జనవరి 7: అధికార వైసీపీ.. కొత్తగా నియమించిన నియోజకవర్గాల ఇన్‌చార్జిలపై అసమ్మతి పెల్లుబుకుతోంది. పలుచోట్ల సమన్వయకర్తలను మార్చాల్సిందేనంటూ స్థానిక నాయకులు పట్టుబడుతున్నారు. ఆందోళనలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. తాజాగా విజయనగరం జిల్లా శృంగవరపుకోట, అల్లూరి సీతారామరాజుజిల్లా అరకు సమన్వయకర్తలను మార్చాలని డిమాండ్ చేస్తూ ఈ నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నేతలు ఆందోళనకు దిగారు. ఆదివారం విశాఖలోని ఎండాడలో ఉన్న వైసీపీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు పెద్ద ఎత్తున తరలివచ్చి, నినాదాలతో హోరెత్తించారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు ఈసారి టికెట్ ఇవ్వొద్దని అక్కడి నాయకులు డిమాండ్ చేశారు. ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉందని, 'గడపగడపకు' సరిగ్గా నిర్వహించలేదని ఆరోపించారు. ఐప్యాక్ టీమ్ ఆయన దగ్గర ప్యాకేజీ తీసుకుని తప్పుడు నివేదికలు ఇచ్చిందన్నారు. స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీ మాధవిని(ఈమె సొంతూరు పాడేరు పరిధిలో ఉంది) అరకు అసెంబ్లీ స్థానానికి సమన్వయకర్తగా నియమించడాన్ని అక్కడి నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఐదు రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పలు మండలాల నాయకులు విశాఖ వచ్చి వైసీపీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. 'మాధవి గో బ్యాక్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వైసీపీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి అసమ్మతి నాయకులు వినతిపత్రాలు అందజేశారు. విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తానని సుబ్బారెడ్డి వారికి హామీ ఇచ్చారు.

### ప్రత్తిపాడులో..

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో మాల సామాజిక వర్గం నుంచి వైసీపీకి వ్యతిరేక పవనాలు మొదలయ్యాయి. వైసీపీలో ఉన్న మాల సంఘం నాయకులు తొలిసారి సమావేశమై తమ భవిష్యత్తుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించే పనిలో పడ్డారు. తొలి నుంచి వైసీపీకి బలంగా ఉన్న ఆ సామాజిక వర్గం ప్రత్తిపాడు ఇన్‌చార్జిగా నియమితులైన బలసాని కిరణ్ కుమార్‌కు వ్యతిరేకంగా గళం విప్పింది. గుంటూరు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో మాల సంఘం నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. ప్రత్తిపాడులో ఎక్కువ శాతం ఓట్లున్న తమ సామాజిక వర్గానికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన బలసాని నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల మరణించిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి వద్దకు వెళ్లిన ఆయన.. అదే రోజు మాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి జ్ఞాపకార్థ కూటమికి వస్తున్నానని చెప్పి కూడా వెళ్లకపోవడాన్ని వారు తప్పుబడుతున్నారు. ఆయన వద్ద మాదిగలకే ప్రాధాన్యం ఉంటుందని, మాలలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని భావిస్తున్నారు. రావిపాటివారిపాలెం కమ్యూనిటీ స్థలంలో నివాసం ఉంటున్న మాల సామాజిక వర్గానికి చెందిన గృహాలను కూల్చివేసే ప్రయత్నంలో బలసాని పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తం చేశారు. 45వేల ఓట్లు ఉన్న తమకు ఏ పార్టీ ప్రాధాన్యం ఇస్తే వారికే మొగ్గు చూపేందుకు వీరు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మాలల వ్యతిరేకతా రాగంతో ప్రత్తిపాడు వైసీపీలో ప్రకంపనలు మొదలయ్యాయి. ప్రత్తిపాడు ఎంపీపీ భర్త చెంచు రామారావుతో పాటు సీనియర్ వైసీపీ నాయకుడు వాడపల్లి ఫ్రాన్సిస్, నడింపాలెం ఎంపీటీసీ వాసిమళ్ల మాణిక్యరావు, మాజీ ఎంపీటీసీ భాగ్యారావు, మామిడి అశోక్, తుమ్మలపాలెం ఎంపీటీసీ భర్త ఏసోబు, కొండేపాడు వైస్ ప్రెసిడెంట్ మేరిబాబు, నేలపాటి అనిల్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరు కావడం వైసీపీని కలవరపాటుకు గురిచేసింది.

## క్రైస్తవులు, దళితులు వైసీపీకి ఓటేయొద్దు

- కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం పిలుపు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 7: దేశంలో మాదిరిగానే రాష్ట్రంలోనూ 'ఇండియా' తరహా కూటమి ఏర్పాటు చేస్తున్నామని, బీజేపీ వ్యతిరేక శక్తులన్నింటినీ కలుపుకొని కొత్త కూటమి ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జేడీ శీలం అన్నారు. దళితులను వంచించి దగాచేసిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో దళితులు, క్రైస్తవులు ఓటు వెయ్యరాదని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం రాజమహేంద్రవరంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'సామాజిక సమాలోచన' అంశంపై సమావేశం జరిగింది. అనంతరం జేడీ శీలం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ఏర్పాటుకోసం 9 మంది సీనియర్ నేతలతో కూడిన బృందం జిల్లాల్లో పర్యటిస్తూ బీజేపీ వ్యతిరేక పార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర కుల, సామాజిక సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం కాకినాడ, మంగళవారం విశాఖలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సంక్రాంతి తర్వాత రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో పర్యటిస్తామని తెలిపారు. వైఎస్ షర్మిల రాకతో పార్టీలో ఉత్సాహం పెరిగిందన్నారు. పార్టీ పునర్నిర్మాణం జరగాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని శీలం అన్నారు.

# జగన్‌కు ఇప్పుడంతా 'రివర్స్'!

(మొదటి పేజీ తరువాయి)

నాలుగున్నరేళ్లుగా తమ ముఖమే చూడని సీఎం నుంచి.. ఇప్పుడు స్వయంగా ఫోన్లు వస్తున్నా వారు స్పందించడం లేదు. వచ్చిన దూతలతో.. ఇన్నాళ్లూ పడిన అవమానాలు చాలని ముఖంపైనే చెప్పేస్తున్నారు. 'వైఎస్‌పై అభిమానంతో జగన్ వెంట వచ్చాం.. ఇన్నాళ్లూ మాకు టీడీపీ, జనసేనలోకి దారిలేదని హీనంగా చూశారు.. ఇప్పుడు కాంగ్రెస్ దారి దొరికింది..' అని అంటున్నారు. కొందరు అధికారులు కూడా క్రమంగా దూరం జరుగుతున్నారు. సినిమా వాళ్లను పిలిచినా వచ్చే పరిస్థితి లేదు.. ఆఖరికి ఆటగాళ్లు కూడా నిష్క్రమిస్తున్నారు. జగన్‌కు ఏమైనా చెప్పడానికి కూడా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు భయపడతారు. అలాంటిది అంగన్వాడీలు, పురపాలికల పారిశుధ్య కార్మికులు ఆయన్నే భయపెడుతున్నారు. ఉవ్వెత్తున ఉద్యమిస్తున్నారు. ఈ పరిణామాలకు తోడు సొంత చెల్లి తన ఓట్లకు గండికొట్టేందుకు సిద్ధమవడం, ఆమెకు కన్నతల్లి బాసటగా నిలవడంతో జగన్ ఉక్కిరిబిక్కిరవుతున్నారని వైసీపీ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల సమయంలో 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని జగన్ అన్నారు. పోలవరం ప్రాజెక్టు, మద్యపాన నిషేధం.. ఏటా జాబ్ కేలెండరు, భారీ డీఎస్సీ.. గద్దెనెక్కిన వారంలోగా ఉద్యోగులకు సీపీఎస్ రద్దు.. వంటి అనేక హామీలిచ్చాడు. అధికారంలోకి రాగానే మాట మార్చారు.. మడమా తిప్పారు.. కరెంటు చార్జీల పెంపు, పెట్రో ధరలపై బాదుడు, చెత్త పన్ను, ఆస్తి పన్ను పెంపు వంటివాటితో జనం నడ్డి విరిచారు. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించేశారు.. ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో ఒంటరయ్యారు. ఒకప్పుడు అందరితో విభేదించి ఆయన కోసం వచ్చిన వారు ఇప్పుడు దండం పెట్టేసి వెళ్లిపోతున్నారు. ఎన్నికల్లో ఇబ్బంది పెట్టగల సత్తా ఉన్న వారితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే ఫోన్లు ఎత్తడం లేదు. బహిరంగంగానే ఎదురు తిరుగుతున్నారు. అందుకు కారణం మారిన పరిస్థితులే. ఏ వర్గాన్ని కదిపినా జగన్‌ను తిట్టడమే తప్ప.. సంతోషంగా ఉన్నామని పది మందిలో ఇద్దరు కూడా చెప్పలేదు. చంద్రబాబు అరెస్టు, జనసేనతో పొత్తు, పొరుగు రాష్ట్రంలో కేసీఆర్ ఓటమి, కాంగ్రెస్‌లో చేరిన షర్మిల.. రోడ్డెక్కిన ఉద్యోగులు, విద్యుత్ ఇతర బాదుడుతో రగిలిపోతున్న సామాన్యులను గమనించిన వైసీపీ నేతలు.. 'జగనా.. నీకో దండం' అంటున్నారు.

### మాట్లాడే ప్రసక్తే లేదు..

వైఎస్‌పై అభిమానంతో ఆయన కుమారుడిని నమ్మి వైసీపీలో చేరాం.. కష్టకాలంలోనూ జగన్ వెంట నడిచాం.. అధికారంలోకి వచ్చాక ఒక్క పని చేయకున్నా భరించాం.. సకల శాఖల మంత్రి నుంచి ఏ ఆదేశం వచ్చినా శిరసావహించాం.. పార్టీ ఆదేశాల మేరకు గడపగడపకు వెళ్లి ప్రజలతో తిట్లు తిన్నాం.. అయినా ఒక్క నిమిషం సొంత పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం సమయం ఇవ్వలేరా.? నియోజకవర్గాల ఇన్‌చార్జులను మార్చిన చోట అసమ్మతి నేతలకు తాడేపల్లి నుంచి సజ్జల ఫోన్లు చేస్తున్నారు. ఎక్కువ మంది ఫోన్లు ఎత్తడం లేదు. మాట్లాడిన కొందరు మాత్రం.. 'ఇప్పటి వరకూ హీనంగా చూసి.. ఇప్పుడు గుర్తుకొచ్చామా' అని నిలదీస్తున్నారు. టికెట్లు ఇవ్వలేని వాళ్లను దూతల ద్వారా ఊరడించే ప్రయత్నం చేస్తున్నారు. దూతలను వారి వద్దకు పంపి.. వచ్చేది మన ప్రభుత్వమే.. రేపు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని చెబుతున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఇలా కనీసం పది మందికి చెబుతున్నారంటూ పుట్టపర్తి నియోజకవర్గంలోని కడపల మోహన్‌రెడ్డి ప్రశ్నించినట్లు తెలిసింది. జగన్ మాటగా చెబుతున్నామని అనగానే.. 'మాట మీద నిలబడేందుకు అందరూ వైఎస్‌ఆర్‌లు కాదులే.. నేను టీడీపీకి మద్దతివ్వను.. రాజన్న కుమార్తెతో ఉంటాం' వారి బదులిచ్చారు.

### మూగవోయిన కూలి మీడియా...

వైసీపీకి తిరుగులేదు.. జగన్‌కు ఎదురు లేదంటూ నాలుగేళ్లుగా ఊదరగొట్టిన కూలి మీడియా కొన్ని రోజులుగా మూగబోయింది. తాడేపల్లిలో రోజూ కనిపిస్తున్న దృశ్యాలు, క్షేత్రస్థాయిలో వీస్తోన్న ఎదురు గాలి, సొంత పార్టీ కార్యకర్తలే ఎదురు తిరుగుతున్న తీరు.. తాడేపల్లికి వచ్చే సాహసం కూడా చేయలేని చిన్న ఉద్యోగులు బాహాటంగా మండిపడుతున్న దృశ్యాలు వాటి కెమేరాలకు కనిపించట్లేదు. నిన్నటి వరకూ జగన్ దేవుడన్న ఎమ్మెల్యేలే ఇప్పుడు బహిరంగంగా తిడుతున్నారు. ఇంటి నిండా ఫొటోలు పెట్టుకుని ప్రతి రోజూ దండం పెట్టుకునే రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి లాంటి వాళ్లు తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి.. సీఎం దర్శనం కోసం వారం రోజులు ఎదురుచూస్తే.. సలహాదారుతో టికెట్ లేదని చెప్పించారు. 'ఇంత అవమానం జీవితంలో పడలేదు.. నీకో దండం..' అని ఆయన చెప్పారు. ఇంట్లో మనిషిలా ఉండే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే పదవి వదిలేయడంతో పాటు ఏకంగా పార్టీకే గుడ్‌బై చెప్పారు. దగ్గరి బంధువైన బాలినేని శ్రీనివాస రెడ్డి ఊగిసలాటలో ఉండగా.. ఇటీవలే పార్టీ కండువా వేసుకున్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు.. టెస్ట్ మ్యాచ్ ఆడినన్ని రోజులు కూడా వైసీపీలో ఇమడలేకపోయారు. ఇలా వరుసగా ఒక్కొక్కరు బయటికి వెళ్లిపోతుంటే టీడీపీ, జనసేనతోపాటు కాంగ్రెస్‌లోకి సైతం చేరికలు మొదలయ్యాయి.



టీడీపీ కార్యకర్త చంద్రమోహన్‌ను స్టేషన్ ఆవరణలో నగ్నంగా తిప్పుతున్న పాల్తూరు పోలీసులు

## నగ్నంగా తిప్పుతూ.. బూటు కాళ్లతో తంతూ..

- వైసీపీ జెండా దించాలన్నందుకు పాల్తూరు పోలీసుల దాష్టీకం
- వైసీపీ నేతల తప్పుడు ఫిర్యాదుతో కేసు.. టీడీపీ కార్యకర్తపై జులుం
- పక్కటెముక విరిగినా జైలుకు పంపిన వైనం

విడపనకల్లు, జనవరి 7: వైసీపీ పాలనలో కొందరు పోలీసులు ఆ పార్టీ నేతలకంటే దారుణంగా తయారయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలంలో జరిగిన ఘటనే తాజా ఘటనే ఇందుకు నిదర్శనం!. మండలంలోని పాల్తూరు స్టేషన్ పోలీసులు చీకలగురికి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చంద్రమోహన్‌ను దుస్తులు ఊడదీయించి, బూటుకాళ్లతో తంతూ.. పిడిగుద్దులు గుద్దుతూ.. స్టేషన్ ఆవరణలో నగ్నంగా తిప్పారు. వైసీపీ జెండాను తొలగించి దాని స్థానంలో జాతీయ జెండా ఎగురవేయాలని కోరాడనే.. అతడిపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించారు. పోలీసులు కొట్టిన దెబ్బలకు చంద్రమోహన్ పక్కటెముక విరిగినప్పటికీ.. అతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ నెల 1న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా.. డిసెంబరు 31వ తేదీ రాత్రి చీకలగురికి గ్రామ సచివాలయం ముందున్న వైసీపీ జెండాను తొలగించి, జాతీయ జెండా ఎగురవేయాలని టీడీపీ కార్యకర్త చంద్రమోహన్ వైసీపీ కార్యకర్తలను కోరాడు. వారు ఒప్పుకోకపోవడంతో.. వైసీపీ జెండాను కిందకు దించకపోతే, తానే తొలగించి తగలబెట్టేస్తానని చంద్రమోహన్ అన్నాడు. దీంతో వారు చంద్రమోహన్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం, తమ పార్టీ జెండాను తొలగించి తగలబెట్టాడని వైసీపీ కార్యకర్తలు పాల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వారు జనవరి 1న చంద్రమోహన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనను ఎందుకు స్టేషన్‌కు తీసుకెళ్తున్నారంటూ అతడు ప్రశ్నించడంతో.. తమకే ఎదురు మాట్లాడతావా అంటూ పోలీసులు.. చంద్రమోహన్ దుస్తులు ఊడదీయించి, బూటు కాళ్లతో తంతూ, పిడిగుద్దులు గుద్దుతూ చితకబాదారు. అంతటితో ఆగకుండా స్టేషన్ ప్రాంగణంలో నగ్నంగా తిప్పుతూ చితకబాదారు. అరెస్టు చూపి జైలుకు తరలించగా, 4వ తేదీన ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేశారు. అయితే, పోలీసు దెబ్బలకు ఒళ్లంతా హూనమై.. ఆరోగ్యం క్షీణించడంతో అతడిని అదేరోజు కుటుంబ సభ్యులు ఉరవకొండ ఆస్పత్రిలో చేర్చారు. కాగా, పాల్తూరు పోలీసులు.. చంద్రమోహన్‌ను స్టేషన్ ప్రాంగణంలో నగ్నంగా తిప్పుతుండగా కొందరు వీడియో తీసి, సోషల్ మీడియాలో పెట్టారు. దీనిపై పోలీసులను సంప్రదించగా.. తాము చంద్రమోహన్‌ను కొట్టలేదనీ, కేసు నమోదు చేసి జైలుకు పంపామని వివరణ ఇచ్చారు.

## దళిత రైతుపై వైసీపీ నేతల దాడి

- భూ వివాదంలో జోక్యం
- ఫిర్యాదు తీసుకోని పోలీసులు..



గాయాలతో రామాంజనేయులు

ఉరవకొండ, జనవరి 7: పొలం విషయంలో అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామానికి చెందిన దళిత రైతు రామాంజనేయులును అదే ఊరికి చెందిన వైసీపీ నాయకులు ఆదివారం తీవ్రంగా కొట్టి గాయపరిచారు. దీనిపై పోలీసులు కనీసం స్పందించకపోవడంతో బాధితుడు ఉరవకొండ పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన తెలిపాడు. రామాంజనేయులుకు గ్రామ సమీపాన ఎకరాన్నర పొలం ఉంది. ఈ భూమిపై బంధువులతో వివాదం తలెత్తింది. ఇందులో గ్రామానికి చెందిన వైసీపీ నేతలు కలుగజేసుకున్నారు. ఈ నేపథ్యంలో స్వగ్రామం వెలిగొండ నుంచి ఉరవకొండకు ఆదివారం పని నిమిత్తం వెళ్తుండ గా.. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఎంపీపీ నరసింహులు కుమారుడు శివానంద, శివకుమార్, మోహన్, రాజేష్, శివకుమార్ విచక్షణారహితంగా రామాంజనేయులుపై దాడి చేశారు. కులం పేరుతో దూషించారు. కాగా, రక్త గాయాలతో పోలీసు స్టేషన్‌కు వెళ్లగా ఫిర్యాదు తీసుకోకపోవడంతో రైతు రామాంజనేయులు, అతడి భార్య అక్కడే బైఠాయించారు.

# ముక్కంటీ .. మూడో కన్ను

## భూదందాల నుంచి గ్రావెల్ తవ్వకందాకా ఎమ్మెల్యే నామస్మరణే

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

శతకకారులకు ప్రసిద్ధి పొందిన ఆ ముక్కంటి క్షేత్రంలో ఇప్పుడు ఎటుచూసినా ఆ శాసనసభ్యుని నామస్మరణే! బియ్యం గుప్పిట పట్టినట్టు భూములను కబళిస్తారని ఆయన గురించి తెలిసినవారు చెప్పేమాట! ఆయన నియోజకవర్గంలో ప్రభుత్వ భూములకే గ్యారంటీ లేదు. ఎక్కడ ఏ భూ దందా జరిగినా ఆయన పేరే వినిపిస్తుంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీల నేతలు అత్యధికంగా అవినీతి ఆరోపణలు చేయడం, ఫిర్యాదులకు అంతే లేకపోవడంతో రాష్ట్రమంతా ఆయన 'ఖ్యాతి' ఇప్పుడు మారుమ్రోగిపోతోంది. ఇద్దరు తహసిల్దార్ల విషయంలో సీఎంవో నుంచి జిల్లా కలెక్టరు దాకా ఏకం చేసి పారేశారు. కొందరు రెవిన్యూ అధికారుల అండతో విలువైన ప్రభుత్వ, డీకేటీ భూములు అక్రమంగా చేతులు మార్చి.. రూ. కోట్లు పోగేసుకుంటున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఉదాహరణకు.. ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేయడానికి పెద్దఎత్తున భూములు సేకరిస్తోంది. విమానాశ్రయం, ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్లు వంటివి ఉండటంతో ముఖ్యనేత నియోజకవర్గంలో ఈ ప్రక్రియను విస్తృతంగా చేపట్టారు. ఈ క్రమంలో ఇక్కడి భూములకు విపరీతమైన విలువ పెరిగింది. దీన్ని సొమ్ము చేసుకునేందుకు ముఖ్య నేత పావులు కదిపారు. ప్రభుత్వ బంజరు, పోరంబోకు భూములు, కాలువ, కుంట, చెరువు పోరంబోకు భూములు, అనాధీనం, గయ్యాళు వంటి అనేక కేటగిరీలకు చెందిన భూములకు అక్రమంగా పట్టాలు జారీ చేస్తున్నారు. తనకు అనుకూలురైన వారి పేరిట పట్టాలు జారీ చేసి, ఆ భూములను పారిశ్రామికవాడల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియలో ప్రభుత్వానికే అప్పగించి తద్వారా పరిహారం పేరిట అప్పనంగా భారీ మొత్తాలు పొందుతున్నారని చెబుతున్నారు. డీకేటీ పట్టాలు పొందిన వారి పేర్లను రెవిన్యూ రికార్డుల్లో ఇతరుల పేరిట ఇక్కడ మార్చేస్తున్న ఉదంతాలు కోకొల్లలు!




### కోట్లు కొల్లగొడుతున్నారు

డీకేటీ పట్టాలు పొంది ఆ తర్వాత సుదూర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి భూములు, వారసులు లేకుండా చనిపోయిన వారి భూముల వివరాలు రెవిన్యూ అధికారులు పక్కాగా సమాచారం సేకరించి వాటి రికార్డులను తారుమారు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే పట్టాలు కేటాయించని బంజరు భూములకు రికార్డులు సృష్టించడం, ముఖ్యనేత సూచించిన పేర్లతో పట్టాలు జారీ చేయడం వంటివి జరుగుతున్నాయి. మాజీ సైనికుల పేరిట కూడా పట్టాలు జారీ చేస్తున్నారు. వీటిలో వెంచర్లు వేసి చుట్టుపక్కల సెటిల్‌మెంట్ భూముల సర్వే నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేసి విక్రయించేస్తున్నారు. ఇటీవల ఓటీఎస్ విధానంలో స్థలాలను రిజిస్టర్ చేసి విక్రయిస్తున్నారు. డీకేటీ భూముల్లో ఈ దందాలో అటు ముఖ్యనేతకు, ఇటు రెవిన్యూ అధికారులకు రూ. కోట్లు దక్కాయని చెబుతున్నారు. ఇక భూసేకరణపరంగా కూడా ప్రభుత్వ భూమిని ప్రభుత్వానికే అప్పగించి రూ. కోట్లు కొట్టేస్తున్నారు.

### ఒకరి మండలానికి ఒకరు.. ఇదే నేత నీతి!

ముఖ్య నేత నియోజకవర్గం పరిధిలోని రెండు మండలాల తహశీల్దార్లపై తీవ్ర అవినీతి ఆరోపణలున్నాయి. వేరే జిల్లాలో పని చేస్తుండగా, వెబ్‌ల్యాండ్‌లో భూముల వివరాల నమోదులో అక్రమాలకు పాల్పడ్డారని వీరిలో ఒకరిపై ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. అక్రమాలు వాస్తవమేనని తేలడంతో ఎమ్మెల్యే నియోజకవర్గం ఉన్న జిల్లాకు బదిలీ చేశారు. అయితే, తహశీల్దారు పోస్టు నుంచీ డిప్యూటీ తహశీల్దారుగా రివర్షన్ ఇచ్చారు. అయితే ఈ ఉత్తర్వులు అమలు కాకుండా ఎమ్మెల్యే సీఎంవో స్థాయిలో ఒత్తిడి తెచ్చి అడ్డుకున్నారని ప్రచారం జరిగింది. తర్వాత కూడా ఫిర్యాదులు అధికంగా వెళ్లడంతో కలెక్టర్‌కు సరెండర్ చేసింది. అలాగే, రేణిగుంట తహశీల్దారుపైనా భారీగా అవినీతి ఆరోపణలు కావడంతో ఆయననూ కలెక్టరుకు ప్రభుత్వం సరెండరు చేసింది. అయితే ఈ వ్యవహారంలో కూడా ఎమ్మెల్యే వారిపై చర్యలను అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం వారు కలెక్టరేట్‌లోని సెక్షన్లలో విధులు నిర్వహించాలి. అయితే, తిరిగి తన నియోజకవర్గంలోనే మండల తహశీల్దార్లుగా వారిని నియమించాలని నేత పట్టుబట్టినట్టు సమాచారం. చివరకు చేసేది లేక.. ఒకరి మండలం మరొకరికి మార్చి, తూతూ మంత్రం బదిలీలతో ఆ తహసిల్దార్లను ముఖ్య నేత నియోజకవర్గానికే పంపించారు.

### బావమరిది ఆత్మహత్యాయత్నం

తన ఆస్తి కొట్టేసేందుకు అధికారులను అడ్డుపెట్టుకుని ముఖ్య నేత వేధిస్తున్నారంటూ అయన సొంత బావమరిది (భార్య తమ్ముడు) ఆత్మహత్యకు యత్నించడం ఏడాది కిందట కలకలం రేపింది. 2022 డిసెంబరు 3న ఈ ఘటన జరిగింది. కత్తితో గాట్లు పెట్టుకుని ఆయన బావమరిది ఆత్మహత్యకు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. పాతికేళ్లుగా బావ ఆనందం కోసమే తపించానని, బావను ఎమ్మెల్యే చేయడం కోసం సగం ఆస్తిని పోగొట్టుకున్నానని, తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చినందుకు ఇప్పుడు తననే ఇబ్బందులు పెడుతున్నారని ఆయన వాపోయారు. మిగిలిన ఆస్తి కోసం తనను చంపేస్తారా అంటూ పోస్టు చేసిన సెల్ఫీ వీడియోలు సోషల్ మీడియాలో అప్పట్లో వైరల్ అయ్యాయి.

### కాలువ పోరంబోకులో పాగా

ముక్కంటి క్షేత్ర పట్టణంలోని డిగ్రీ కాలేజీకి ఎదురుగా వున్న ఈదులగుంట కాలువ పోరంబోకు భూమి 60 సెంట్ల మేరకు మూడేళ్ల కిందట కబ్జాకు గురైంది. రూ. 6 కోట్ల విలువైన భూమి ఇది. కాలువ పోరంబోకు భూమిని కబ్జా చేసి కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారు. ఎమ్మెల్యే సన్నిహిత అనుచరుడి పేరు ఈ వ్యవహారంలో ప్రముఖంగా వినిపిస్తున్నా.. సూత్రధారి ఎమ్మెల్యేయేనని చెబుతున్నారు.

### పోలీస్ బెటాలియన్ భూమి ఆక్రమణ

పోలీస్ బెటాలియన్ భూమి ఆక్రమణకు గురికావడం కీలక నేత కబ్జాల కావ్యంలో హైలెట్ అని చెబుతారు. నియోజకవర్గం మీదుగా పోతున్న జాతీయ రహదారి పక్క పది ఎకరాల్లో వెంచర్ వేసే ప్రయత్నాలు జరిగాయి. దానికోసం భూమిని చదును చేశారు. పనిలో పనిగా పోలీస్ బెటాలియన్‌కు చెందిన భూమిని కూడా కలిపేసుకున్నారు. దాన్ని కూడా చదును చేశారు. ఆలస్యంగా విషయం తెలిసి బెటాలియన్ అధికారులు అడ్డుకున్నారు. అయినా కబ్జాదారులు వెంచర్ ఏర్పాటు ప్రయత్నాలు విరమించకపోవడం గమనార్హం. కారణం విదితమే!

### చెరువులు, గుట్టలు గుల్ల

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వకాలు, రవాణా, విక్రయాల దందాలో కూడా అధికార పార్టీ కీలక నేత పేరు పెద్దఎత్తున ప్రచారంలో వుంది. నియోజకవర్గం మీదుగా పూతలపట్టు-నాయుడుపేట ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతుండడంతో భారీ పరిమాణంలో గ్రావెల్ అవసరమవుతోంది. దీన్ని అవకాశంగా తీసుకున్న వైసీపీ ముఖ్యనేత కేవలం గ్రావెల్ దందాలోనే రూ.వంద కోట్లు ఆర్జించినట్టు సమాచారం. ఆ క్రమంలో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలోని గుంటకిందపల్లి చెరువును పూర్తిగా తవ్వేశారు. జాతీయ రహదారి నిర్మాణం కోసం అలాగే కైలాసగిరి ప్రదక్షిణ రోడ్డు నిర్మాణం పేరిట ముక్కంటి దేవస్థానానికి చెందిన గుట్టలన్నీ తవ్వేసి బోడి చేశారన్న ఆరోపణలున్నాయి.

### 'ఢిల్లీ' పరిశ్రమ ఝలక్

పరిశ్రమలకు తానే సమస్యలు సృష్టిస్తారు. ఆ తర్వాత తానే రంగంలోకి దిగి పరిష్కరించినట్టు బిల్డప్ ఇస్తారు. ప్రతిగా భారీ ప్రతిఫలాలు జేబులో వేసుకుంటారు. ప్రధానంగా ఆనేత పరిశ్రమల నుంచి రవాణా కాంట్రాక్టులు దక్కించుకుని ఆర్థికంగా భారీగా లబ్ధి పొందుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఓ ముఖ్య పరిశ్రమ వర్గాలను ఇదేవిధంగా ఇటీవల ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టుల కోసం ఆయన వేధించారు. అయితే పరిశ్రమ వర్గాలు ఢిల్లీస్థాయిలో తమ పలుకుబడి ఉపయోగించడంతో గత్యంతరం లేకపోయింది. దీంతో ఆయన పరిశ్రమకు అనుకూలంగా వ్యవహరించారు. నిజానికి, దీనిని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. అయినా, ఆయన పరిశ్రమకే మద్దతిస్తున్నారు.

### భూముల్లో 30 ఎకరాలు కోత

ముఖ్యనేతకు, రెవెన్యూ అధికారుల మధ్య బలమైన బంధం ఉందని నిన్నటిదాకా కొందరికే తెలుసు. ఓ భూదందా యత్నంతో ఇప్పుడు మొత్తం లోకానికి తెలిసిపోయింది. 2019 డిసెంబరులో పేదలకు ఇళ్ల స్థలాల కోసం 120 ఎకరాల డీకేటీ భూములు సేకరించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. దీనికోసం 63మంది రైతులకు సంబంధించిన 120 ఎకరాల డీకేటీ భూములను అధికారులు సర్వే చేసి గుర్తించారు. 2020 ఫిబ్రవరిలో రైతులకు నోటీసులు జారీ చేశారు. భూములు సేకరిస్తున్నట్టుగా రైతుల సంతకాలు కూడా తీసుకున్నారు. కొవిడ్ కారణంగా కొంతకాలం ఆ ప్రక్రియ ఆగింది. తిరిగి 2022 అక్టోబరులో మళ్లీ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ముఖ్యనేత రంగంలోకి దిగారు. అంతే.. అధికారుల స్వరం మారిపోయింది. 63మంది రైతులకు చెందిన 120 ఎకరాల్లో భౌతికంగా ఉన్నది 90 ఎకరాలేనని, తగ్గిన 30 ఎకరాల్లో కాలువ, రోడ్డు పోరంబోకు భూములు ఉన్నాయని కొత్త వాదన తీసుకువచ్చారు. 2006లో తమకు పట్టాలు ఇచ్చినప్పటి నుంచీ సాగు చేస్తున్నామని, కాలువ పోరంబోకు, రోడ్డు పోరంబోకు ఉంటే తమకు పట్టాలు ఎలా ఇచ్చారని రైతులు నిలదీశారు. పలువురు రైతులు న్యాయస్థానాన్నీ ఆశ్రయించారు. దీంతో మొత్తం వ్యవహారం పెండింగులో పడింది. 30 ఎకరాల కోత వెనుక కీలక నేత, రెవిన్యూ అధికారుల చేతివాటం ఉందని, ఆ భూములను తనకు కావాల్సిన వారి పేరిట పట్టాలు జారీ చేసి ఆ భూములకు పరిహారం పొందే కుట్ర చేశారని ఆరోపణలున్నాయి.

## వైసీపీ ఎమ్మెల్యే కార్యాలయంలో కత్తిపోట్లు

- ఆయన కుమారుడి సమక్షంలో పంచాయితీ
- పరస్పరం దాడికి దిగిన వైసీపీలోని రెండు వర్గాలు
- ఆరుగురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స
- నూజివీడులో ఘటన.. నేతల గోప్యం

నూజివీడు టౌన్, జనవరి 7: నూజివీడు వైసీపీ ఎమ్మె ల్యే కార్యాలయంలో.. ఎమ్మెల్యే కుమారుడి సమక్షంలోనే అదే పార్టీలోని 2 వర్గాలు పరస్పరం కత్తులు దూసుకున్నాయి. ఇరువర్గాలకు చెందిన ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలివీ.. ఏలూరు జిల్లా నూజివీడు పెద్దగాంధీ బొమ్మ సెంటర్లో టీటీడీ స్థలం వద్ద బ్యానర్ల ఏర్పాటు విషయంలో వైసీపీ నాయకులు రంగబాబు, మేకల అనిల్‌ల మధ్య 15 రోజుల క్రితం వివాదం తలెత్తి.. చిలికి చిలికి గాలివానగా మారింది. దీనిపై నూజివీడు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రతాప్ కుమారుడు వేణుగోపాల అప్పారావు సమక్షంలో ఇరు వర్గాలు ఆదివారం సాయంత్రం సమావేశమయ్యాయి. ఇరువర్గా ల మధ్య మాటామాటా పెరిగి బాహాబాహీకి దిగారు.

వీరిలో ఓ వర్గానికి చెందిన నలుగురు వ్యక్తులు అనిల్‌కుమార్‌పై చేయి చేసుకోవడంతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఫ్లెక్సీలను చింపే చిన్నపాటి కత్తులతో ఒకరిపై ఒకరు దాడులకు దిగగా.. అడ్డుకునేందుకు యత్నించిన వైసీపీ నాయకుడు కోటగిరి సందీప్‌తో పాటు మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి గోప్యంగా చికిత్స చేయిస్తున్నారు. ఘర్షణ సమాచారం బయటకు పొక్కడంతో ఇరువర్గాల్లో ఒక వర్గానికి చెందిన ప్రింటింగ్ ప్రెస్‌పై మరోవర్గం కార్యకర్తలు విధ్వంసానికి పాల్పడ్డారు. పోలీసులు ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన టీటీడీ స్థలం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, గాయపడిన వారికి వైద్య సేవలు అందించిన ప్రైవేట్ వైద్యుడు.. పోలీసులకు సమాచారం అందించామని విలేకరులకు చెప్పగా, పోలీసులు మాత్రం తమకు సమాచారం అందలేదన్నారు.



నూజివీడు పెద్దగాంధీబొమ్మ సెంటర్లో పోలీసుల పహారా

### విష సంస్కృతికి అడ్డుకట్టవేయండి: చిన్నం

కత్తులతో దాడులకు దిగే విష సంస్కృతికి పోలీసులు అడ్డుకట్ట వేయాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య డిమాండ్ చేశారు. నూజివీడులో ఇప్పటి వరకు కనీవినీ ఎరుగని రీతిలో కత్తులతో దాడికి దిగటం అదీ ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ సంఘటన జరగడంపై పోలీసులు కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరినట్లు రామకోటయ్య విలేకరులకు తెలిపారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.